VELTHURU TELUGU DAILAY

# వెలుతురు

తెలుగు దిన పత్రిక

హైదరాబాద్
మంగళవారం 12.05.2026

సంపుటి: 07 సంచిక: 339
పేజీలు: 12 వెల: రూ. 5/

SRI SHANTHI PUBLICATIONS PUBLISHED FROM TELANGANA I ANDHRA PRADESH

Velthuru Newspaper



## కేరళ సీఎం ఎంపికలో వీడని ఉత్కంఠ

11

మల్లికార్జున ఖర్గే నేతృత్వంలో కొనసాగుతున్న చర్చలు

మాజీ నేతలు, సీనియర్లతో సంప్రదింపులు జరిపి త్వరలో తుది నిర్ణయం తీసుకునే సూచనలు

# తెలంగాణపై కేంద్ర ప్రభుత్వం వివక్ష

- రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శలు
- మోదీ వ్యాఖ్యలతో ప్రజల్లో భయాందోళనలు
- బీజేపీ ఎంపీలు రాష్ట్ర అభివృద్ధి కోసం ఏమీ చేయలేదు
- కాళేశ్వరం కేసుపై సీబీఐ విచారణ జరిపించండి
- బీసీ కుల గణన, జనగణనలో మార్పులు అవసరం
- ప్రధాని వ్యాఖ్యలు దేశ ఐక్యతకు విరుద్ధంగా ఉన్నాయి
- విచారణలపై ఒత్తిళ్లు తగవని బండి సంజయ్ అంశంలో వ్యాఖ్య
- మహిళల భద్రత, చట్టపరమైన చర్యలపై ప్రభుత్వ స్పష్టత

హైదరాబాద్ వెలుతురు మే 11:

గాంధీ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్ కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ ఇటీవల తెలంగాణ పర్యటన సందర్భంగా చేసిన వ్యాఖ్యలు ప్రజల్లో భయాందోళనలు కలిగించాయని ఆయన అన్నారు. అభివృద్ధి కార్యక్రమాల కోసం వస్తారని భావించిన ప్రజలకు భిన్నమైన సందేశాలు వెళ్లాయని వ్యాఖ్యానించారు. ప్రధాని మోదీ "పెట్రోల్, డీజిల్ వాడవద్దు, బంగారం కొనవద్దు, వంట నూనె వాడవద్దు" వంటి వ్యాఖ్యలు చేయడం సరైంది కాదని మంత్రి అన్నారు. దేశ ..మిగతా 2లో



2

# స్టాలిన్‌తో విజయ్ భేటీ



- తమిళనాడు రాజకీయాల్లో ఆసక్తికర పరిణామం
- డీఎంకే అధినేత నివాసానికి వెళ్లిన సీఎం విజయ్
- సమావేశంలో పాల్గొన్న ఉదయనిధి స్టాలిన్
- రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై చర్చించిన నేతలు
- ఖజానా ఖాళీ చేసిందంటూ డీఎంకేపై విజయ్ విమర్శలు
- అప్పులు పరిమితుల్లోనే ఉన్నాయన్న స్టాలిన్
- కేంద్రంలోని బీజేపీ అడ్డంకులను ఎదుర్కొన్నామని వ్యాఖ్య
- అధికార మార్పు తర్వాత తొలి కీలక భేటీ
- మే 13న అసెంబ్లీలో బలపరీక్ష ఎదుర్కోనున్న ప్రభుత్వం
- ఎలక్షన్ సర్టిఫికేట్ మర్చిపోయి ఆలస్యంగా ప్రమాణం



చెన్నై వెలుతురు మే 11:

విజయ్ నేతృత్వంలో తమిళనాడులో కొత్త ప్రభుత్వం ఏర్పడిన నేపథ్యంలో రాష్ట్ర రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. కొత్త ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన విజయ్.. మాజీ సీఎం ఎంకే స్టాలిన్ తో సోమవారం మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. చెన్నైలోని స్టాలిన్ నివాసానికి వెళ్లిన విజయ్.. ఆయనతో కొంతసేపు సమావేశమయ్యారు. ఈ భేటీలో మాజీ ఉప ముఖ్యమంత్రి ఉదయ నిధి స్టాలిన్ కూడా పాల్గొన్నారు. తమిళనాడు రాజకీయాల్లో తీవ్ర పోటీ నెలకొన్న సమయంలో ఈ సమావేశం జరగడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో టీవీకే ఘన విజయం సాధించి అధికారంలోకి వచ్చిన విషయం తెలిసిందే. అధికార మార్పు అనంతరం విజయ్, స్టాలిన్ ముఖాముఖిగా కలవడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. సమావేశంలో రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించినట్లు సమాచారం. ముఖ్యంగా రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, ..మిగతా 2లో



## గోదావరి పుష్కరాల నాటికి పోలవరం పూర్తి

- ఢిల్లీ పర్యటనలో కేంద్రానికి ముఖ్యమంత్రి చంద్రబాబు విజ్ఞప్తి
- రాష్ట్ర ప్రయోజనాలే లక్ష్యంగా ఢిల్లీలో ముఖ్యమంత్రి వరుస భేటీలు
- 2027 నాటికి పోలవరం పూర్తికి సహకరించాలని కేంద్రానికి విజ్ఞప్తి

అమరావతి వెలుతురు మే 11:

ఆంధ్రప్రదేశ్ జీవనాడి పోలవరం ప్రాజెక్టును నిర్ణీత గడువులోగా పూర్తి చేసి, రాష్ట్ర అభివృద్ధిని పరుగులు పెట్టించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఢిల్లీలో విస్తృతంగా పర్యటించారు. దేశ రాజధానిలో వరుస భేటీలతో బిజీగా గడిపిన ఆయన, రాష్ట్ర ప్రయోజనాలకు ..మిగతా 2లో



## విద్యారంగానికి రూ.1,100 కోట్ల

# అభివృద్ధి పనులు

ఎల్బీ స్టేడియంలో ఘనంగా విద్యా వారోత్సవాలకు ప్రారంభం

3 ప్రభుత్వ పాఠశాలలను దేశ భవిష్యత్ నిర్మాణ కేంద్రాలుగా తీర్చిదిద్దుతాం

11 వేల టీచర్ పోస్టుల భర్తీ..
36 వేల మందికి బదిలీలు

విద్యాశాఖకు బడ్జెట్ కేటాయింపులు 15 శాతానికి పెంపు

ఫిన్‌లాండ్‌కు 25 మంది ఉపాధ్యాయుల పంపిణీ

ప్రభుత్వ స్కూళ్లలో బ్రేక్‌ఫాస్ట్ పథకానికి శ్రీకారం

కుల వివక్ష నిర్మూలనకే ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లు



హైదరాబాద్ వెలుతురు మే 11:

రాష్ట్ర విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. విద్యా వ్యవస్థకు సంబంధించి రూ.1,100 కోట్ల అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్నామని వెల్లడించారు. 'ప్రజాపాలనప్రగతి ప్రణాళిక'లో భాగంగా ప్రభుత్వం నిర్వహిస్తున్న విద్యా వారోత్సవాలను హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో సీఎం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్య ద్వారానే సమాజంలో సమూల మార్పులు తీసుకురాగలమని పేర్కొన్నారు. అందుకే విద్యాశాఖను తానే స్వయంగా పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ ప్రాంతం విద్యా వ్యవస్థ దశాబ్దాలుగా ..మిగతా 2లో



## ఇజ్రాయెల్ ఐరన్ డోమ్ ధ్వంసం

11

- హెజ్‌బొల్లా డ్రోన్ ప్రయోగంతో ఆపరేషన్
- దాడి వీడియో సోషల్ మీడియాలో వైరల్
- ఇజ్రాయెల్ రక్షణ వ్యవస్థపై నేరుగా దాడి
- ఎఫ్‌పీవీ డ్రోన్‌తో ఐరన్ డోమ్ లక్ష్యం



## 40 కోట్ల ఓటర్లపై మూడోదశ వడపోతకు ఈసీ సిద్ధం

22 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ప్రత్యేక సమగ్ర సవరణ

- 22 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ప్రత్యేక సమగ్ర సవరణ
- రాబోయే రోజుల్లో ఓటర్ల జాబితా పరిశీలన ప్రారంభం
- ఇప్పటికే 60 కోట్ల మంది ఓటర్ల వివరాల పరిశీలన పూర్తి
- మిగిలిన 40 కోట్ల ఓటర్ల డేటా పరిశీలనకు కసరత్తు
- ఐదు అసెంబ్లీ ఎన్నికల కారణంగా ఆలస్యమైన ప్రక్రియ
- బిహార్, బెంగాల్ అంశాలపై సుప్రీంకోర్టులో పిటిషన్లు
- ఫిబ్రవరిలోనే రాష్ట్ర ఎన్నికల అధికారులకు ఈసీ ఆదేశాలు
- నకిలీ, డూప్లికేట్, మరణించిన ఓటర్ల పేర్ల తొలగింపుపై దృష్టి
- పారదర్శక ఓటర్ల జాబితా లక్ష్యంగా కేంద్ర ఎన్నికల సంఘం చర్యలు

న్యూఢిల్లీ వెలుతురు మే 11:

కేంద్ర ఎన్నికల సంఘం దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితాలను మరింత పారదర్శకంగా, తప్పులులేని విధంగా రూపొందించేందుకు మూడోదశ ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమానికి సిద్ధమవుతోంది. దేశంలోని 22 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో సుమారు 40 కోట్ల మంది ఓటర్ల వివరాలను పరిశీలిస్తూ రాబోయే రోజుల్లో భారీ స్థాయిలో ఓటర్ల జాబితా వడపోత కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు ఎన్నికల సంఘం అధికారులు సోమవారం వెల్లడించారు. ..మిగతా 2లో



2

## మోదీ పిలుపును స్వాగతిస్తున్నా

- ప్రధాని ప్రతిపాదనపై స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి
- కేంద్రంతో కలిసి పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నాం
- రాజకీయాలకు అతీతంగా తెలంగాణ అభివృద్ధి కోసం సహకారం
- వికసిత్ భారత్‌తో పాటు విజన్-2047 లక్ష్యాల సాధనకు కట్టుబాటు
- 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ లక్ష్యంతో ముందడుగు
- కేంద్రం-రాష్ట్రాలు ఇచ్చిపుచ్చుకునే ధోరణితో పనిచేయాలి



## అమెరికా దేశానికి బయపడుతున్న భారత ప్రభుత్వం

11

రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రసన్నకుమార్ శర్మ

## నెల రోజుల పాటు టీఆర్ఎస్ జెండా పండుగ

రాష్ట్ర రాజధాని నుంచి వార్డు స్థాయి వరకు పార్టీ జెండాలు ఆవిష్కరించాలి

పార్టీ శ్రేణులకు తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత



11

## బెంగాల్ లో కొత్త ప్రభుత్వం సంచలన నిర్ణయం

- బంగ్లాదేశ్ సరిహద్దుల్లో కంచె నిర్మాణానికి భూమి కేటాయింపు
- తొలి కేబినెట్ సమావేశంలో కీలక నిర్ణయాలు
- బీఎస్ఎఫ్‌కు భూమి కేటాయిస్తూ కొత్త ప్రభుత్వ తొలి నిర్ణయం
- బంగ్లాదేశ్ సరిహద్దుల్లో కంచె నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్





2



11

## జన గణన ఫారంలో బీసీల గుర్తింపు చేర్చాలి

- కేంద్రం ప్రభుత్వానికి మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి
- జన గణనలో కాలమ్ 13 అంశంపై కేంద్రానికి వినతి
- ఎస్సీ, ఎస్టీ తరహాలో బీసీల డేటా కూడా సేకరించాలని డిమాండ్
- ప్రధాని నరేంద్ర మోదీతో భేటీ
- గృహాల ఐడెంటిఫికేషన్ సర్వేలో బీసీలను చేర్చాలని సూచన

# మోదీ పిలుపును స్వాగతిస్తున్నా

హైదరాబాద్ వెలుతురు మే 11:

ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన "కలిసి ముందుకు సాగుదాం" అనే పిలుపును తెలంగాణ ప్రభుత్వం సానుకూలంగా స్వీకరిస్తోందని సీఎం Revanth Reddy స్పష్టం చేశారు. సోమవారం మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడిన ఆయన.. రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో కేంద్ర ప్రభుత్వంతో కలిసి పనిచేయడానికి తమకు ఎలాంటి అభ్యంతరం లేదని తెలిపారు. రాజకీయ భేదాలు సహజమని, కానీ అభివృద్ధి విషయంలో పరస్పర సహకారం అవసరమని పేర్కొన్నారు. ఆదివారం ప్రధాని అధికారిక కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా కేంద్రరాష్ట్ర సంబంధాలపై జరిగిన చర్చలను ఆయన ప్రస్తావించారు. ప్రధాని మోదీ చేసిన పిలుపులో రాజకీయ కోణం లేదని, దేశ అభివృద్ధి లక్ష్యాల సాధనకోసమే ఆహ్వానం ఇచ్చారని వ్యాఖ్యానించారు. తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని కేంద్రంతో కలిసి పనిచేయడం తమ బాధ్యతగా భావిస్తున్నామని చెప్పారు. రాష్ట్ర అభివృద్ధిని వేగవంతం చేయడానికి కేంద్ర సహకారం ఎంతో కీలకమని సీఎం అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా మౌలిక వసతులు, పరిశ్రమలు, ఐటీ రంగం, వ్యవసాయం, రవాణా, పట్టణాభివృద్ధి వంటి విభాగాల్లో కేంద్ర మద్దతు అవసరమని పేర్కొన్నారు. తెలంగాణ ఇప్పటికే అనేక రంగాల్లో దేశానికి ఆదర్శంగా నిలిచిందని, భవిష్యత్తులో మరింత పెద్ద ఆర్థిక శక్తిగా ఎదగాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. "వికసిత్ భారత్" లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ముందుకు సాగుతున్నట్లే, తెలంగాణ ప్రభుత్వం కూడా "విజన్2047" రూపకల్పనపై పనిచేస్తోందని రేవంత్‌రెడ్డి తెలిపారు. దేశ స్వాతంత్ర్య శతాబ్దికి చేరుకునే సమయానికి తెలంగాణను అత్యున్నత అభివృద్ధి రాష్ట్రంగా తీర్చిదిద్దడమే తమ సంకల్పమని చెప్పారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను 3 ట్రిలియన్ డాలర్ల స్థాయికి తీసుకెళ్లే దిశగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని వెల్లడించారు. ఈ లక్ష్య సాధనకు పెట్టుబడులు ఆకర్షించడం, పారిశ్రామికీకరణ వేగవంతం చేయడం, ఉద్యోగావకాశాలు పెంచడం, యువతకు నైపుణ్యాభివృద్ధి కల్పించడం వంటి అంశాలపై దృష్టి పెట్టినట్లు తెలిపారు. ప్రపంచ స్థాయి మౌలిక వసతులు, పారిశ్రామిక పార్కులు, డేటా సెంటర్లు, గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులు, రవాణా సదుపాయాల విస్తరణ ద్వారా తెలంగాణను పెట్టుబడులకు అనుకూల రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. కేంద్రంరాష్ట్రాల మధ్య సమన్వయం మరింత బలోపేతం కావాలని సీఎం అభిప్రాయపడ్డారు. "ఇచ్చిపుచ్చుకునే ధోరణి"తో వ్యవహరిస్తేనే దేశ సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. కేంద్రం రాష్ట్రాల అవసరాలను గుర్తించాల్సిన అవసరం ఉందని, రాష్ట్రాలు కూడా జాతీయ అభివృద్ధి లక్ష్యాలకు అనుగుణంగా ముందుకు సాగాలని సూచించారు.

తమ పార్టీ కాంగ్రెస్, కేంద్రంలోని బీజేపీ సిద్ధాంతాలు వేర్వేరుగా ఉన్నప్పటికీ.. అభివృద్ధి విషయంలో రాజకీయ విభేదాలకు తావివ్వబోమని సీఎం స్పష్టం చేశారు. ప్రజల సంక్షేమం, రాష్ట్ర పురోగతి తమకు ముఖ్యమని, రాజకీయ విమర్శలు వేరే అంశమని చెప్పారు. ప్రజలకు ప్రయోజనం చేకూరే ప్రతి అంశంలో కేంద్రంతో కలిసి పనిచేయడానికి సిద్ధంగా

## గోదావరి పుష్కరాల నాటికి పోలవరం పూర్తి

(మొదటిపేజీ తరువాయి)

సంబంధించిన కీలక అంశాలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా 2027లో రాబోయే గోదావరి పుష్కరాల నాటికి ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టును పూర్తి చేయాలని, ఇందుకు అవసరమైన పూర్తి సహకారాన్ని అందించాలని కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌ను కోరారు. ఇప్పటికే తాను స్వయంగా ఐదుసార్లు ప్రాజెక్టును సందర్శించి పనుల పురోగతిని పర్యవేక్షించానని వివరించారు. 2026 ఏప్రిల్ 2 నాటికి కొత్త డయాఫ్రం వాల్ నిర్మాణం విజయవంతంగా పూర్తయిందని, ప్రస్తుతం గ్యాప్1 మరియు గ్యాప్2 లలో ఎర్త్ కమ్ రాక్ ఫిల్ డ్యామ్ పనులు వేగంగా జరుగుతున్నాయని మంత్రికి వివరించారు. తొలి దశలో 41.15 మీటర్ల మేర నీటిని నిల్వ చేసేందుకు అవసరమైన అన్ని నిర్మాణాలను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని చంద్రబాబు విజ్ఞప్తి చేశారు. పోలవరం ప్రాజెక్టు పనులకు అడ్డుగా ఉన్న సాంకేతిక మరియు చట్టపరమైన సమస్యలను పరిష్కరించాలని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా కోరారు. పొరుగు రాష్ట్రాలైన ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌లలో ప్రజాభిప్రాయ సేకరణ పెండింగ్‌లో ఉండటంతో 2011లో ఇచ్చిన 'స్టాప్ వర్క్ ఆర్డర్'ను శాశ్వతంగా ఉపసంహరించుకోవాలని కేంద్రమంత్రిని కోరారు. దీనివల్ల పనులు ఎలాంటి ఆటంకాలు లేకుండా వేగంగా సాగుతాయని స్పష్టం చేశారు. అలాగే, సాగునీటి అవసరాల దృష్ట్యా కుడి మరియు ఎడమ కాల్వల సామర్థ్యాన్ని 17,500 క్యూసెక్కులకు పెంచినందున, అందుకు అనుగుణంగా అదనపు నిధులను రీఎంబర్స్ చేయాలని విజ్ఞప్తి చేశారు. వీటితో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 297 నీటి వనరుల పునరుద్ధరణ కోసం రూ. 285 కోట్ల నిధుల విడుదలకు సానుకూలంగా స్పందించాలని కోరుతూ లేఖ సమర్పించారు. బనకచర్ల లింక్ ప్రాజెక్టు ద్వారా వృథాగా పోతున్న 200 టీఎంసీల వరద జలాలను మళ్లించేలా ప్రణాళికలు రూపొందించామని, దానికి తక్షణ అనుమతులు ఇవ్వాలని మంత్రి పాటిల్‌కు వివరించారు. రాష్ట్ర ప్రయోజనాలకు విఘాతం కలిగించే అంశాలపై కూడా చంద్రబాబు నిక్కచ్చిగా వ్యవహరించారు. ఆలమట్టి ప్రాజెక్టు ఎత్తును 524.25 మీటర్లకు పెంచితే ఏపీకి తీరని నష్టం జరుగుతుందని, సుప్రీంకోర్టు తీర్పు వచ్చే వరకు దీనిపై ఎలాంటి గెజిట్ విడుదల చేయవద్దని కేంద్రమంత్రిని కోరారు. అలాగే వంశధార ప్రాజెక్టులో భాగంగా నేరడి బ్యారేజీ నిర్మాణానికి అవసరమైన భూసేకరణ విషయంలో ఒడిశా ప్రభుత్వాన్ని ఆదేశించాలని విజ్ఞప్తి చేశారు. 8 వేల క్యూసెక్కుల సామర్థ్యంతో కుడివైపున హెడ్ స్లూయిస్ నిర్మాణం చేపట్టేందుకు రాష్ట్రం సిద్ధంగా ఉందని తెలిపారు. కేంద్ర మంత్రి పాటిల్‌తో భేటీ అనంతరం రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ, గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిన ప్రాజెక్టులను తాము గాడిలో పెడుతున్నామని చెప్పారు. 2027 జూన్ నాటికి పోలవరం పూర్తి చేసి, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా దీనిని జాతికి అంకితం చేస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో కూడా భేటీ అయ్యారు. విభజన చట్టంలోని పెండింగ్ హామీలు, రాష్ట్రానికి రావలసిన నిధులపై ఇరువురి మధ్య సుదీర్ఘ చర్చ జరిగింది. గత ఐదేళ్ల కాలంలో రాష్ట్రానికి రావలసిన బకాయిలను తక్షణమే విడుదల చేయాలని చంద్రబాబు కోరారు. అమరావతి రాజధాని పనుల పురోగతిని వివరించి, అక్కడ మరిన్ని కేంద్ర ప్రభుత్వ సంస్థలు ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. పోలవరం నిధుల విడుదలలో జాప్యం లేకుండా చూడాలని, కోఆపరేటివ్ శాఖ ద్వారా రాష్ట్రానికి మరింత సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పాలనలో వేగం పెరిగిందని, కేంద్రం నుంచి తగిన మద్దతు లభిస్తే ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అగ్రగామిగా నిలుస్తుందని చంద్రబాబు వివరించారు. ముఖ్యమంత్రి వెంట పలువురు ఎంపీలు, ఉన్నతాధికారులు ఉండి, ఆయా శాఖల వారీగా నిధుల పురోగతిని సమీక్షించారు.



# విద్యారంగానికి రూ.1,100 కోట్ల అభివృద్ధి పనులు

(మొదటిపేజీ తరువాయి)

దశాబ్దాలుగా వివక్షకు గురైందని, అదే 1969 తెలంగాణ ఉద్యమానికి ప్రధాన కారణాల్లో ఒకటిగా నిలిచిందన్నారు. ప్రత్యేక రాష్ట్ర సాధన అనంతరం విద్యా రంగ పునర్నిర్మాణంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని చెప్పారు.
విశ్వవిద్యాలయాలు నిర్లక్ష్యానికి గురైతే రాష్ట్ర విద్యా ప్రమాణాలు దెబ్బతింటాయని ప్రభుత్వం గ్రహించిందన్నారు. పేద, బడుగు, బలహీన వర్గాలకు నాణ్యమైన విద్య అందించడం ప్రభుత్వ బాధ్యతగా భావిస్తున్నామని స్పష్టం చేశారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే 11 వేల టీచర్ పోస్టులను భర్తీ చేశామని తెలిపారు. కేవలం 60 రోజుల్లో పరీక్షలు పూర్తి చేసి నియామక పత్రాలు అందజేశామని చెప్పారు. అలాగే ఎలాంటి వివాదాలకు తావులేకుండా 36 వేల మంది ఉపాధ్యాయుల బదిలీలు చేపట్టినట్లు వివరించారు. ప్రస్తుతం రాష్ట్రంలోని 27 వేల ప్రభుత్వ పాఠశాలల్లో సుమారు 19 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారని సీఎం తెలిపారు. రాష్ట్రంలో విద్యార్థిఉపాధ్యాయుల నిష్పత్తి 17:1గా ఉందన్నారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థలో ఉన్న లోపాలను అధిగమించి, ప్రైవేట్ విద్యాసంస్థలతో సమానంగా ఫలితాలు సాధించే దిశగా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. విద్యా కమిషన్ సిఫార్సుల మేరకు విద్యాశాఖకు బడ్జెట్ కేటాయింపులను 15 శాతానికి పెంచుతామని ప్రకటించారు. అంతర్జాతీయ ప్రమాణాల విద్యను తెలంగాణలో అమలు చేయాలనే లక్ష్యంతో 25 మంది ఉపాధ్యాయులను ఫిన్‌లాండ్‌కు పంపినట్లు తెలిపారు. అవసరమైతే మరిన్ని దేశాలకు కూడా ఉపాధ్యాయులను పంపించి అక్కడి విద్యా విధానాలను అధ్యయనం చేయిస్తామని చెప్పారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పోషకాహారం అందించేందుకు మధ్యాహ్న భోజనంతో పాటు బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని ప్రవేశపెట్టాలని నిర్ణయించినట్లు సీఎం వెల్లడించారు. ఇప్పటికే కొన్ని పాఠశాలల్లో పైలట్ ప్రాజెక్టుగా అమలు చేస్తున్నామని తెలిపారు. విద్యారంగంలో ప్రపంచవ్యాప్తంగా అనేక మార్పులు చోటుచేసుకున్నప్పటికీ మనం ఇంకా కాలం చెల్లిన సిలబస్‌తోనే కొనసాగుతున్నామని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. టెన్ ప్లస్ టూ విధానం లేకపోవడం వల్లే పదో తరగతి తర్వాత డ్రాప్‌అవుట్లు పెరుగుతున్నాయని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ అంటూ కులాల వారీగా రెసిడెన్షియల్ పాఠశాలలు ఏర్పాటు చేయడం వల్ల సమాజంలో కులవివక్ష పెరుగుతోందని ప్రభుత్వం గుర్తించిందన్నారు. ఈ పరిస్థితిని మార్చేందుకు ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు దేశ భవిష్యత్‌ను నిర్మించే కేంద్రాలుగా మారాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆకాంక్షించారు.

# బెంగాల్ లో కొత్త ప్రభుత్వం సంచలన నిర్ణయం

పశ్చిమ బెంగాల్ వెలుతురు మే 11:

పశ్చిమ బెంగాల్‌లో కొత్తగా ఏర్పాటైన ప్రభుత్వం తొలి మంత్రివర్గ సమావేశంలోనే పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ముఖ్యంగా బంగ్లాదేశ్ సరిహద్దుల్లో భద్రతను బలోపేతం చేయడానికి కంచె నిర్మాణం కోసం బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ కు భూమి కేటాయించే నిర్ణయానికి ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయంపై ముఖ్యమంత్రి సువేందు అధికారి మాట్లాడుతూ, ప్రజలకు ఇచ్చిన హామీ మేరకే సరిహద్దు భద్రతపై ఈ కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. బంగ్లాదేశ్ సరిహద్దుల్లో కంచె నిర్మాణానికి అవసరమైన భూమిని బీఎస్ఎఫ్‌కు బదిలీ చేయనున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఈ ప్రక్రియను వచ్చే 45 రోజుల్లో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. సరిహద్దు భద్రతను మరింత కట్టుదిట్టం చేయడం ద్వారా అక్రమ రవాణా, చొరబాట్లు వంటి సమస్యలకు అడ్డుకట్ట వేయవచ్చని ప్రభుత్వం భావిస్తోంది. కేంద్రంతో సమన్వయంగా ఈ ప్రాజెక్టును వేగవంతం చేయనున్నట్లు సమాచారం. ఇదే సమావేశంలో కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'ఆయుష్మాన్ భారత్' ఆరోగ్య పథకాన్ని రాష్ట్రంలో కూడా అమలు చేయాలని కేబినెట్ నిర్ణయించింది. అలాగే ఇతర కేంద్ర పథకాలను కూడా రాష్ట్రంలో అమలు చేయడానికి ప్రభుత్వం అంగీకరించింది. ఉద్యోగాల భర్తీకి సంబంధించి కూడా కీలక నిర్ణయం తీసుకున్నారు. పాఠశాలల్లో ఉపాధ్యాయుల నియామకాలకు వయో పరిమితిని ఐదేళ్లు పెంచే ప్రతిపాదనకు కేబినెట్ ఆమోదం తెలిపినట్లు ముఖ్యమంత్రి తెలిపారు. ఎన్నికల ప్రచారంలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఇచ్చిన హామీ ప్రకారం ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. అదేవిధంగా హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ 2025 జూన్‌లో జారీ చేసిన జనగణన సర్క్యులర్‌ను గత ప్రభుత్వం అమలు చేయలేదని సువేందు అధికారి విమర్శించారు. ఇప్పుడు తమ ప్రభుత్వం ఆ సర్క్యులర్‌ను తక్షణమే అమలు చేయాలని నిర్ణయించిందని తెలిపారు. ఈ మొత్తం నిర్ణయాలు రాష్ట్ర పరిపాలనలో కొత్త దిశను సూచిస్తున్నాయని ప్రభుత్వం భావిస్తోంది. ముఖ్యంగా భద్రత, ఆరోగ్యం, విద్యా రంగాల్లో సమగ్ర మార్పులు తీసుకురావడమే లక్ష్యమని కేబినెట్ వర్గాలు వెల్లడించాయి.

# 40 కోట్ల ఓటర్లపై మూడోదశ వడపోతకు ఈసీ సిద్ధం

(మొదటిపేజీ తరువాయి)

దేశంలో మొత్తం సుమారు 99 కోట్ల మంది ఓటర్లు నమోదై ఉన్నారు. వీరిలో ఇప్పటికే 60 కోట్ల మంది ఓటర్ల వివరాలకు సంబంధించి సమగ్ర సవరణ ప్రక్రియ పూర్తయిందని ఈసీ వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం మిగిలిన 40 కోట్ల మంది ఓటర్లకు సంబంధించిన సమాచారాన్ని పరిశీలించేందుకు మూడోదశ కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. ఈ ప్రక్రియలో 17 రాష్ట్రాలు, ఐదు కేంద్రపాలిత ప్రాంతాలు భాగం కానున్నాయి. ఇప్పటికే ఉత్తర్‌ప్రదేశ్, పశ్చిమ బెంగాల్, తమిళనాడు, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, కేరళ, గుజరాత్, మధ్యప్రదేశ్, గోవా, బిహార్ వంటి రాష్ట్రాలతో పాటు పుదుచ్చేరి, అండమాన్ నికోబార్ దీవులు, లక్షద్వీప్ ప్రాంతాల్లో ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. అస్సాంలో ప్రత్యేకంగా ఓటర్ల సవరణ కార్యక్రమం చేపట్టినట్లు వెల్లడించారు. వాస్తవానికి ఈ కార్యక్రమాన్ని వేగవంతం చేసేందుకు కేంద్ర ఎన్నికల సంఘం ఈ ఏడాది ఫిబ్రవరి 19నే రాష్ట్రాల ప్రధాన ఎన్నికల అధికారులకు లేఖలు రాసింది. ఏప్రిల్ నుంచి ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని చేపట్టేందుకు ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించింది. అయితే, వివిధ కారణాల వల్ల షెడ్యూల్‌లో జాప్యం చోటుచేసుకుంది. ప్రధానంగా బిహార్‌లో ఓటర్ల సమగ్ర సవరణ చేపట్టడంపై పలు రాజకీయ పార్టీలు సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. అలాగే పశ్చిమ బెంగాల్‌కు సంబంధించి తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమత బెనర్జీ కూడా సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీంతో ఎన్నికల సంఘం చేపట్టాల్సిన తదుపరి చర్యల్లో ఆలస్యం చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. ఇక ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో ఎన్నికల యంత్రాంగం పూర్తిగా ఎన్నికల నిర్వహణపైనే దృష్టి కేంద్రీకరించాల్సి రావడంతో ప్రత్యేక సవరణ కార్యక్రమం తాత్కాలికంగా నిలిచిపోయింది. ఇప్పుడు ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత మళ్లీ ఈ ప్రక్రియను వేగవంతం చేసేందుకు ఈసీ సన్నద్ధమవుతోంది. ఓటర్ల జాబితాల్లో డూప్లికేట్ నమోదులు, మరణించిన వారి పేర్లు, ఒకే వ్యక్తికి బహుళ నియోజకవర్గాల్లో నమోదైన ఓట్లు వంటి అంశాలను గుర్తించి తొలగించడమే ఈ ప్రత్యేక సమగ్ర సవరణ ప్రధాన ఉద్దేశమని అధికారులు చెబుతున్నారు. కొత్తగా అర్హత సాధించిన ఓటర్ల పేర్లను చేర్చడం, చిరునామా మార్పులు, ఇతర సవరణలను కూడా ఈ ప్రక్రియలో పరిగణనలోకి తీసుకోనున్నారు. రాబోయే ఎన్నికల దృష్ట్యా ఖచ్చితమైన, విశ్వసనీయమైన ఓటర్ల జాబితాను సిద్ధం చేయాలని కేంద్ర ఎన్నికల సంఘం లక్ష్యంగా పెట్టుకుంది. రాజకీయ పార్టీల నుంచి అభ్యంతరాలు వ్యక్తమవుతున్నప్పటికీ, చట్టపరమైన నిబంధనలకు అనుగుణంగా ఈ ప్రక్రియను పూర్తి చేస్తామని ఎన్నికల సంఘం అధికారులు స్పష్టం చేస్తున్నారు.



# స్టాలిన్‌తో విజయ్ భేటీ

(మొదటిపేజీ తరువాయి)

కేంద్రరాష్ట్ర సంబంధాలపై ఇరువురు నేతలు అభిప్రాయాలు పంచుకున్నట్లు తెలుస్తోంది. తమిళనాడు అభివృద్ధి విషయంలో రాజకీయాలకు అతీతంగా కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందనే అభిప్రాయం కూడా వ్యక్తమైనట్లు సమాచారం. ఇటీవల అధికారంలోకి వచ్చిన తర్వాత విజయ్.. గత డీఎంకే ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. రాష్ట్ర ఖజానాను డీఎంకే ప్రభుత్వం ఖాళీ చేసిందని ఆరోపించారు. భారీ అప్పులు చేసి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను సంక్షోభంలోకి నెట్టిందని వ్యాఖ్యానించారు. ప్రజా సంక్షేమం పేరుతో ఆర్థిక క్రమశిక్షణను దెబ్బతీశారని విమర్శించారు. ఈ ఆరోపణలకు స్టాలిన్ ఇప్పటికే ఘాటుగా స్పందించారు. రాష్ట్ర అప్పులు పరిమితుల్లోనే ఉన్నాయని స్పష్టం చేశారు. తమ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో కరోనా వంటి విపత్తును సమర్థంగా ఎదుర్కొన్నామని పేర్కొన్నారు. ఆర్థిక ఇబ్బందులు, కేంద్రం నుంచి నిధుల విషయంలో ఎదురైన అడ్డంకులను అధిగమిస్తూ తమిళనాడును ముందుకు తీసుకెళ్లామని తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిధుల విడుదలలో అడ్డంకులు సృష్టించినప్పటికీ రాష్ట్ర ప్రయోజనాలను కాపాడేందుకు తమ ప్రభుత్వం పోరాడిందని స్టాలిన్ వ్యాఖ్యానించారు. ఫెడరల్ వ్యవస్థను బలహీనపరిచే ప్రయత్నాలను తట్టుకుని నిలిచామని చెప్పారు. ఈ నేపథ్యంలో విజయ్, స్టాలిన్ సమావేశం కావడం రాజకీయంగా ఆసక్తి రేకెత్తిస్తోంది. రాజకీయ విభేదాలు ఉన్నప్పటికీ ప్రజాస్వామ్య సంప్రదాయాల ప్రకారం మర్యాదపూర్వక భేటీలు కొనసాగడం సానుకూల పరిణామమని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మాజీ ముఖ్యమంత్రిని కలిసి రాష్ట్ర అంశాలపై చర్చించడం పరిపక్వ రాజకీయాలకు సంకేతమని పేర్కొంటున్నారు. మరోవైపు రాష్ట్ర రాజకీయాల్లో అన్నాడీఎంకే భవిష్యత్తుపై కూడా చర్చ జరుగుతోంది. ఇటీవల ఎన్నికల ఫలితాల తర్వాత ఆ పార్టీలో అంతర్గత విభేదాలు పెరుగుతున్నాయన్న ప్రచారం సాగుతోంది. నాయకత్వంపై అసంతృప్తి, భవిష్యత్ వ్యూహాలపై విభేదాలు వెలుగులోకి వస్తుండటంతో పార్టీ చీలిక దిశగా వెళ్తుందా అనే చర్చ తమిళ రాజకీయ వర్గాల్లో మొదలైంది. అయితే దీనిపై అధికారికంగా పార్టీ నేతలు స్పందించలేదు. ఇక టీవీకే ప్రభుత్వం ఆదివారం అధికారికంగా కొలువుదీరింది. సీఎం విజయ్‌తో పాటు కొత్త మంత్రివర్గం ప్రమాణస్వీకారం చేసింది. మే 13న ఈ ప్రభుత్వం అసెంబ్లీలో బలపరీక్షను ఎదుర్కోనుంది. ఇప్పటికే టీవీకేకు అవసరమైన సంఖ్యాబలం ఉన్నట్లు తెలుస్తుండటంతో బలపరీక్ష సులభంగానే పూర్తయ్యే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. ఇదిలా ఉండగా, కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేల ప్రమాణస్వీకార కార్యక్రమంలో అనూహ్య ఘటన చోటుచేసుకుంది. యువనేత, మంత్రి కీర్తన ఎమ్మెల్యేగా ప్రమాణస్వీకారం చేసే సమయంలో ఎలక్షన్ సర్టిఫికెట్ తీసుకురాకపోవడంతో తాత్కాలిక ఇబ్బందులు ఎదురయ్యాయి. అవసరమైన పత్రం లేకపోవడంతో ఆమె ప్రమాణస్వీకారం చేయలేకపోయారు. దీంతో అధికారులు ఆమెను వెనక్కి పంపారు. అనంతరం ఎలక్షన్ సర్టిఫికెట్ తీసుకొచ్చి సమర్పించడంతో ఎట్టకేలకు ఎమ్మెల్యేగా ప్రమాణస్వీకారం చేశారు. ఈ ఘటన అసెంబ్లీలో కొంతసేపు చర్చనీయాంశంగా మారింది. కొత్తగా ఎన్నికైన సభ్యులు అవసరమైన పత్రాలు ముందుగానే సిద్ధం చేసుకోవాల్సిన అవసరాన్ని అధికారులు గుర్తుచేసినట్లు తెలుస్తోంది. తమిళనాడులో అధికార మార్పు తర్వాత చోటుచేసుకుంటున్న పరిణామాలు రాష్ట్ర రాజకీయాలను మరింత ఆసక్తికరంగా మారుస్తున్నాయి. ఒకవైపు కొత్త ప్రభుత్వం పాలనపై దృష్టి సారిస్తుండగా.. మరోవైపు ప్రతిపక్షాల వ్యూహాలు, రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. విజయ్ నేతృత్వంలోని ప్రభుత్వం ప్రజల అంచనాలను ఎంతవరకు అందుకుంటుందన్నది ఇప్పుడు ప్రధాన చర్చగా మారింది.

# తెలంగాణపై కేంద్ర ప్రభుత్వం వివక్ష

(మొదటిపేజీ తరువాయి)

ప్రధాని స్థాయి వ్యక్తి ప్రజలను భయపెట్టేలా మాట్లాడకూడదని ఆయన అభిప్రాయపడ్డారు. ఒకవైపు అభివృద్ధి గురించి మాట్లాడుతూనే మరోవైపు ప్రజలపై భారం పెరుగుతోందని విమర్శించారు. తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం నిధుల కేటాయింపులో వివక్ష చూపుతోందని పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. కొత్తగా ఏర్పడిన రాష్ట్రానికి తగిన స్థాయిలో మౌలిక సదుపాయాలు, కేంద్రీయ సంస్థలు, రోడ్లు, మెట్రో విస్తరణ నిధులు ఇవ్వడం లేదని అన్నారు. ఇతర రాష్ట్రాలతో పోల్చితే తెలంగాణకు అన్యాయం జరుగుతోందని ఆయన వ్యాఖ్యానించారు. బీజేపీ ఎంపీలు రాష్ట్ర అభివృద్ధి కోసం కేంద్రాన్ని ఒప్పించడంలో విఫలమయ్యారని మంత్రి విమర్శించారు. ట్రిపుల్ ఆర్, మెట్రో, రేడియల్ రోడ్లు వంటి కీలక ప్రాజెక్టులపై ఒక్క వినతి కూడా ఇవ్వలేదని ఆరోపించారు. రాష్ట్ర అవసరాలపై కేంద్రంలో గట్టిగా మాట్లాడడం లేదని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతి ఆరోపణలపై సీబీఐ విచారణ జరపాలని మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశిస్తే ఎందుకు విచారణ జరగడం లేదని ప్రశ్నించారు. అవినీతి ఆరోపణలు ఉన్నప్పుడు పారదర్శక విచారణ అవసరమని అన్నారు. బీసీ కుల గణన అంశంపై మాట్లాడుతూ, జనగణనలో బీసీల లెక్కలు చేర్చాలని ఆయన కేంద్రాన్ని కోరారు. రాహుల్ గాంధీ సూచనల మేరకు దేశవ్యాప్తంగా కుల గణన అవసరమని తెలిపారు. బలహీన వర్గాలకు న్యాయం జరగాలని ఆయన అన్నారు. దేవాలయాల అభివృద్ధి విషయంలో కూడా కేంద్రం నిర్లక్ష్యం చూపుతోందని మంత్రి ఆరోపించారు. భద్రాచలం, వేములవాడ, బాసర వంటి ఆలయాలకు తగిన నిధులు ఇవ్వలేదని అన్నారు. గోదావరి పుష్కరాలకు ప్రత్యేక నిధులు కేటాయించలేదని ప్రశ్నించారు. ప్రధాని మోదీ వ్యాఖ్యలు దేశ ఐక్యతకు విరుద్ధంగా ఉన్నాయని మంత్రి విమర్శించారు. విభజన రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ దేశ ఐక్యత కోసం త్యాగాలు చేసిందని గుర్తుచేశారు. బండి సంజయ్ అంశంపై స్పందిస్తూ, విచారణను ప్రభావితం చేయకుండా కేంద్ర మంత్రి హోదాలో సహకరించాలని సూచించారు. ఒత్తిళ్లు తేవడం సరికాదని అన్నారు. పోలీసులు నిష్పక్షపాతంగా విచారణ జరపాలని చెప్పారు. మహిళల భద్రత విషయంలో ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందని ఆయన స్పష్టం చేశారు. బాధిత



కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. చట్టం తన పని తాను చేసుకుంటుందని పేర్కొన్నారు. చివరగా, తెలంగాణ అభివృద్ధి కోసం కేంద్రంతో చర్చకు సిద్ధమని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. రాష్ట్రానికి న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు.







# మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ సుమతి గారిని కలవడం నాకు ఎంతో ఆనందంగా, గర్వంగా అనిపించింది

- **డా. రేఖ బోయలపల్లి వైస్ ప్రెసిడెంట్, తెలంగాణ ప్రదేశ్ మహిళా కాంగ్రెస్**

హైదరాబాద్ వెలుతురు మే 11:

ఆల్ ఇండియా మహిళా కాంగ్రెస్ నాయకత్వ సూచనల మేరకు, ఇటీవల దిల్‌సుఖ్‌నగర్‌లో అర్ధరాత్రి సమయంలో ధైర్యంగా నిర్వహించిన రిస్కీ ఆపరేషన్‌కు గాను ఆమెను మహిళా కాంగ్రెస్ తరఫున ఘనంగా సన్మానించడం జరిగింది.

ప్రజల భద్రత కోసం ఆమె చూపించిన ధైర్యం, కర్తవ్యనిబద్ధత, సేవా భావం ప్రతి మహిళకు స్ఫూర్తిదాయకం.

ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు "శ్రీమతి "ఎర్రబెల్లీ స్వర్ణ గారు తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఇన్‌చార్జ్ మరియు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కమలాక్షి రాజన్న గారు, రాష్ట్ర వైస్ శైలజ రెడ్డి ప్రెసిడెంట్లు, జిల్లా అధ్యక్షురాలు నీలం పద్మ మరియు మహిళా కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఇలాంటి ధైర్యవంతమైన, డైనమిక్ మహిళా అధికారిని అభినందించడం మాకు ఎంతో గర్వకారణం.

# నిమ్స్ లో మాస్టర్ హెల్త్ చెక్ అప్ క్యాంపు నిర్వహించాలని హైదరాబాద్ ప్రెస్ క్లబ్ పాలకమండలి విజ్ఞప్తి



- **సానుకూలంగా స్పందించిన రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ**
- **మంత్రి దామోదర్ రాజనర్సింహ గారికి కృతజ్ఞతలు తెలిపిన ప్రెస్ క్లబ్ కార్యవర్గ సభ్యులు.**

హైదరాబాద్ వెలుతురు మే 11:

తెలంగాణ రాష్ట్ర అవతరణ వారోత్సవాన్ని (జూన్ 2) పురస్కరించుకొని నిమ్స్ ఆసుపత్రిలో సోమాజిగూడ లోని ప్రెస్ క్లబ్ సభ్యులందరికీ ఉచితంగా మాస్టర్ హెల్త్ చెకప్ క్యాంప్ ను నిర్వహించాలని ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఎస్. విజయ్ కుమార్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి రమేష్ వరికుప్పల, ఉపాధ్యక్షురాలు అరుణ అత్తలూరి లు వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ దామోదర్ రాజనర్సింహ గారికి రాష్ట్ర సచివాలయంలో కలసి వినతి పత్రం సమర్పించారు.

హైదరాబాద్ ప్రెస్ క్లబ్ సభ్యులకు ప్రత్యేకంగా నిమ్స్ ఆసుపత్రిలో మాస్టర్ హెల్త్ చెకప్ నిర్వహించాలని క్లబ్ పాలకమండలి మంత్రి దామోదర్ రాజనర్సింహ గారికి చేసిన విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండే జర్నలిస్టులు తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. జర్నలిస్టులు రెగ్యులర్ గా తమ హెల్త్ ను చెకప్ చేసుకోవాలని మంత్రి సూచించారు. నిమ్స్ లో హెల్త్ చెకప్ కు అవసరమైన ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ కార్యదర్శి క్రిస్టినాను మంత్రి ఆదేశించారు. ప్రెస్ క్లబ్ సభ్యులకు మాస్టర్ చెకప్ క్యాంపు ఏర్పాటుకు సానుకూలంగా స్పందించిన మంత్రి దామోదర్ రాజనర్సింహ గారికి, ప్రభుత్వానికి ప్రెస్ క్లబ్ పాలకమండలి కృతజ్ఞతలు తెలిపారు.

# గ్రేటర్ జర్నలిస్టుల సొసైటీని గుర్తించండి

- **మంత్రి పొంగులేటి కి సొసైటీ ప్రతినిధుల విజ్ఞప్తి**
- **అర్హులైన జర్నలిస్టులందరికి న్యాయం చేస్తాం**
- **సొసైటీలన్నీ ఏకతాటిపైకి రావాలన్న మంత్రి**

హైదరాబాద్, వెలుతురు మే 11:

జర్నలిస్టులకు ఇళ్ళస్థలాలు కేటాయింపులో తమ గ్రేటర్ హైదరాబాద్ జర్నలిస్ట్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీని గుర్తించాలని సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు మామిడి సోమయ్య, బొల్లం శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు వారు సోమవారం సచివాలయంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కలిసి సొసైటి వివరాలతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాల్లో పనిచేస్తున్న జర్నలిస్టులకు నివాస స్థలాలు, గృహ వసతి కల్పించేందుకు 2008 లో తమ ఏర్పడిందని, ఈ సొసైటీలో గడిచిన 17 సంవత్సరాలలో నాలుగు దఫాలుగా జర్నలిస్టుల సభ్యత్వ నమోదు చేయడం జరిగిందని, ప్రస్తుతం సొసైటీలో హైదరాబాద్ జిల్లాతో సహా జీహెచ్ఎంసీ పరిధిలోని వివిధ మున్సిపాలిటీలలో వివిధ పత్రికలు, టీవీ చానళ్ళలో పని దాదాపు వెయ్యి మందికి పైగా జర్నలిస్టులు సభ్యులుగా ఉన్నారని తెలిపారు. అయినప్పటికీ తమ సొసైటీని ప్రభుత్వం పరిగణలోకి తీసుకోవడం లేదని, జర్నలిస్టు హౌసింగ్ సొసైటీలతో ఏర్పాటు చేసే సమావేశాలకు సొసైటీని ఆహ్వానించకపోవడం, జేఏసీ లో తమను భాగస్వామ్యం చేయకపోడం చాలా బాధాకరమని అన్నారు. ప్రజా ప్రభుత్వానికి మేము వ్యతిరేకం కాదని, తమ సొసైటీకి స్థలం ఇవ్వాలని గత ప్రభుత్వాన్ని పలు మార్లు అడిగినప్పటికీ స్థలం ఇవ్వలేదని ,సొసైటీ నిబంధన ప్రకారం స్థలం కేటాయిస్తే అందుకు ప్రభుత్వం నిర్ణయించిన నామినల్ ధర చెల్లించడానికి తాము సిద్ధంగా ఉన్నామని కూడా గత ప్రభుత్వానికి పలు మార్లు తెలియజేయడం జరిగిందని, అయినా అప్పటి ప్రభుత్వం జర్నలిస్టుల ఇళ్లస్థలాల సమస్యను పట్టించుకోలేదని అన్నారు. ప్రస్తుత ప్రజా ప్రభుత్వంలోనైనా తమ సొసైటీ సభ్యులైన జర్నలిస్టులకు ఇళ్ళస్థలాలు కేటాయించి న్యాయం చేయాలని వారు మంత్రిని కోరారు. అనంతరం మీడియా అకాడమీ ఛైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డిని, ఐఅండ్ పీఆర్ స్పెషల్ కమీషనర్ ముకుంద రెడ్డిని కలిసి వినతి పత్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ నాయకులు రవికుమార్, శ్రీనివాస్ గౌడ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

**అర్హులైన జర్నలిస్టులందరికి ఇళ్ళస్థలాలిస్తాం**

- సొసైటీలన్ని ఏకం కావాలి
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి







తమ ప్రభుత్వం అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ళస్థలాలు ఇవ్వడానికి చిత్తశుద్ధతో ప్రయత్నం చేస్తుందని, ఇందుకోసం జర్నలిస్టుల హౌసింగ్ సొసైటీలన్ని ఏకతాటిపైకి రావాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, ఐఅండ్ పీఆర్ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సోమవారం సచివాలయంలో తనను కలిసిన గ్రేటర్ హైదరాబాద్ జర్నలిస్ట్స్ హౌసింగ్ సొసైటీ ప్రతినిధులతో మంత్రి మాట్లాడుతూ, అన్ని సొసైటీలు కలిసి జేఏసీగా ఏర్పడి అర్హులైన జర్నలిస్టుల జాబితాను తయారు చేయాల్సిన అవసరం ఉందని అన్నారు.



శ్రీ హనుమంతుడు వారి అనుగ్రహం సమస్త లోకాలకు కలగాలి.
జై శ్రీరామ్ | జై హనుమాన్

# హనుమాన్ జయంతి సందర్భంగా శ్రీ హనుమంతుడు వైభవం

**ప్రసన్నకుమార్ శర్మ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి**

- **హనుమంతుడు ఎవరు?**

హనుమంతుడు వాయుదేవుని అంశసంభూతుడు, అంజనాదేవి పుత్రుడు. ఆయన భక్తి, బలం, జ్ఞానం, ధైర్యం, వినయం, సేవాభావానికి ప్రతీక. శ్రీరాముని పట్ల అచంచల భక్తితో "రామదూతుడు"గా ప్రసిద్ధి పొందారు.

- **హనుమంతుని జన్మ విశేషం ఏమిటి?**

అంజనాదేవి చేసిన ఘోర తపస్సుకు ప్రసన్నమైన వాయుదేవుని అనుగ్రహంతో హనుమంతుడు జన్మించాడు. అందువల్ల ఆయనను "మారుతి", "వాయుపుత్రుడు", "ఆంజనేయుడు" అని పిలుస్తారు.

- **హనుమంతుని పాండిత్యం గురించి ఏమి చెప్పబడింది?**

హనుమంతుడు కేవలం బలశాలి మాత్రమే కాదు, మహా పండితుడు కూడా.

వాల్మీకి మహర్షి ఆయన మాటలను విని ఇలా ప్రశంసించాడు:

"నానృగ్వేద వినీతస్య
నాయజుర్వేద ధారిణః
నాసామవేద విదుషః
శక్యమేవం ప్రభాషితుం"

అంటే — ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం అభ్యసించని వాడు ఇంత శ్రేష్ఠంగా మాట్లాడలేడు అని శ్రీరాముడు హనుమంతుని వాక్పాటవాన్ని కొనియాడాడు.

- **హనుమంతుడు వ్యాకరణ పండితుడా?**

అవును. సంస్కృత వ్యాకరణంలో హనుమంతుడు అపార పాండిత్యం కలిగినవాడిగా వర్ణించబడ్డాడు. ఆయన మాటలలో శబ్దశుద్ధి, అర్థగంభీరత, మాధుర్యం, వినయం సమన్వయంగా ఉండేవి. అందుకే ఆయనను "నవవ్యాకరణ పండితుడు" అని కూడా పిలుస్తారు.

- **హనుమంతుడు వేదాలు, ఉపనిషత్తులు అధ్యయనం చేశాడా?**

పురాణాలు, ఆగమాలు, రామాయణంలోని వర్ణనల ప్రకారం హనుమంతుడు వేదవేత్త. ధర్మం, నీతి, రాజనీతి, యుద్ధతంత్రం, ఆత్మతత్వం వంటి విషయాలలో ఆయనకు విశేష జ్ఞానం ఉంది. ఉపనిషత్తుల సారమైన భక్తి, సేవ, ఆత్మనిగ్రహం ఆయన జీవనంలో ప్రత్యక్షంగా కనిపిస్తాయి.

- **శ్రీరామునికి హనుమంతుడు ఎందుకు అత్యంత ప్రీతిపాత్రుడు?**

హనుమంతుడు తన జీవితమంతా స్వార్థరహిత సేవకే అంకితం చేశాడు.

సీతామాతను కనుగొనడం, లంక దహనం, సంజీవిని తీసుకురావడం వంటి కార్యాలు అన్నీ రామకార్యసిద్ధికోసమే చేశాడు. ప్రతిఫలం ఆశించకుండా సేవ చేయడం వల్ల ఆయన శ్రీరామునికి అత్యంత ప్రియభక్తుడయ్యాడు.

- **హనుమంతుని బుద్ధికుశలతకు ఉదాహరణ ఏమిటి?**

లంకలో సీతామాతను వెతికేటప్పుడు హనుమంతుడు అత్యంత జాగ్రత్త, సహనం, వివేకంతో వ్యవహరించాడు. ముందుగా శత్రుబలాన్ని అంచనా వేశాడు. తర్వాత సరైన సమయంలో సీతాదేవిని దర్శించి రాముని ఉంగరాన్ని చూపించి ధైర్యం చెప్పాడు. ఇది ఆయన దౌత్యనైపుణ్యానికి గొప్ప ఉదాహరణ.

- **యుద్ధనిర్ణయాలలో హనుమంతుని పాత్ర ఏమిటి?**

లంక యుద్ధంలో హనుమంతుడు కేవలం యోధుడే కాదు, వ్యూహకర్త కూడా. శత్రు బలం, కోట నిర్మాణం, రావణుని సైన్యవ్యూహం వంటి సమాచారాన్ని శ్రీరామునికి తెలియజేశాడు. యుద్ధంలో సమయోచిత నిర్ణయాలు తీసుకొని వానరసేనకు ధైర్యం నింపాడు.

- **సంజీవిని పర్వతాన్ని తీసుకురావడం ద్వారా ఏమి తెలుస్తుంది?**

లక్ష్మణుడు మూర్ఛపోయినప్పుడు హనుమంతుడు హిమాలయాలకు వెళ్లి సంజీవిని తీసుకురావాల్సి వచ్చింది. ఏ ఔషధమో గుర్తించలేకపోయినా ఆలస్యం చేయకుండా మొత్తం పర్వతాన్నే తీసుకువచ్చాడు. ఇది ఆయన సంకల్పబలం, కార్యదీక్ష, సమయస్ఫూర్తికి ప్రతీక.

- **హనుమంతుని భక్తి తత్త్వం ఏమిటి?**

హనుమంతుని దృష్టిలో భక్తి అంటే సంపూర్ణ సమర్పణ.

"దేహబుద్ధ్యా దాసోఽస్మి, జీవబుద్ధ్యా త్వదంశకః, ఆత్మబుద్ధ్యా త్వమేవాహం" అనే భావంతో ఆయన శ్రీరాముని సేవించాడు.

- **హనుమంతుని నుండి మనం నేర్చుకోవాల్సిన గుణాలు ఏమిటి?**

1. గురుభక్తి
2. ధైర్యం
3. వినయం
4. సేవాభావం
5. సమయస్ఫూర్తి
6. జ్ఞానపిపాస
7. ఆత్మవిశ్వాసం
8. ధర్మనిష్ఠ

- **హనుమాన్ జయంతి సందేశం ఏమిటి?**

హనుమాన్ జయంతి మనకు భక్తి, శక్తి, యుక్తి సమన్వయాన్ని గుర్తుచేస్తుంది. హనుమంతునిలా భగవద్భక్తితో, సేవామార్గంతో, ధర్మబద్ధంగా జీవించాలని ఈ పర్వదినం సందేశం ఇస్తుంది.

"యత్ర యత్ర రఘునాథ కీర్తనం
తత్ర తత్ర కృతమస్తకాంజలిం
బాష్పవారి పరిపూర్ణ లోచనం
మారుతిం నమత రాక్షసాంతకం॥"

# స్వీయ సముద్ధరణ పథంలో బెంగాల్

## -హర్‌దీప్ సింగ్ పూరి

హౌరా... ఒకనాడు దీన్ని ఆసియాలోని 'షెఫీల్డ్' (ఇంగ్లాండ్‌లో పచ్చదనానికి, పారిశ్రామికాభివృద్ధికి నెలవైన ప్రాంతం)గా వ్యవహరించే వారు. హుగ్లీ నది వెంబడిగల జనపనార మిల్లులు ఉపఖండంలోనే అతిపెద్ద వ్యవస్థీకృత పారిశ్రామిక కూడలిని తలపించేవి. అలాగే కోల్‌కతా నగరం భారత వాణిజ్య రాజధానిగా వెలుగొందుతూ "టాటాలు, బిర్లాలు, ఐటీసీ, బ్రిటానియా, కోల్ ఇండియా, హిందుస్థాన్ మోటార్స్, గార్డెన్ రీచ్ షిప్‌బిల్డర్స్" వంటి దిగ్గజ సంస్థలకు ప్రధాన స్థావరంగా విరాజిల్లేది. బర్న్‌పూర్‌లోని 'ఐఐఎస్‌సీఓ' 1918 నాటిది కాగా, దుర్గాపూర్ స్టీల్ ప్లాంట్ రెండో ప్రణాళిక కాలం నాటిది. అలాగే, 195051 నాటికి దేశంలోని తయారీ రంగ ఉత్పాదకతలో బెంగాల్ వాటా సుమారు 27 శాతంగా నమోదయ్యేది. నాటి కలకత్తా ఎంతటి ఘనమైనదో నాకు బాగా తెలుసు! నేను ఫారిన్ సర్వీస్‌లో చేరడానికి ముందు నా తొలినాళ్ల ఉద్యోగాలలో భాగంగా హిందుస్థాన్ లీవర్ కంపెనీలోనూ పనిచేశాను. అప్పట్లో తట్టాబుట్టా సర్దుకుని ఎవరైనా కలకత్తా నగరానికి చేరుకున్నారంటే దేశ వాణిజ్య కూడలికి చేరుకున్నాననే నిశ్చింత కలిగే ప్రదేశమిది. వీధి దీపాలు వెలుగు విరజిమ్ముతుండగా, జనాన్ని చీల్చుకుంటూ ట్రాములు గంభీరంగా సాగుపోతుండేవి. అనేక కంపెనీల కార్యాలయాలు ఉద్యోగ నియామకాల్లో తరచూ తలమునకలై కనిపించేవి.

అలా ఒక శతాబ్దం పాటు అనేక మంది శ్రమ ఫలితంగా రూపుదిద్దుకున్న రాష్ట్రాన్ని అసమర్థ ఆర్థిక నిర్వహణకు మించిన ఉద్దేశపూర్వక దుశ్చర్య శిథిల దశకు చేర్చింది. మొదట 1977లో వామపక్ష కూటమి అధికారంలోకి వచ్చి, 34 ఏళ్లపాటు కార్మిక వర్గమనే నినాదం మాటున ఒక వ్యవస్థీకృత క్రీనీడ కమ్ముకుంది. యింది. కట్టడ నిర్మాణం.. దుకాణ ప్రారంభం.. బట్టీ పెట్టడం.. వాహన మార్గం లీజు.. చివరకు పంచాయతీ సమావేశం నిర్వహించాలన్నా కమీషన్ రాజ్యం బెడద తప్పేది కాదు. కార్యకర్తలు వసూళ్లు చేసుకుంటుంటే, పార్టీలు అధికారాన్ని సొమ్ము చేసుకునేవి. పైకి మాత్రం పెట్టుబడిదారులను తరిమికొట్టిన కార్మిక సంఘటిత వాదం కనిపిస్తే, పౌరులను దోచుకోవడం కెమెరాలకు చిక్కని అసలు స్వరూపంగా ఉండేది. అయితే, 2000 నాటికి వామపక్ష కూటమి తన వైఖరిని మార్చుకుంటూ 'టాటా మోటార్స్'ను సింగూర్‌కు ఆహ్వానించినపుడు నాటి ప్రతిపక్షం తృణమూల్ కాంగ్రెస్ ఆమరణ నిరాహార దీక్షకు దిగి, నానా బీభత్సం సృష్టించింది. చివరకు 2008లో ఆ ప్రాజెక్టు గుజరాత్ రాష్ట్రానికి తరలిపోయింది. ఆ తర్వాత ఆనాటి మాఫియా తన రంగు మార్చుకున్నా... స్వభావం మాత్రం మారలేదు.

ఆ మేరకు 2011లో 'రూపాంతరీకరణ' (పరిబొర్తన్) నినాదంతో తృణమూల్ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. అయితే, వామపక్ష కూటమి పాలన నాటి పాత యంత్రాంగమే కొత్త యూనిఫాంలో తిరిగి ప్రత్యక్షమై కమీషన్ కాస్తా వాటాగా మారింది. కార్యకర్తలు సిండికేట్‌గా మారిపోవడంతో జాతీయ తయారీ రంగంలో బెంగాల్ వాటా 27 శాతం నుంచి 5 శాతంకన్నా దిగువకు పతనమైంది. అలాగే జాతీయ తలసరి ఆదాయంలో సగటు వాటా 127 శాతం నుంచి 84 శాతానికి పడిపోయింది. ఆరు వేలకుపైగా నమోదిత కంపెనీలు కోల్‌కతా నుంచి తమ ప్రధాన కార్యాలయాలను ఇతర ప్రాంతాలకు తరలించేశాయి. ఒకనాడు హౌరా లేదా సాల్ట్ లేక్ ప్రాంతాల్లో పనిచేసే బెంగాల్ యువత నేడు బెంగళూరు, హైదరాబాద్, పుణె నగరాల్లో నివసిస్తోంది. ఇలా తమ ఉద్యోగాలు, సంపద రాష్ట్రం నుంచి తరలిపోవడం చూసి కడుపు రగిలిన ఓటరుకు ప్రతీకారం తీర్చుకోవాల్సిన తరుణం ఆసన్నమైంది. దీనికి అనుగుణంగా వారి చేతికి బ్యాలెట్ పత్రం అందింది.

స్వతంత్ర భారత్‌లో ఏ పాలకుడూ సమర్థించుకోలేని రీతిలో మహిళలపై అఘాయిత్యాల్లో ఒకటి అటువంటి దురంతాలకు కేంద్రబిందువుగా నిలిచింది. సాక్షాత్తూ ఒక మహిళా ముఖ్యమంత్రి తన రాష్ట్రంలో మహిళలపై హింసకు, హత్యలకు బాధ్యురాలుగా మారారు. కోల్‌కతా నగరంలోని ఆర్.జి.కర్ వైద్య కళాశాలలో 2024 ఆగస్టు నాటి పోస్ట్ గ్రాడ్యుయేట్ ట్రైనీ డాక్టర్‌పై అత్యాచారం, హత్య ఇందుకు ఉదాహరణ. ఒక మూక ఆ రాత్రంతా నేర ప్రదేశంలో విధ్వంసం సృష్టించినా, నగర పోలీసులు నిమిత్తమాత్రులుగా వ్యవహరించారు. అటుపైన ఆ ఘోర ఉదంతంపై అక్కడి పోలీసుల విచారణ ప్రజల్లో విశ్వాసం కలిగించలేదని స్పష్టం కావడంతో దర్యాప్తును సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ)కు బదిలీ చేస్తూ కలకత్తా హైకోర్టు ఉత్తర్వు ఇచ్చింది. అధికశాతం మహిళలతో కూడిన జూనియర్ డాక్టర్ల బృందం దాదాపు 42 రోజులపాటు సమ్మె చేసిన తర్వాత వచ్చిందీ ఉత్తర్వు.

ఈ సంఘటనకన్నా ముందే 2024 జనవరిలో ఇలాంటి ఉదంతమే సందేశ్‌ఖాలిలో చోటు చేసుకుంది. రాష్ట్ర పోలీసులు దీనిపై ఎలాంటి కేసు నమోదు చేయనప్పటికీ, 55 రోజులపాటు పరారీలో ఉన్న తృణమూల్ జిల్లా పరిషత్ సభ్యుడిపై కేసు నమోదుకు డిమాండ్ చేస్తూ సుందర్‌బన్స్‌లోని ఒక ద్వీపవాసులైన మహిళలు వీధుల్లోకి వచ్చారు. అయితే, ఒకనాడు రూపాంతరీకరణ నినాదంతో ఉద్యమ శంఖం పూరించిన ఒక ముఖ్యమంత్రి, తన రాష్ట్రంలోని మహిళలు తన సొంత కేడర్‌కు వ్యతిరేకంగా కోర్టులలో, కేంద్ర దర్యాప్తు సంస్థల జోక్యం కోసం వీధులకెక్కాల్సిన పరిస్థితి కల్పించారు. ఇది కచ్చితంగా అమానుషం... ఖండనార్హ పరిపాలన.

బెంగాల్ మహిళలు సహనం నశించడానికి, రాష్ట్ర యువత త్యాగాలకు దీటైనది మరో ఉదంతం సాల్ట్ లేక్‌లో వెలుగులోకి వచ్చింది. ఆ ప్రాంతంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు రాత్రివేళ నిర్వహించిన తనిఖీలో తాళం వేసిన ఫ్లాట్ నుంచి రూ.21 కోట్ల నగదు స్వాధీనం చేసుకున్నారు. అలాగే, అక్కడి అనుబంధ ఆస్తులు సహా తదుపరి తనిఖీలో స్వాధీనం చేసుకున్న మొత్తం రూ.50 కోట్లు దాటింది. అటుపైన విద్యాశాఖ మంత్రిగా పశ్చిమ బెంగాల్ స్కూల్ సర్వీస్ కమిషన్‌కు అధ్యక్ష బాధ్యతలు నిర్వర్తిస్తున్న మంత్రి పార్థ చటర్జీ అరెస్టయ్యారు. ఇక ఉపాధ్యాయ, గ్రూప్‌సి, డి సిబ్బంది.. మొత్తం 25,07,53 మంది నియామకాలు అక్రమమని తేలడంతో 2024 ఏప్రిల్‌లో కలకత్తా హైకోర్టు వాటిని రద్దు చేయగా, ఆ తీర్పును 2025లో సుప్రీంకోర్టు కూడా సమర్థించింది.

బెంగాల్ యువతకు జీవితంలో స్థిరపడే అవకాశం కల్పించడం లక్ష్యంగా నిర్వహించిన పాఠశాల ఉపాధ్యాయ నియామక ప్రక్రియ వాటిని అమ్ముకునే కౌంటర్‌గా మారిపోయింది. అక్కడ నిజమైన అభ్యర్థికి వరుసలో చోటు కూడా దక్కలేదు. దీనికితోడు మరో మంత్రి జ్యోతిప్రియా మాలిక్ రేషన్ కుంభకోణంలో చిక్కుకున్నారు. అంతేనా... పశువుల కుంభకోణం, కమీషన్ల సంస్కృతి, సిండికేట్ రాజ్యం వంటివి మరెన్నో ఉన్నాయి. వీటన్నింటి మధ్యగల సంబంధమేమిటో ఓటరుకు స్పష్టంగా అర్థమైంది. మాఫియా నడుపుతున్న రాష్ట్రంలో లంచం ఇవ్వడానికి నిరాకరించే పౌరుడే తొలి బాధితుడు అవుతాడనడంలో సందేహం లేదు.

అయితే, ఈ అప్రతిష్టకు భిన్నంగా గడచిన దశాబ్దంలో ఒక ప్రతిష్ఠాత్మక రికార్డు నమోదైంది. అదేమిటంటే కేంద్ర ప్రభుత్వ పథకం 'ప్రధానమంత్రి ఆవాస్ యోజన' కింద 4.21 కోట్ల ఇళ్ల నిర్మాణం పూర్తయింది. ఇక 2019లో 3 కోట్ల కొళాయి కనెక్షన్లు ఉండగా, జల్ జీవన్ మిషన్ కింద అవి 15 కోట్లకు చేరాయి. ఆయుష్మాన్ భారత్ కింద రూ.5 లక్షల వార్షిక ఆరోగ్య బీమాతో దాదాపు 55 కోట్ల మంది లబ్ధి పొందారు. ప్రత్యక్ష నగదు బదిలీ (డీబీటీ) ఫలితంగా ఒకనాడు బెంగాల్‌లో ప్రతి సంక్షేమ కార్యక్రమం సొమ్ము కాజేసే దళారీ వ్యవస్థ అంతమైంది. బెంగాల్‌లోని ప్రతి బీజేపీ కార్యకర్త ఇంటింటికీ వెళ్లి ఓటు అడిగినపుడు అందుకు దన్నుగా నిలిచింది ఈ పథకాలే.

ఈ పునాది వెనుక విస్తృత నెట్‌వర్క్ ఉంది... బీజేపీ బూత్ స్థాయి కార్యకర్తలు, ఇతర ప్రముఖులు ఎన్నికల సమయంలో ఎన్నో బెదిరింపులు, దుశ్చర్యలు, శారీరక హింస వంటి అఘాయిత్యాలను భరించారు. ఇతర పార్టీలు సాహసించని రీతిలో ఓటర్ల నమోదు, రవాణా సహా పోలింగ్ కేంద్రాలకు వారిని రప్పించడంలో శ్రద్ధ చూపారు. ప్రధానమంత్రి, హోంమంత్రికి బెదిరింపులతోపాటు కేంద్ర బలగాలు వెళ్లిపోయాక ఏం జరుగుతుందో చూసుకోండన్న ప్రకటనలు, ఎన్నికల అనంతర హింసాకాండలో ఒకనాటి ప్రాణనష్టం ఇవన్నీ కార్యకర్తలకు గుర్తు చేయాల్సిన అవసరమేమీ లేదు. కోలకతా నగరం వీటన్నిటినీ మౌనంగా భరించింది. తాజా ఎన్నికలలో గౌరవనీయ హోంమంత్రి శ్రీ అమిత్ షా తమ కార్యకర్తలకు అండగా నిలిచారు. బెంగాల్‌లోని ప్రతి జిల్లాలో స్వయంగా పర్యటించారు, కొన్నిసార్లు వారాల వ్యవధిలోనే అదే పట్టణాన్ని సందర్శించే వారు. ఈ మేరకు వారు చేసిందంతా ఎన్నికల్లో సంచలనం సృష్టించడానికి కాదు.. మాఫియా కంచుకోటను బద్దలు కొట్టడానికే!

తాజా విజయంలో భాగస్వాములైన వారి వదనాలే తమ కథను వివరిస్తున్నాయి. ఆర్.జి.కర్ ఉదంతంలో బాధితురాలైన శ్రీమతి రత్న దేబ్‌నాథ్‌ను పానిహటిలో బీజేపీ తమ అభ్యర్థిగా రంగంలో దింపింది. ఆమె 15 సంవత్సరాల తృణమూల్ కంచుకోటను బద్దలు కొడుతూ భారీ ఆధిక్యంతో ఘన విజయం సాధించారు. అలాగే శ్రీమతి రేఖా పాత్ర కూడా ప్రభుత్వం తనకు నిరాకరించిన న్యాయం పొందడం కోసం సందేశ్‌ఖాలిలో తన సొంత గడ్డపై నుంచి హింగల్‌గంజ్‌లో పోటీపడ్డారు. వామపక్ష కూటమి 34 ఏళ్ల పాలనలో, 15 ఏళ్ల తృణమూల్ పాలనలో అనుభవాల రీత్యా జిల్లాల ఓటర్లు తొలిసారి కమలం వైపు మొగ్గు చూపారు. తదనుగుణంగా 2026 మే 4న, ఆదివారం నాడు బెంగాల్ చక్కగా లెక్కలు తేల్చింది. ఫలితాలు ప్రకటించిన 293 స్థానాలకు గాను బీజేపీ 206 స్థానాలను కైవసం చేసుకుంది. మునుపటి రెండు పార్టీల పాలనలో 49 ఏళ్లపాటు అనుభవించిన కష్టాలు, కన్నీళ్లు అంతమయ్యాయి. ఇదొక ఎన్నికల తీర్పు మాత్రమే కాదు... ఓ నైతిక విజయం. అయితే, బీజేపీ సాధించిన ఈ విజయాన్ని ఇప్పటికీ జీర్ణించుకోలేక పోతున్నారు. రాష్ట్రంలో 15 ఏళ్లుగా అసంతృప్తి పేరుకుపోయిన నేపథ్యంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ద్వారా 90 లక్షల మంది అనర్హులను తొలగించడాన్ని పరాజిత పక్షం ఓటర్ల అణచివేతగా అభివర్ణిస్తోంది. కానీ, ఈ విమర్శలకు గణాంకాలే స్పష్టమైన జవాబిస్తున్నాయి. పరిశీలన సమయంలో అత్యధికంగా ఓటర్లను తొలగించిన 20 నియోజకవర్గాల్లో తృణమూల్ కాంగ్రెస్ 13 గెలుచుకుంది. ఇందులో తొలి ఐదు స్థానాల్లోగల సంషేర్‌గంజ్, లాల్‌గోలా, భాగబంగోలా, రఘునాథ్‌గంజ్, మెటియాబురుజ్‌లలో 2021లోనే కాకుండా 2026లోనూ తృణమూల్ కాంగ్రెస్ అభ్యర్థులే నెగ్గారు. పునర్వ్యవస్థీకరణ సమయంలో తొలగించిన ఓటర్ల సంఖ్యకన్నా తక్కువ ఆధిక్యంతో ఫలితం తేలిన 49 నియోజకవర్గాలలో 26 బీజేపీ, 21 తృణమూల్ కాంగ్రెస్ గెలుచుకోగా మిగిలిన 2 చోట్ల కాంగ్రెస్ నెగ్గింది. లక్షిత తొలగింపు అనేది గెలిచిన ఓడిన పార్టీల మధ్య దాదాపు సమాన ఓట్ల తేడాను చూపదు. రాష్ట్ర చరిత్రలోనే అత్యధికంగా 92.93 శాతం ఓటింగ్ నమోదు కావడమే ఓటరు జాబితా విశ్వసనీయతపై సందేహాలను పటాపంచలు చేసింది. పరాజయం పాలైన పార్టీ ఓటరు తీర్పును వ్యతిరేకించడమంటే దానికి ఎదురైన తిరస్కృతితోపాటు దాని దాదాగిరీని, నిర్ణయాల్లోని అవివేకాన్ని మాత్రమే ప్రస్ఫుటం చేస్తుంది.


బెంగాల్ ఓటు వేసింది... బెంగాల్ తన ఎంపికను ఘనంగా చాటింది. ఓటరు కోరుకున్నదేమిటో అర్థం చేసుకోవడం కష్టమేమీ కాదు. ముఖ్యంగా వారు ఆకాంక్షించింది శాంతి... వీధులను కమ్మేసిన హింస నుంచి విముక్తి, సౌభాగ్యం. అలాగే నగరంలో మళ్లీ ఉపాధి అవకాశాల లభ్యత, స్థిరత్వ సాధన, ఊపిరి పీల్చుకోనిచ్చినందుకు రుసుము కోరని పరిపాలనను బెంగాల్ కోరుకుంటోంది. దేశానికి తొలి పారిశ్రామిక నగరం, వాణిజ్య రాజధాని, జాతీయ పాలన రూపశిల్పులను అందించిన రాష్ట్రంలో సాంస్కృతిక, ఆర్థిక రంగాల్లో స్వీయ పునరుజ్జీవన ప్రస్థానాన్నే బెంగాల్ నేడు ఆకాంక్షిస్తోంది. ఒకనాడు నేను పనిచేసిన కలకత్తా నగరం ఇక కోలుకుంటుంది. తద్వారా 2047 నాటికి 'వికసిత భారత్' స్వప్న సాకారంలో తన వంతు పాత్ర పోషించడానికి బెంగాల్ సిద్ధంగా ఉంది. గడచిన దశాబ్దంలోని ప్రతి సంక్షేమ పథకం, మౌలిక సదుపాయాల కల్పన నిర్ణయం వెనుక పౌరుడినే కేంద్రకంగా పరిగణించిన ప్రధానమంత్రి ఇప్పుడు మనకున్నారు. ప్రభుత్వం పౌరుడిపై విశ్వాసం ఉంచినందుకు ప్రతిఫలం ఇప్పుడు సంపూర్ణంగా లభించింది.



వ్యాసకర్త కేంద్ర పెట్రోలియం-సహజవాయువు శాఖ మంత్రి

# వెన్నెల వెలుగులో సారథి






పట్టుదలతో పనిచేస్తే అసాధ్యాన్ని సుసాధ్యం చేయడం సులువు. ఆ కోవలోనే తెలంగాణ సాంస్కృతిక సారథి ప్రజాప్రభుత్వంలో గాడిన పడుతుంది. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఏర్పడ్డ ప్రజాపాలన ప్రభుత్వంలో రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖామాత్యులు జూపల్లి కృష్ణారావు నేతృత్వంలోతెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ప్రత్యేక కార్యాదర్శి ఎ. వాణి ప్రసాద్ ఐఏఎస్, భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డా.ఏనుగు నరసింహ రెడ్డి ఐఏఎస్ పర్యవేక్షణలో తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్ పర్సన్ డా.జివి వెన్నెల గద్దర్ నాయకత్వంలో సారథికి వెలుగులు తేవడానికి ప్రయత్నిస్తున్నారని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు.

తెలంగాణ వచ్చిన తర్వాత తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న కవులు, కళాకారులు, గాయకులను కలిపి తెలంగాణ సాంస్కృతిక సారథిని ఏర్పాటు చేశారు. ఇందులో దాదాపు 583 మంది కళాకారులను ప్రభుత్వం తీసుకుంది. కానీ గత ప్రభుత్వం దశాబ్ద కాలంలో సాంస్కృతిక సారథి నిర్వహణ పట్ల పెద్దగా శ్రద్ధ చూపలేదనే విమర్శలు వున్నాయి. ఇదిలా వుంటే దాదాపు 40మందికి పైగా కళాకారుల్లో కొందరు చనిపోగా మరికొందరు మానుకోవడం జరిగింది. ప్రస్తుతం సారథిలో 540 మంది కళాకారులు పనిచేస్తున్నారు.

ప్రజాప్రభుత్వంలో సారథి చైర్ పర్సన్ వెన్నెల, అధికారి డా.విజయ్ కుమార్ పని విషయంలో మాత్రం నిబంధనలు పాటిస్తూనే, నిబద్ధతతో మెలుగుతూ కళాకారుల సమస్యల పట్ల స్నేహ హస్తం అందిస్తున్నారు. కేవలం ప్రభుత్వ పథకాలను ప్రచారం చేయడమే కాకుండ ప్రభుత్వం, ప్రజల పట్ల మెలుగుతున్న తీరును ప్రజలకు తెలియపరచడంలో ముందున్నారు. రాయడం, పాడటమే కాకుండా కళాకారుల్లో వున్న సృజనాత్మకతను వెలికి తీసే పనిలో వున్నారు. మానవ వనరులను మెరుగైన రీతిలో ఉపయోగించే కార్యక్రమాల్లో భాగంగా శిక్షణా కార్యక్రమాలు దోహదపడుతుందనే నమ్మకంతో మొదట తెలంగాణ రాష్ట్రగీత సాధన శిభిరం ఏర్పాటు చేశారు. ఆ తర్వాత కళాకారుల్లోని మహిళలకు ,పురుషులకు ఆట, పాటలతో పాటు డప్పు, కీబోర్డు వంటి పలు రకాల వాయిద్యాలు నేర్చుకునేందుకు తగిన శిక్షణ ఇస్తున్నారు. గతంలో మాదిరిగా కాకుండా ఒక పద్ధతి ప్రకారం సారథిని ముందుకు నడిపిస్తున్నారు.

అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకుపోతున్నారు. ఎప్పటికప్పుడు రాష్ట్ర సాంస్కృతిక శాఖామాత్యులు జూపల్లి కృష్ణారావు గారు కళాకారులతో ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహిస్తున్నారు. మరోవైపు జిల్లా పౌర సంబందాల శాఖ అధికారులతో మాట్లాడుతూ కళాకారుల పనితీరుపై పర్యవేక్షణ చేయడం జరుగుతుంది. మహిళలకు ప్రత్యేకంగా అవగాహన సదస్సుతో పాటు వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమాలను ప్రచారం చేయడమేగాక రాష్ట్ర పండుగలు బతుకమ్మ, బోనాలతో పాటు అనేక కార్యక్రమాల్లో పాల్గొని సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

గడచిన దశాబ్దకాలంలో కనీసం కళాకారులకు బదిలీల సౌకర్యం కూడ చేపట్టలేదు. ప్రజాపాలన ప్రభుత్వం ఏర్పడిన వెంటనే రెండు పర్యాయాలు బదిలీలు చేపట్టారు. ఇంకా అవసరాలకు అనుగుణంగా బదిలీలు చేపట్టే అవకాశాలు వున్నాయి. ఇదిలా వుంటే మరోవైపు ప్రభుత్వ ఉద్యోగులతో పాటు పీఆర్సీ ఇవ్వడం జరిగింది. అంతకు ముందు కేవలం రూ. 24,514 లతో దశాబ్దకాలం పాటు పని చేశారు. ప్రస్తుతం పీఆర్సీ ఇవ్వడంతో పాటు జీతం రూ.31.868 కి పెరిగింది. ఇది ప్రజా ప్రభుత్వం తీసుకున్న గొప్ప నిర్ణయం. దాదాపు 32 జిల్లాల్లో 51 బృందాలు పనిచేస్తున్నాయి. ప్రతినెలలో 25 రోజుల పాటు ప్రభుత్వం చేస్తున్న పనులను ప్రజలకు వివరిస్తూనే, ప్రభుత్వం సూచించిన ప్రత్యేక కార్యక్రమాల్లో పాల్గొంటారు.

సారథి చైర్ పర్సన్ మహిళాకళాకారుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం జరుగుతుంది. ఇందులో భాగంగా మార్చి 8న మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించి వారిని ఘనంగా సన్మానించారు. ఇటీవల రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు చేతుల మీదుగా సారథి వెబ్సైట్ ను ప్రారంభించారు. ప్రజాపాలన ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాల ప్రచారంలో సారథి నిర్వహిస్తున్న పాత్ర కీలకమని చెప్పాలి. తెలంగాణ ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా సారథి ఏడాదిలో చేపట్టిన కార్యాక్రమాల నివేదికను పుస్తకం రూపంలో తిసుకువచ్చారు. ఈపుస్తకాన్నీ మంత్రి జూపల్లి కృష్ణా రావు చేతుల మీదుగా అవిష్కరించారు. దీంతో సారథి పట్ల ఇటు ప్రజల్లో, అటు ప్రభుత్వంలో కూడా మంచి ఆదరణ, అభిప్రాయం ఏర్పడిందని చెప్పొచ్చు.

రచయిత
ముచ్చర్ల దినకర్ రచయిత
9440704535

# ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి

శంకర్ పల్లి వెలుతురు మే 11 :

ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని రావులపల్లి కలాన్ గ్రామ సర్పంచ్ సువర్ణ కృష్ణమూర్తి అన్నారు. శంకర్ పల్లి మండలం రావులపల్లి కలాన్ గ్రామంలో సోమవారం వేద పండితుల మంత్రోచ్ఛారణ మధ్య పోచమ్మ, ఈదమ్మ, రుక్కమ్మ,గడి మైసమ్మ గ్రామదేవతల విగ్రహ ప్రతిష్టాపన ధ్వజస్తంభ ప్రతిష్టాపన, సింహం,బలిపీఠం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈనెల 9వ తేదీ నుంచి 11వ తేదీ వరకు గ్రామంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించి సోమవారం విగ్రహ ప్రతిష్టాపన ధ్వ జస్తంభ ప్రతిష్టాపన నిర్వహించారు. మూడు రోజులుగా గ్రామంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. గణపతి పూజతో ప్రారంభమై పూర్ణాహుతి అలంకార సేవ మహా మంగళహారతి బోనాల ఊరేగింపు తదితర కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామస్తుల సహకారంతో గ్రామదేవతల ఆలయాల నిర్మాణం విగ్రహ ప్రతిష్టాపన తదితర కార్యక్రమాలు నిర్వహించుకోవడం జరిగిందని తెలిపారు. గ్రామదేవతల ఆశీస్సులు ప్రతి ఒక్కరి పై ఉండాలని ప్రజలందరూ సుఖ సంతోషాలతో





ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సరిత వెంకట్ రెడ్డి, మాజీ సర్పంచులు ప్రేమావతి రాములు, పావని హనుమంత్ రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ బుచ్చిరెడ్డి, వార్డు సభ్యులు, మాజీ వార్డు సభ్యులు గ్రామ పెద్దలు మహిళలు పాల్గొన్నారు.

# చేవెళ్ల నుండి కలెక్టరేట్ కార్యాలయానికి బస్సులు నడపాలి

- **సబర్బన్ సిటీ బస్సులలో జనరల్ పాస్, డే పాస్ పరిధిని చేవెళ్ల వరకు అనుమతించాలి.**
- **పి.డి.ఎస్.యు ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి ఖానాపురం రాజేష్ డిమాండ్.**

శంకర్ పల్లి వెలుతురు, మే 11 :

చేవెళ్ల నుండి రంగారెడ్డి జిల్లా కొంగరకలాన్ లోని కలెక్టరేట్ కార్యాలయం వరకు రోజుకు నాలుగు బస్సులు నడపాలని చేవెళ్ల ఆర్డీవో కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజావాణిలో ప్రగతి శిలా ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పి.డి.ఎస్.యు ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేష్ మాట్లాడుతూ చేవెళ్ల, శంకర్ పల్లి, షాబాద్, మొయినాబాద్, మండలాల, గ్రామాల ప్రజలు తమ సమస్యలను విన్నవించుకోవడానికి, పరిష్కరించుకోవడం కోసం కలెక్టరేట్ కి వెళ్దామంటే సరైన రవాణా సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అందరికీ అందుబాటులో ఉండాల్సిన కలెక్టరేట్ కార్యాలయం అడవిలో ఉన్నది కాబట్టి అక్కడికి వెళ్లడానికి సరైన రవాణా సౌకర్యం లేదు ప్రజలకు విద్యార్థులకు ఉద్యోగులకు ఇబ్బంది గా ఉంది. పేద ప్రజలు ఏదైనా సమస్య ఉంటే కలెక్టరేట్ కి వెళ్లడానికి కూడా ఎలా వెళ్లాలని అర్థం కాని పరిస్థితి ఉంది. కాబట్టి చేవెళ్ల నుండి కలెక్టరేట్ కి ఉదయం నుండి సాయంత్రం వరకు నాలుగు బస్సులు వెళ్లేలా చర్యలు తీసుకోవాల్సిందిగా ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘంగా డిమాండ్ చేస్తున్నాం అని అన్నారు. అదేవిధంగా సిటీ సబర్బన్ బస్సులలో జనరల్ పాస్, డే పాస్ ని తోల్కట్ట గెట్ వరకు మాత్రమే చెల్లుబాటు అవుతుంది. దానిని చేవెళ్ల వరకు అనుమతించాలి అని అన్నారు. ఈ కార్యక్రమంలో పి.డి. ఎస్.యు నాయకులు బొజ్జి శ్రీకాంత్, న్యాలట అశోక్, పి.డి.ఎస్.యు షాబాద్ మండల అధ్యక్షుడు అనిల్, తదితరులు పాల్గొన్నారు.



# హస్తినాపురంలో మల్లాస్ న్యూరో క్లినిక్ ఘనంగా ప్రారంభం




- **ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి**
- **ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి**

హస్తినాపురం వెలుతురు మే 11:

హస్తినాపురంలో బజాజ్ ఎలక్ట్రానిక్స్ ఎదురుగా ఆర్పి ఆప్టికల్స్ పక్కన నిర్వాహకులు మర్రి సాయి కిరణ్ రెడ్డి(ఎండి జనరల్ మెడిసిన్ ), డిఎం(గాంధీ ), ఎస్సిఈ న్యూరాలాజీ (ఆర్పిపి, యునైటెడ్ కింగ్ డమ్ ) నూతనంగా ఏర్పాటు చేసిన మల్లాస్ న్యూరో క్లినిక్ ( మెదడు మరియు నరాల కేంద్రం ) ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా ఎల్బీనగర్ నియోజకవర్గం ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి హాజరై సోమవారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ముందుగా నిర్వాహకులు మర్రి సాయి కిరణ్ రెడ్డి ని అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. మెదడు నరాల సంబంధిత వ్యాధులకు సమయానికి చికిత్స ఎంతో అవసరమని ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు ఈ క్లినిక్ అన్ని విధాల ఉపయోగపడాలని సూచించారు. ప్రజలు ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా ప్రారంభ దశలోనే వైద్యులను సంప్రదించాలని వారు పేర్కొన్నారు. అనంతరం ఎండి సాయి కిరణ్ రెడ్డి మాట్లాడుతూ.. హస్తినపురంలో నూతనంగా క్లినిక్ ని ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. మెదడు మరియు నరాలకు సంబంధించిన అన్ని రకాల చికిత్సలు తమ వద్ద అందుబాటులో ఉన్నాయని పక్షవాతం, గురక ఎక్కువగా రావడం, మూర్ఛ లేదా కోమాలోకి వెళ్లడం, జ్ఞాపకశక్తి కోల్పోవడం, మానసిక స్థితిలో మార్పులు, మాట తడబడటం, గందరగోళానికి గురి కావటం, తలనొప్పి వెన్నునొప్పి, వినికిడి లోపం, శరీరంలో తిమ్మిరి అండ్ జలదరింపు, అనుభూతి కోల్పోవడం, వణుకు కండరాల బలహీనత వంటి వాటికి సరసమైన ధరలకు నాణ్యమైన వైద్యం అందిస్తామని పేర్కొన్నారు. పలు పట్టణాలు, గ్రామాలలో అవసరమనుకుంటే క్యాంపులు ఏర్పాటు చేసి వైద్యం అందించడానికి తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ప్రజలు కాలనీవాసులు తమ సేవలను వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మల్కాజ్గిరి బిజెపి ఇన్చార్జి సామ రంగారెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ముద్దగౌని రామ్మోహన్ గౌడ్, హస్తినాపురం మాజీ కార్పొరేటర్ బానోతు సుజాత నాయక్, వనస్థలిపురం మాజీ కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర రెడ్డి, బిఎన్ రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి, ఆదిభట్ల మున్సిపాలిటీ మాజీ చైర్మన్ మర్రి నిరంజన్ రెడ్డి, బిఎన్ రెడ్డి నగర్ డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షులు కటిక రెడ్డి అరవింద్ రెడ్డి, వనస్థలిపురం డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షులు చింతల రవి కుమార్ గుప్త, స్థానిక నాయకులు, కాలనీ వాసులు, కుటుంబ సభ్యులు బంధుమిత్రులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రొద్దుటూరు 10వ వార్డులో కరెంట్ కష్టాలకు చెక్



- **నూతన ట్రాన్స్‌ఫార్మర్‌తో ప్రజల్లో ఆనందం**

శంకర్ పల్లి వెలుతురు, మే 11 :

శంకర్ పల్లి మండలం ప్రొద్దుటూరు గ్రామంలోని 10వ వార్డులో ఎన్నో ఏళ్లుగా ప్రజలను వేధిస్తున్న లోవోల్టేజ్ సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది. గ్రామ ప్రజల దీర్ఘకాల సమస్యను గుర్తించిన గ్రామ సర్పంచ్ బండ లక్ష్మి నర్సింహా, స్థానిక వార్డు సభ్యుడు కవేలి తిరుపతి రెడ్డి చొరవతో సోమవారం నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ గత కొన్నేళ్లుగా తాము తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. తక్కువ వోల్టేజ్ కారణంగా గృహోపకరణాలు సరిగా పనిచేయకపోవడం, రాత్రి వేళల్లో ఇళ్లలో చీకట్లు నెలకొనడం, వేసవి కాలంలో ఫ్యాన్లు కూడా సరిగా తిరగక ప్రజలు ఇబ్బందులు పడటం వంటి సమస్యలు ఎదురయ్యాయని చెప్పారు. ఎన్నిసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్యకు శాశ్వత పరిష్కారం దొరకలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే ఇటీవల స్థానిక వార్డు సభ్యుడిగా ఎన్నికైన కవేలి తిరుపతి రెడ్డి ప్రజల సమస్యను ప్రాధాన్యతగా తీసుకొని గ్రామ సర్పంచ్ బండ లక్ష్మి నర్సింహా దృష్టికి తీసుకెళ్లగా ఆమె వెంటనే స్పందించి విద్యుత్ శాఖ అధికారులతో సమన్వయం చేసి నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయించారని తెలిపారు. దీంతో ప్రస్తుతం వార్డులో విద్యుత్ సరఫరా మెరుగుపడి ప్రజలు ఉపశమనం పొందుతున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ బండ లక్ష్మి నర్సింహా మాట్లాడుతూ గ్రామ అభివృద్ధే తమ ప్రధాన లక్ష్యమని ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను అందించేందుకు ఎల్లప్పుడూ కృషి చేస్తామని తెలిపారు. గ్రామంలో విద్యుత్, తాగునీరు, రహదారులు వంటి సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తూ ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని చెప్పారు. వార్డు సభ్యుడు కవేలి తిరుపతి రెడ్డి మాట్లాడుతూ ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునే విధంగా పనిచేస్తానని 10వ వార్డు అభివృద్ధి కి ఎప్పటికీ ముందుంటానని పేర్కొన్నారు. ప్రజలు ఎదుర్కొనే ప్రతి సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరించే దిశగా కృషి చేస్తానన్నారు. నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు కావడంతో స్థానిక ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తూ ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ లైన్మెన్ వెంకటేష్, నాని ప్రభాకర్, మందుముల నర్సిములు, నక్క జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ చైతన్య పాఠశాల యాజమాన్యం పై క్రిమినల్ కేసు నమోదు చేయాలి

- **అడ్మిషన్స్, క్లాసులు ఒక మండలంలో అటెండెన్స్, రిజిస్టర్స్ అన్ని మరో మండలంలో.**
- **ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అటెండెన్స్ రికార్డులను విద్యాధికారికి తెలియకుండా సృష్టించిన ప్రిన్సిపల్ పై క్రిమినల్ కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలి.**
- **ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పి.డి.ఎస్.యు) డిమాండ్.**



శంకర్ పల్లి, వెలుతురు మే 11 :

అడ్మిషన్స్ అన్ని శంకర్ పల్లి మండలంలోని శ్రీ చైతన్య పాఠశాలలో తీసుకుని తరగతులు అక్కడ నిర్వహించి ఫీజులు అక్కడే తీసుకొని అటెండెన్స్ రికార్డులు మరో మండలం చేవెళ్లలోని శ్రీ చైతన్య పాఠశాలలో సృష్టించడం జరిగింది. దీనిపైన చర్యలు కోరుతూ చేవెళ్ల ఆర్డిఓ ఆఫీస్ లో నిర్వహిస్తున్న ప్రజావాణిలో పి.డి.ఎస్.యు ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేష్ ఆధ్వర్యంలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ శంకర్ పల్లి మండలంలోని శ్రీ చైతన్య పాఠశాల (కార్పొరేట్ పాఠశాల) లో 2025 26 విద్య అకాడమిక్ కి సంబంధించి ఆ పాఠశాలలో పదవ తరగతి కి ప్రభుత్వపరంగా ఎలాంటి అనుమతులు లేకున్నా అక్కడ అడ్మిషన్స్ తీసుకొని చేవెళ్లలోని శ్రీ చైతన్య పాఠశాలలో విద్యార్థులు తరగతులకు రాకపోయినా పాఠాలు బోధించకుండా శంకర్ పల్లి నుండి ప్రతిరోజు చేవెళ్లలోని శ్రీ చైతన్య పాఠశాలకు వచ్చినట్టుగా రికార్డులు సృష్టించి అటెండెన్స్ వేసిన ప్రిన్సిపల్ కాబట్టి మీరు ఇటు ప్రభుత్వ నిబంధనలను పూర్తిగా అధిగమించి మండల విద్యాశాఖ అధికారికి కూడా తెలియకుండా పదవ తరగతి విద్యార్థుల ఎగ్జామ్స్ సెంటర్స్ చేవెళ్లలో ఉండడంతో దానిని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పి.డి.ఎస్.యు) బయట పెట్టడంతో మండల విద్యాధికారికి సమాచారం తెలిసింది. అప్పటివరకు ఎలాంటి సమాచారం విద్యాశాఖ అధికారికి లేదని ఎంఈఓ అన్నారు. విద్య హక్కు చట్టం 2009 (ఆర్.టి.ఈ) సెక్షన్ 24 ఉల్లంఘించినందుకు, భారత శిక్షాస్మృతి ప్రకారం క్రమశిక్షణ క్రిమినల్ చర్యలు తీసుకొని ఈ విధంగా తప్పుడు రికార్డులను సృష్టించిన శ్రీ చైతన్య పాఠశాల ప్రిన్సిపల్ పై క్రిమినల్ కేసులు నమోదు చేసి పాఠశాల గుర్తింపు రద్దు చేయాలని అన్నారు.

# తెలంగాణ రాష్ట్ర ఐఎన్‌టియుసి ఫెడరేషన్ నూతన కార్యవర్గ నియామకం

## ఘనంగా జరిగిన ప్రమాణ స్వీకారోత్సవం

ఎల్బీనగర్, వెలుతురు మే 11:

ఇండియన్ నేషనల్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ ఫెడరేషన్(ఐ.ఎన్.టి.యు.సి) తెలంగాణ రాష్ట్ర నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం సరూర్ నగర్ లోని ఎస్ఆర్ఎం కన్వెన్షన్ హాల్ లో ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ఐఎన్‌టియుసి ఫెడరేషన్ జాతీయ అధ్యక్షులు డాక్టర్ విశాలి ప్రసాద్ శర్మ ముఖ్య అతిథిగా విచ్చేసి నూతన కమిటీని ఉద్దేశించి ప్రసంగించారు. ఆయనతో పాటు గౌరవ అతిథులుగా టి.ఎఫ్.టి.యు అధ్యక్షులు కాచం సత్యనారాయణ, ఆంధ్ర ప్రదేశ్ ఐఎన్‌టియుసి ఫెడరేషన్ అధ్యక్షులు సయ్యద్ ముర్షిద్, ఆర్టీసీ యూనియన్ లీడర్ రాజిరెడ్డి పాల్గొని, కార్మిక సంఘాల బలోపేతం మరియు కార్మికుల హక్కుల రక్షణపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఐఎన్‌టియుసి ఫెడరేషన్ నూతన అధ్యక్షులుగా బిజ్జల రామకృష్ణారెడ్డి బాధ్యతలు స్వీకరించారు. సీనియర్ జనరల్ సెక్రెటరీగా ఉప్పల శ్రవణ్ కుమార్ గుప్తా, జాతీయ మహిళా చైర్మన్‌గా భవాని త్రివేది నియామకమయ్యారు. వర్కింగ్ ప్రెసిడెంట్లుగా కృష్ణారెడ్డి,



కోడుమూరు దయాకర్, అశోక్ కుమార్ మరియు మణికంఠ బాధ్యతలు చేపట్టగా, ప్రసన్న జనరల్ సెక్రెటరీగా, గడ్డం శ్రీనివాస్ మరియు జిల్లా శ్రీనివాస్ సెక్రెటరీలుగా నియమితులయ్యారు. అలాగే జాయింట్ సెక్రెటరీలుగా అశోక్ చారి, శివరాజ్ మరియు కమిటీలో కీలక సభ్యునిగా బిజ్జల దీక్షిత్ రెడ్డికి బాధ్యతలు అప్పగించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, వారి సంక్షేమం కోసం ఈ నూతన కార్యవర్గం నిరంతరం కృషి చేస్తుందని, కార్మిక విభాగంలో కాంగ్రెస్ జెండాను మరింత ఎత్తుకు తీసుకెళ్తామని నాయకులు ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో సందీప్, బాలరాజు, కొండల్, వడ్డే రాజు, వెంకటేష్, శ్రీకాంత్ రెడ్డి, రాజు, అనురాధ, రమేష్‌తో పాటు వందలాది మంది ఐఎన్‌టియుసి ఫెడరేషన్ సభ్యులు మరియు కార్మిక నాయకులు భారీ సంఖ్యలో తరలివచ్చారు.

# చిలకలగూడ యావన్ హత్య కేసు

- 10 మంది అరెస్టు
- ప్రేమ, ప్రతీకారం, పక్కా ప్రణాళికతో హత్య కలకలం
- వివరాలు వెల్లడించిన సికింద్రబాద్ డీసీపీ రక్షిత
- యావన్‌పై 16–17 సార్లు కత్తిపోట్లతో హత్య
- స్కూల్ రోజుల స్నేహం నుంచి ప్రేమగా మారిన కథ
- అమ్మాయి బావ సాయికిరణ్ ప్రేరణతో కుట్ర
- హత్యకు ఐదు రోజుల ముందే ప్లాన్ చేసిన నిందితులు
- యువకుడిపై నిఘా, రెక్కీ నిర్వహించిన గ్యాంగ్
- స్నేహితుడి ఇంటి వద్దే దాడికి తెర
- 19–21 ఏళ్ల యువకులే ప్రధాన నిందితులు
- డ్రగ్స్ పరీక్షల్లో ఇద్దరికి పాజిటివ్
- మైనర్ బాలుడు కూడా హత్యలో భాగస్వామి
- యువత భవిష్యత్ నాశనం అవుతున్నదని డీసీపీ హెచ్చరిక

హైదరాబాద్ వెలుతురు మే 11:

చిలకలగూడ ప్రాంతంలో సంచలనం సృష్టించిన యావన్ హత్య కేసులో సికింద్రాబాద్ జోన్ పోలీసులు కీలక పురోగతి సాధించారు. ఈ నెల 7న జరిగిన ఈ హత్య ఘటనకు సంబంధించి మొత్తం 10 మందిని అరెస్టు చేసినట్లు డీసీపీ రక్షిత మీడియాకు వెల్లడించారు. నిందితుల్లో తొమ్మిది మంది మేజర్లు కాగా, ఒక మైనర్ బాలుడు ఉన్నట్లు ఆమె తెలిపారు. పక్కా ప్రణాళిక ప్రకారమే ఈ హత్య జరిగిందని దర్యాప్తులో స్పష్టమైందని పేర్కొన్నారు.

డీసీపీ రక్షిత వివరాల ప్రకారం, యావన్ మరియు ఓ యువతి స్కూల్ రోజుల నుంచే స్నేహితులు. ఆ స్నేహం క్రమంగా ప్రేమగా మారి గత రెండేళ్లుగా కొనసాగుతోంది. అయితే ఈ సంబంధాన్ని యువతి కుటుంబ సభ్యులు అంగీకరించలేదని తెలిపారు. గతంలోనే యావన్‌ను హెచ్చరించినట్లు పోలీసులు వెల్లడించారు. అయినప్పటికీ సంబంధం కొనసాగడంతో కుటుంబంలో ఉద్రిక్తతలు పెరిగాయి.

ఈ నేపథ్యంలో హత్యకు ఐదు రోజుల ముందే నిందితులు పక్కా ప్లాన్ రూపొందించినట్లు దర్యాప్తులో తేలింది. యావన్‌పై నిరంతర నిఘా పెట్టిన గ్యాంగ్ అతని కదలికలను గమనిస్తూ రెక్కీ నిర్వహించింది. అతడు ఎక్కడ ఉంటున్నాడో, ఎవరిని కలుస్తున్నాడో తెలుసుకొని దాడికి అనువైన సమయం కోసం ఎదురు చూసినట్లు పోలీసులు తెలిపారు.



ఘటన రోజు యావన్ స్నేహితుడి ఇంటి వద్ద ఉన్నట్లు సమాచారం అందుకున్న నిందితులు అక్కడికి చేరుకుని దాడికి పాల్పడ్డారు. ఒక్కసారిగా దాడి చేసి, ఓ వ్యక్తి యావన్‌పై 16 నుంచి 17 సార్లు కత్తితో పొడిచినట్లు డీసీపీ రక్షిత వివరించారు. తీవ్ర గాయాలతో అతడిని వెంటనే గాంధీ ఆస్పత్రికి తరలించినప్పటికీ అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

హత్య జరిగిన వెంటనే పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. ఆధారాల సేకరణలో భాగంగా హత్యకు ఉపయోగించిన కత్తి, బైక్‌లు, మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. టెక్నికల్ ఎవిడెన్స్ ఆధారంగా నిందితులను గుర్తించి సమగ్ర దర్యాప్తు తర్వాత 10 మందిని అరెస్టు చేసినట్లు తెలిపారు.

అరెస్టయిన వారిలో ఏ1 సాయికిరణ్ (అమ్మాయి బావ), ఏ2 రాజాం పరమేశ్ (అమ్మాయి అన్నయ్య), ఏ3 రాజాం వంశీకృష్ణ, ఏ4 రాజాం మనీశ్, ఏ5 శ్రీగిరి రాహుల్, ఏ6 కుచ్చుల శివనందన్, ఏ7 రాజాం నరసింహ (అమ్మాయి తండ్రి), ఏ8 రాజాం శ్రీశైలం (అమ్మాయి బాబాయ్), ఏ9 రాజాం మల్లేశ్ (అమ్మాయి బాబాయ్), ఏ10 మైనర్ బాలుడు ఉన్నారు.

దర్యాప్తులో మరో కీలక విషయం బయటపడిందని పోలీసులు తెలిపారు. నిందితుల్లో శ్రీగిరి రాహుల్ మరియు శివనందన్‌కు డ్రగ్స్ పరీక్షలు నిర్వహించగా పాజిటివ్ వచ్చినట్లు వెల్లడించారు. ఈ కోణంలో కూడా విచారణ కొనసాగుతోందని అధికారులు తెలిపారు. హత్య వెనుక మత్తు పదార్థాల ప్రభావం ఉన్నదా అనే అంశాన్ని కూడా పరిశీలిస్తున్నట్లు చెప్పారు.

డీసీపీ రక్షిత మాట్లాడుతూ, 19 నుంచి 21 ఏళ్ల మధ్య ఉన్న యువకులు ఎక్కువగా ఇలాంటి ఘోర ఘటనల్లో పాల్గొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాత్కాలిక ఆవేశాలు, మత్తు పదార్థాలు, గ్యాంగ్ ప్రభావం వల్ల యువత తమ భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారని హెచ్చరించారు. ఇలాంటి కేసుల్లో యువత ఇరుక్కోకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

ఈ ఘటనతో చిలకలగూడ ప్రాంతంలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ప్రేమ, కుటుంబ ప్రతిష్ఠ, వ్యక్తిగత ఆగ్రహం కలిసి ఒక యువకుడి ప్రాణాన్ని తీసిన ఈ కేసు నగరంలో చర్చనీయాంశంగా మారింది. పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు తెలిపారు.

## మంచాల మండలంలో ఘనంగా సమ్మర్ క్యాంప్ ప్రారంభం



- విద్యార్థులు సమ్మర్ క్యాంపును సద్వినియోగం చేసుకొని తమ ప్రతిభను పెంపొందించుకోవాలి
- మంచాల మండలం ఎంపీడీవో అధికారి అన్నారం బాల శంకర్, గ్రామ సర్పంచ్ మానిపాటి శోభ కుమార్

మంచాల వెలుతురు మే 11:

మంచాల మండలం99రోజుల ప్రణాళిక@ ఎడ్యుకేషన్ వీక్‌లో భాగంగా ఈరోజు మంచాల మండ లం ఆరుట్ల పి యం శ్రీ పాఠశాలలో 6వ తరగతి నుండి9వతరగతి విద్యార్థుల కోసం సమ్మర్ క్యాం ప్‌ను ఘనంగా నిర్వహించారు ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మంచాల మండలం ఎంపీ డీవో అధికారి అన్నారం బాలశంకర్ గారు హాజరై మాట్లాడుతూ విద్యార్థులకు పలుసూచనలు చేశారు సమ్మర్ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకొని విద్యార్థులు తమప్రతిభను పెంపొందించు కోవాలని అన్నారు మండల విద్యాధికారి రాందాస్ గారు మాట్లాడుతూ విద్యార్థులు ఆడుతూపాడుతూ చ క్కటి విషయాలను నేర్చుకుంటూ సమ్మర్ క్యాంప్‌ను వినియోగించుకోవాలని కోరారు గ్రామ సర్పం చ్ శ్రీమతి శోభ కుమార్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి సమ్మర్ క్యాంప్‌లో పాల్గొని కొత్త విషయాలు నేర్చుకోవాలని అన్నారు ఈ కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జ్ హెడ్‌మస్టర్ రవికాంత్ రెడ్డి సి ఆర్ పి గిరీష్ తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఉపాధ్యాయులు శ్రీకాంత్.ఇతర ఉపాధ్యాయులు.వి వి లు విద్యార్థులు అనంతరం సమ్మర్ క్యాంప్‌కు హాజరైన విద్యార్థులను మంచాల మండల టీఎస్ యుటి ఎఫ్ అధ్యక్షులు డాక్టర్ ఆజ్మత్ ఖాన్ మరియు బిటిఎఫ్ రంగారెడ్డి ని జిల్లా ఉపాధ్యక్షు లుకంబాల పల్లి శ్రీకాంత్ అభినందించారు అలాగే మంచాల మండల ఎంపీడీవో అధికారి బాలశంకర్ గారు జి ల్లా పరిషత్ ముఖ్య ప్రణాళికా అధికారి సీఈఓగా పదోన్నతి పొందిన సందర్భంగా డాక్టర్ ఆజ్మత్ ఖాన్ కంబాలపల్లి శ్రీ కాంత్ మండల విద్యాధికారి రాందాస్ తదితరులు వారికి హృదయ పూర్వక శుభాకాంక్షలుతెలిపారు కార్యక్రమంలో విద్యార్థులు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు

## ఖైరతాబాద్ రూరల్ కమిషనర్‌ను కలిసిన కాంగ్రెస్ నేతలు

- హిమాయత్‌నగర్ డివిజన్ సమస్యలపై వినతి
- పెండింగ్ పనులు వేగవంతం చేయాలని మాజీ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్ విజ్ఞప్తి
- కాంట్రాక్టర్లు, అధికారులతో మాట్లాడాలని కమిషనర్‌ను కోరిన నాయకులు
- అంబర్‌పేట్ సర్కిల్ నుంచి ఖైరతాబాద్ సర్కిల్‌కు మార్పుతో పనుల్లో జాప్యం
- డివిజన్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అభ్యర్థన
- నూతనంగా బాధ్యతలు చేపట్టిన సంతోష్ ఐఏఎస్‌కు శుభాకాంక్షలు
- స్థానిక సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని డిమాండ్
- కాంగ్రెస్ నాయకుల సమక్షంలో సమావేశం
- డివిజన్ అభివృద్ధి పనులపై చర్చ
- పలువురు కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకుల పాల్గొనడం



హైదరాబాద్ వెలుతురు మే 11:

ఖైరతాబాద్ రూరల్ కమిషనర్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన సంతోష్ ఐఏఎస్‌ను హిమాయత్‌నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్ ఆధ్వర్యంలో డివిజన్ కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్ మాట్లాడుతూ.. గత నెలలో హిమాయత్‌నగర్ డివిజన్ అంబర్‌పేట్ సర్కిల్ నుంచి ఖైరతాబాద్ సర్కిల్ పరిధిలోకి మారిన తర్వాత అభివృద్ధి పనులు మందగించాయని తెలిపారు. సంబంధిత కాంట్రాక్టర్లు, అధికారులతో మాట్లాడి పెండింగ్ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని కమిషనర్‌ను కోరారు.

డివిజన్‌లో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అభివృద్ధి కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని నాయకులు విజ్ఞప్తి చేశారు. దీనిపై కమిషనర్ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు జి. రామన్ గౌడ్, అశోక్, ప్రభాకర్, యాదగిరి, జ్ఞానేశ్వర్, గణేష్, జాకీ, జస్వాల్, సర్ఫరాజ్, అనీష్, సందీప్, జగదీష్, శ్యామ్, రాజేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రధాని నరేంద్ర మోడీ తెలంగాణ పర్యటనలో బీసీల గురించి మాట్లాడకపోవడం బాధాకరం



- బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్

హైదరాబాద్ వెలుతురు మే 11:

భారత ప్రధాని నరేంద్ర మోడీ నిన్న తెలంగాణ పర్యటనలో 60 శాతం ఉన్నటువంటి బీసీల సమస్యలు గానీ బీసీల ఎజెండా గాని ఉచ్చరించకపోవడం బాధాకరమని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్ విచారం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఒక పత్రిక ప్రకటనలో విడుదల చేస్తూ దేశమంతా సుడిగాలి పర్యటన చేస్తు నేను బీసీని అని చెప్పుకునే ప్రధాని నరేంద్ర మోడీ ఈరోజు న్యాయమైన బీసీల డిమాండ్ల గురించి మాట్లాడకపోవడం బాధాకరమన్నారు.

## తొర్రూర్ లో వైభవంగా బీరప్పస్వామి కళ్యాణ మహోత్సవం వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే




తొర్రూర్ గ్రామంలో బీరప్ప స్వామి దేవాలయం ప్రాంగణంలో సిసి రోడ్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి

- తెలంగాణ గ్రామీణ సంస్కృతికి బీరప్ప ఉత్సవాలు ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి

ఇబ్రహీంపట్నం వెలుతురు మే 11:

ఇబ్రహీంపట్నం నియోజకవర్గం తొర్రూర్ గ్రామంలో తెలంగాణ గ్రామీణ సంస్కృతికి బీరప్పఉత్సవా లు ప్రతీ కలని తరతరాల సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఇబ్ర హీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి తెలిపారు అబ్దుల్లాపూర్ మెట్ మండలం తొర్రూర్ గ్రామంలో జరుగుతున్న బీరప్ప ఉత్సవాల్లో ఆయన పాల్గొన్నారు కురుమ సంఘం ఆధ్వర్యంలో ని ర్వహిస్తున్న వేడుకల్లో భాగంగా సోమవారం బీరప్పకామరతి కళ్యాణం కనుల పండుగగా జరిగింది వివిధ గ్రామాల్లో నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలిరాగా వారితో కలిసి ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారె డ్డి రాష్ట్రరోడ్డు అభివృద్ధి సంస్థ చైర్మన్ మల్ రెడ్డి రాంరెడ్డి కళ్యాణం కనులారా వీక్షించి స్వామివారి ఆశీస్సులు తీసుకుని మొక్కులు సమర్పించారు ఆధునిక కాలంలో జానపద కళలు అంతరించిపో కుండా తమ వారసత్వాన్ని కొనసాగిస్తున్న ఒగ్గు కళాకారులను ఈ సందర్భంగా ఎమ్మెల్యే అ భినందించారు బీరప్పస్వామి కృపతో నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆ కాంక్షించారు ఆలయ అభివృద్ధి కురుమల సంక్షేమానికి పూర్తి సహకారం అందిస్తానని మల్ రెడ్డి హామీ ఇచ్చారు ఈ సందర్భంగా నిర్వాహకులు ఎమ్మెల్యే రంగారెడ్డిని ఘనంగా సన్మానించారు భ క్తుల సౌకర్యార్థం గ్రామంనుంచి ఆలయం వరకు రూ 50లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ఈ సంద ర్భంగా ఎమ్మెల్యే ప్రారంభించారు వేడుకలవేళ ఎలాంటిఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చే యా లని అధికారులను ఆయన ఆదేశించారు ఈకార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు నాయకులు భక్తులు తదితరులు పాల్గొన్నారు

## రంగారెడ్డి జిల్లా కార్యాలయంలో ప్రజావాణికి (85) ఫిర్యాదులు



- ప్రజలు ఫిర్యాదులు చేసిన దరఖాస్తులను వివిధ శాఖల అధికారులు సమస్యలు వెంటనే పరిష్కరించాలి
- రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి

ఇబ్రహీంపట్నం వెలుతురు మే 11:


ఇబ్రహీంపట్నం నియోజకవర్గం కొంగర కలాన్ రంగారెడ్డి జిల్లా కార్యాలయం సోమవారం రోజు సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమా నికి 85 ఫిర్యాదులు అందాయి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదు దారులు తమ సమస్యలను జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ)చంద్రారెడ్డికి విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాసమస్యల సత్వరపరిష్కారం కోసంనిర్వహి స్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీ లన జరుపుతూ పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు రెవెన్యూశాఖ 42 ఇతర శాఖలు43 మొత్తం 85 దరఖస్తులు అందాయి ఈకార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు కలెక్టరేట్ సూపరింటెండెంట్లు సంబంధిత అధికారులు తదితరులుపాల్గొన్నారు

## విద్యా వారోత్సవాల ప్రారంభం సందర్భంగా కార్పొరేట్ విద్యా సంస్థల ఫీజులు కట్టడి చేయండి

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి లేఖ రాసిన బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్

హైదరాబాద్ వెలుతురు మే 11:

అడ్మిషన్ ప్రారంభం రోజే 60 శాతం ఫీజులు కట్టాలని కార్పొరేట్ పాఠశాలలు కాలేజీలు విద్యార్థులను మరియు వాళ్ళ తల్లిదండ్రులను వేధింపులకు గురి చేస్తున్నాయని వెంటనే వాటికి అడ్డుకట్ట వేయాలని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.అలా వసూలు చేసే కార్పొరేట్ కాలేజీల గుర్తింపు రద్దు చేయాలని విద్యా వారోత్సవాల ప్రారంభం సందర్భంగా ఈరోజు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి లేఖ రాసినట్లు పేర్కొన్నారు.ఈ సందర్భంగా లింగం గౌడ్ మాట్లాడుతూ ధనార్జనే ధ్యేయంగా కార్పొరేట్ విద్యాసంస్థలు పనిచేస్తున్నాయని ఇంటర్మీడియట్ గ్రూపులకే వేరు వేరు పేర్లు పెడుతూ స్టార్ గ్రూప్ అని 120 గ్రూప్, సూపర్ 60 అని,స్పార్క్ గ్రూప్ అని అడ్వాన్స్ గ్రూప్ అని వివిధ పేర్లతో మభ్యపెడుతు విద్యార్థులను మరియు వారి తల్లిదండ్రులను అయోమయానికి గురిచేస్తున్నాయని అన్నారు.





శ్రీశ్రీశ్రీ కంఠమహేశ్వరస్వామి దేవాలయంలో శివస్వాముల గురుస్వామి లొంగరీ యాదగిరి ఆధ్వర్యంలో 10వ సోమవారం అన్నదాన కార్యక్రమం

- ఈ సోమవారం అన్నదాన ప్రభువు పాండాల జగన్ గౌడ్

మంచాల వెలుతురు మే 11:

మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో శ్రీశ్రీశ్రీకంఠమహేశ్వర స్వామి దేవాలయంలో ప్రతి సోమవా రం రోజు గౌడ సంఘం పెద్దలు దాతల సహకారంతో శివస్వాముల గురుస్వామి లొంగరీ యాదగిరి అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నారు ఈ సోమవారం అన్నదాన ప్రభువు పాండాల జగన్ గౌ డ్ సహకారంతో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు ముందుగా గౌడ సంఘం పెద్దలు అన్నదా న ప్రభువు కంఠమహేశ్వరస్వామికి శివలింగానికి ప్రత్యేకపూజలు చేసి అన్నదాన కార్యక్రమం ప్రారం భం చేశారు భక్తులకు దగ్గర ఉండి అన్నదాన ప్రసాదం వడ్డించిన గౌడ సంఘం అధ్యక్షుడు తంగడి పల్లిపల్లి నరేందర్ గౌడ్ గౌడ సంఘం ఉపాధ్యక్షుడు సుంకరి ప్రవీణ్ గౌడ్ ఈకార్యక్రమంలో అయ్య ప్పస్వాముల గురుస్వామి మాజీ ఎంపీటీసీ కావాలి శ్రీనివాస్ ముదిరాజ్ ఆరుట్ల గ్రామఉపసర్పంచ్ నుకం రాజు ముదిరాజ్ ఇందిరమ్మ కమిటీ చెరుకు నరసింహగౌడ్ అంతటి రాజుగౌడ్ వైయస్సార్ మాధగోని జంగయ్య సుంకరి లచ్చయ్య గౌడ్ అంతటి దశరథగౌడ్ గడ్డం భాస్కర్ గౌడ్ పాండాల రా ములు గౌడ్ పాశం చిత్తూగౌడ్ మద్ది బాషా బూర రాజ్ కుమార్ భక్తులు తదితరులు పాల్గొన్నారు

## విద్యార్థులకు నగదు ప్రోత్సాహం అందించిన మాజీ జెడ్పిటిసి బుడిగె పెంటయ్య గౌడ్

**యాదగిరిగుట్ట, మే 11 వెలుతురు న్యూస్:**

ఇటీవల పదవ తరగతి పరీక్షల్లో అత్యధిక మార్పులు సాధించి ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు రాజపేట మండల మాజీ జెడ్పిటిసి , రఘునాథపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బుడిగె పెంటయ్య గౌడ్ ఆర్థిక సహాయం అందించి అభినందించారు. సోమవారం యాదగిరిగుట్ట మండలం చిన్న గౌరాయపల్లి గ్రామంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య చేతుల మీదుగా ఆ ఇద్దరు విద్యార్థులకు మాజీ జెడ్పిటిసి బుడిగె పెంటయ్య గౌడ్ ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ , ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించి ఉత్తమ ప్రతిభ కనబరిచిన



ఈ విద్యార్థులను అభినందిస్తున్నామని అన్నారు. సాధారణ, పేద మధ్యతరగతి కుటుంబాల నుండి వచ్చిన ఈ విద్యార్థులు 10వ తరగతి పరీక్షల్లో మంచి ప్రతిభను కనబరిచారని అభినందించారు .వీరిని ఆదర్శంగా తీసుకొని ఇతర విద్యార్థులందరూ చదువులో ఉన్నత స్థాయిలో రాణించాలని అన్నారు. ఇలాంటి ప్రతిపగల విద్యార్థులకు వారి ఉన్నత చదువుల కోసం తనవంతుగా కూడా సహకరిస్తానని హామీ ఇచ్చారు. వారికి ఆర్థిక సహాయం అందించి ప్రతిభ గల విద్యార్థులను ప్రోత్సహించిన మాజీ జడ్పిటిసి బుడిగే పెంటయ్య గౌడ్ ను అభినందిస్తున్నామని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను శాలువాలతో సత్కరించి మాజీ జడ్పిటిసి బుడిగ పెంటయ్య గౌడ్ అందించిన నగదు ఆర్థిక ప్రోత్సాహకాన్ని వారికి అందజేశారు. ఈ సందర్భంగా మాజీ జడ్పిటిసి బుడిగే పెంటయ్య గౌడ్ మాట్లాడుతూ ప్రతిభ గల ఈ విద్యార్థులను ప్రోత్సహించేందుకు నగదు సహకారాన్ని అందజేశామని అన్నారు . ప్రతిభ గల విద్యార్థులను అన్ని విధాలుగా ఆదుకుంటామని అన్నారు. చదువులో రాణిస్తూ విద్యా రంగంలో దూసుకెళ్తున్న విద్యార్థులను ప్రోత్సహిస్తూ నగదు సహాయాన్ని అందించిన మాజీ జడ్పిటిసి బుడిగే పెంటయ్య గౌడ్ ను పలువురు నాయకులు కార్యకర్తలు అధికారులు , స్థానిక గ్రామస్తులు ప్రత్యేకంగా అభినందించారు.

## వేసవి శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంఈఓ.

- **వేసవి శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి.**
- **ప్రారంభమైన విద్యా వారోత్సవాలు**
- **ఎంఈఓ కొనమంచలి శ్రీనివాస్**

తిరుమలగిరి (సాగర్) వెలుతురు న్యూస్ మే 11:

బాల, బాలికలు వేసవి శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకొని నైపుణ్యాలను అలవర్చుకోవాలని తిరుమలగిరి సాగర్ మండల విద్యాధికారి కొనమంచలి శ్రీనివాస్ కోరారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా విద్యాశాఖ వారోత్సవాల సందర్భంగా సోమవారం తిరుమలగిరి సాగర్ మండల కేంద్రంలోని పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పా



ఠశాలలో విద్యా వారోత్సవాన్ని, వేసవి శిక్షణ శిబిరాన్ని ముఖ్య సలహాదారులు పగడాల సైదులు ,ఇరిగి శీనులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారం రోజుల పాటు విద్యా వారోత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. విద్యా వారోత్సవాల్లో ప్రతి ఒక్కరు భాగస్వాములై ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేయాలని కోరారు. అదేవిధంగా వేసవి శిక్షణ శిబిరంలో 15 రోజులపాటు క్రీడలు ,చిత్రలేఖనం, సంగీతం, నృత్యం ,యోగా, ఆరోగ్య రక్షణ ,వ్యక్తిత్వ వికాసం ,కంప్యూటర్ విద్య వంటి అంశాల్లో ప్రత్యేక మాస్టర్లచే శిక్షణ ఇప్పించడం జరుగుతుందన్నారు. మండలం లోని 6 నుంచి 9 తరగతి వరకు చదువుతున్న బాల,బాలికలు ఈ వేసవి శిక్షణ శిబిరంలో చేరి క్రీడలు, కళల పట్ల తర్ఫీద్ పొందాలన్నారు. ఈ అవకాశాన్ని బాల, బాలికలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయుడు డాక్టర్ మెగావత్ భాను, శ్రీలత, బాల, బాలికలు పాల్గొన్నారు. అనంతరం బాల ,బాలికలకు చిత్రలేఖనంలో మెలుకువలు నేర్పించారు.

## డిగ్రీ కళాశాలలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా విద్యా వారోత్సవాలు కార్యక్రమం

రామన్నపేట వెలుతురు న్యూస్ మే 11:

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల రామన్నపేటలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా విద్యా వారోత్సవాలను ఈరోజు ఘనంగా ప్రారంభించడం జరిగింది. ఇందులో భాగంగా మొదటి రోజు మౌలిక వనరుల సదుపాయాన్ని పెంపొందించుకునే కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. రూసా నిధులతో నిర్మించబడిన వెహికల్ షెడ్డుతో పాటు ప్రధాన రోడ్డు నుండి కళాశాల భవనం వరకు వేసిన సిసి రోడ్డును కూడా కళాశాల ప్రధానాచార్యులు ఆచార్య రాహత్ ఖానం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కళాశాలలో మౌలిక వనరుల కల్పన చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని రాష్ట్ర ప్రభుత్వం ప్రతి కళా




శాలలో మౌలిక వనరుల సదుపాయాలను పెంపొందించే కార్యక్రమాన్ని విద్యా వారోత్సవాల్లో భాగంగా నిర్వహించాలని తెలియజేయడం జరిగిందని, అందులో భాగంగానే ఈరోజు ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని అన్నారు. అదేవిధంగా 2026 27 విద్యా సంవత్సరానికి గాను కళాశాల అడ్మిషన్లకు సంబంధించిన కరపత్రమును కూడా ఆవిష్కరించారు. రామన్నపేట పరిసర ప్రాంతాల్లోని,ఇంటర్మీడియట్ పాసైన ప్రతి విద్యార్థి ఈ కళాశాలలో అడ్మిషన్ తీసుకొని తమ బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమం ఇంచార్జ్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ పి. వెంకటేశ్వర రావు, సభ్యులు డాక్టర్ పి. బ్రహ్మం, డాక్టర్ జె. నరేశ్, అకడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ జె. చిన్నబాబు, ఐ క్యూఏసి కోఆర్డినేటర్ డాక్టర్ లక్ష్మీ నీలిమ, పరిపాలనాధికారి జి. కరుణాకర్, అధ్యాపకులు డాక్టర్ రత్న మంజుల, డాక్టర్ జి.సునీత, డాక్టర్ తండు కృష్ణ కౌండిన్య, డాక్టర్ సిహెచ్. వెంకట్ గౌడ్, ఎం. అనిత,డాక్టర్ డి. కిషన్, డాక్టర్ ఎం. రవీందర్ రావు, డాక్టర్ రాచమళ్ళ శ్రీను, టి.శ్రీనివాస్, ఏ. ఆంజనేయులు, రాధికతో పాటు కార్యాలయ సిబ్బంది కరుణాకర్ రెడ్డి, ఫయాజ్, షరీఫ్, శ్రీదేవి, రాంబాబు, కిరణ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల 20వ తేదీన తెలంగాణ ప్రజానాట్యమండలి జిల్లా మహాసభలను జయప్రదం చేయండి



- **తెలంగాణ ప్రజానాట్యమండలి జిల్లా ప్రధానకార్యదర్శి చెక్క వెంకటేష్.**

**రామన్నపేట వెలుతురు న్యూస్ మే 11:** తెలంగాణ ప్రజానాట్యమండలి యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరులో ఈనెల 20వ తేదీన జరిగే జిల్లా మూడవ మహాసభలను జయప్రదం చేయడానికి రామన్నపేట మండల పరిధిలో సిరిపురం గ్రామంలో తెలంగాణ ప్రజానాట్యమండలి జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్క వెంకటేష్ ఆధ్వర్యంలో నూతన కమిటీ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ఉన్న బాగోతం, సింధు, యక్షగానం, పల్లె సుద్దులు, బుర్రకథలు,డప్పు,డోలు, ఒగ్గు డోలు, కోలాటభజన, గంగిరెద్దులు, పంబాల, సర్కార్ జానపద బుడు బుడకల, బుడిగెజంగాల కళాకారులు, కాకిపడెగల కళా బృందాలను ఒకే వేదిక మీదకు తెచ్చే చిరు ప్రయత్నం చేస్తున్నామని, తెలంగాణ రాష్ట్ర సాధన కొరకు గోసి, గొంగడి కాలి గజ్జెలతో తెలంగాణ ప్రజానాట్యమండలి కళాకారులు ధూమ్ ధామ్ ఆటపాటతో పాటు వివిధ కళారూపాలతో ప్రజలను చైతన్యపరిచేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. భజన భాగవత కళాకారుల రామన్నపేట నూతన కమిటీ అధ్యక్షుడిగా కంకల మల్లయ్య ఉపాధ్యక్షులుగా కళ్లెం యాదగిరిలను నియమించడం జరిగింది. సిరిపురం గ్రామకమిటీ నూతన అధ్యక్షులుగా బల్గూరి రవి, ఉపాధ్యక్షులు బల్గూరి రమేష్, మామిడి రామచంద్రం, ప్రధాన కార్యదర్శి కొంగరి జంగయ్య, సహాయ కార్యదర్శి మోటి మల్లేశం, కోశాధిపతి చేపూరి సత్యనారాయణ,గౌరవాధ్యక్షులు వడ్డేపల్లి వితలయ్య,కమిటీ సభ్యులు కంకల మల్లయ్య, రామోజు నరసింహ చారి, గోదాల సుధాకర్ రెడ్డి, తుంగ మార్కయ్య, గాదె రామచంద్రం లను నియమించడం జరిగింది.

## రైతుల కల్లాల వద్ద ధాన్యం కొనుగోలుకు అనుమతించాలి



- **పోచం సోమయ్య -- బీజేపీ మాజీ పట్టణ అధ్యక్షులు.**

మోత్కూర్, మే 11,(వెలుతురు న్యూస్ ):

ధాన్యం కొనుగోలు ఆలస్యాన్ని నివారించడానికి రైతుల కల్లాల వద్దనే కొనుగోలుకు అనుమతించాలని బిజెపి పట్టణ మాజీ అధ్యక్షులు పోచం సోమయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం విలేకరులతో మాట్లాడుతూ గత నెల రోజులుగా వ్యవసాయ మార్కెట్లో ధాన్యం కొనుగోలు ఆలస్యం కావడంవల్ల మార్కెట్లో పూర్తిగా ధాన్యం కుప్పలతో నిండిపోయిందని తెలిపారు.అందువల్ల ధాన్యము ఆరబోయడానికి అవకాశం లేనందున మ్యాచర్ సరిగా రాకపోవడం,తాలు తీసివేయడానికి ఇబ్బందులు ఏర్పడటం,హమాలీల కొరత, వాహనాల కొరత వల్ల ధాన్యం కొనుగోలు ఇంకా రెండు నెలలైనా పూర్తి అయ్యే పరిస్థితి లేదన్నారు. అకాల వర్షం వస్తే మార్కెట్లో ధాన్యం కుప్పలను పక్కకు జరిపే స్థలము లేనందున తీవ్ర నష్టం ఏర్పడే అవకాశం ఉందని దీనిని నివారించడానికి రైతుల వద్దనే ధాన్యం కొనుగోలుకు అనుమతి ఇస్తే నాణ్యత ప్రమాణాలు పాటించిన రైతుల వద్ద అధికారులు ధ్రువీకరించిన ధాన్యానికి బన్నీ బ్యాగులు ఇస్తే రైతులే కాంటాలు వేసి సొంత వాహనాల్లో ట్రాన్స్పోర్ట్ రైస్ మిల్లర్ల దగ్గరికి తీసుకుపోయే అవకాశం ఉంది .ఈ విధానం వల్ల ధాన్యము తొందరగా రైస్ మిల్లర్ల వద్దకు చేరే అవకాశం ఉన్నందున సంబంధిత ప్రజా ప్రతినిధులు స్థానిక ఏఎంసి. పిఎసిఎస్ చైర్మన్ మరియు స్థానిక ఎమ్మెల్యే చొరవ తీసుకొని ఉన్నత అధికారులతో మాట్లాడి కొనుగోలుకు అనుమతి ఇప్పించాలని కోరారు.F

## తాళం వేసిన ఇంట్లో చోరీ..... నగదు అపహరణ

**మోత్కూర్, మే 11 (వెలుతురు న్యూస్):**
మోత్కూర్ మున్సిపాలిటీ పరిధిలోని బుజిలాపురం గ్రామంలో దొంగలు రెచ్చిపోయారు. తాళం వేసి ఉన్న ఇంటి లోనికి చొరబడి సుమారు రూ.1.60 లక్షల నగదును అపహరించిన ఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు, బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం, శనివారం దొంతి మచ్చగిరి తన బంధువుల ఇంట్లో బొడ్రాయి పండుగ కార్యక్రమం ఉండటంతో కుటుంబ సభ్యులతో కలిసి వలిగొండ మండలం మల్లేపల్లి గ్రామానికి వెళ్లాడు. ఇంటికి తాళం వేసి వెళ్లిన ఆయన సోమవారం సాయంత్రం తిరిగి స్వగ్రామమైన బుజిలాపురానికి చేరుకున్నాడు. అయితే ఇంటి వద్దకు వచ్చి చూడగా తలుపుకు వేసిన తాళం తీసి ఉండటాన్ని గమనించి అనుమానం వ్యక్తం చేశాడు. వెంటనే ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా తలుపులు తెరిచి ఉండటంతో దొంగతనం జరిగినట్లు గుర్తించాడు. ఇంట్లోని వస్తువులు, నగదు పరిశీలించగా దాచి ఉంచిన లక్ష అరవై వేల రూపాయల నగదు చోరీకి గురైనట్లు తెలిసి, వెంటనే పోలీసులకు సమాచారం అందించాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ఆధారాలు సేకరించి విచారణ చేపట్టారు. బాధితుడు మచ్చగిరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ఇన్స్పెక్టర్ సి. వెంకటేశ్వర్లు విలేకరులకు తెలిపారు.

## నీటి సంరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి: కలెక్టర్ చంద్రశేఖర్



- **"జల్ సంచయ్ జన బాగిదారి" ప్రచార రథానికి జెండా ఊపిన కలెక్టర్**

నల్లగొండ వెలుతురు మే 11:
నల్గొండ జిల్లాలో నీటి సంరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. నీటిని పొదుపుగా వాడుకోవడంతో పాటు ప్రతి వర్షపు నీటి చుక్కను సంరక్షించుకోవాలని సూచించారు. "జల్ సంచయ్ జన బాగిదారి" కార్యక్రమంలో భాగంగా నీటి సంరక్షణ చర్యలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రచార రథాన్ని సోమవారం నల్గొండ జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నగర మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డితో కలిసి కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రస్తుత వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని జల సంరక్షణపై ప్రజలు ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాలోని అన్ని గ్రామాల్లో ఈ ప్రచార వాహనం పర్యటిస్తూ తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారుల ద్వారా నీటి సంరక్షణ, నీటి పొదుపు, అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థంగా వినియోగించుకునే విధానాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తారని తెలిపారు. నీటి సంరక్షణలో భాగంగా కమ్యూనిటీ సోక్ పిట్లు, వ్యక్తిగత సోక్ పిట్లు, ఫామ్ పాండ్స్, నీటి సంరక్షణ కట్టడాల నిర్మాణంపై కార్యాచరణ ప్రణాళిక రూపొందించి ముందుకు సాగుతున్నట్లు చెప్పారు. జిల్లాలోని ప్రజలందరూ నీటి వనరులను కాపాడుతూ నీటిని పొదుపుగా వినియోగించాలని కోరారు. నగర మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. వర్షపు నీటిని సంరక్షించుకోవడం అత్యంత ముఖ్యమన్నారు. ప్రతి ఇంట్లో ఇంకుడు గుంత నిర్మించుకోవాలని సూచించారు. భావి తరాలకు నీటి కొరత లేకుండా ఉండాలంటే ఇప్పటి నుంచే నీటి సంరక్షణ చర్యలు చేపట్టాలని తెలిపారు. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఇల్లు నిర్మించుకునే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఇంకుడు గుంత ఏర్పాటు చేసుకునేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్పొరేటర్లు ప్రతి ఇంటికి వెళ్లి ప్రజల్లో అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జే. శ్రీనివాస్, గృహ నిర్మాణ శాఖ పీడీ రాజ్‌కుమార్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శేఖర్ రెడ్డి, డీపీఆర్వో వెంకటేశ్వర్లు, స్థానిక కార్పొరేటర్ వున్న జ్ఞానేశ్వరి, కలెక్టర్ కార్యాలయ ఏఓ మోతీలాల్, డీఆర్డీఏ సిబ్బంది, తెలంగాణ సాంస్కృతిక సారథి కళాబృందం తదితరులు పాల్గొన్నారు.




## వెలగల గూడెంలో ఘనంగా మేడే సంబరాలు



మునుగోడు వెలుతురు మే 11:
మునుగోడు మండలం ఎలగలగూడెం గ్రామ శాఖ ఆధ్వర్యంలో మేడే 141వ ఘనంగా ఎర్ర జెండా ఎగరవేసిన సిపిఐ జిల్లా సమితి సభ్యులు సురిగి చలపతి కార్యక్రమంలో మాట్లాడుతున్న సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తీరుపారి వెంకటేశ్వర్లు మండల మండల కార్యవర్గ సభ్యులు ఈదులకంటి కైలాస్ గ్రామ శాఖ కార్యదర్శి తీరుపారి కృష్ణయ్య బక్క నరసింహ బక్క యాదయ్య తిరుపారి రామచంద్ర కట్కూరి నరసింహ మాధగోని శ్రీశైలం గోప గోని సైదులు కట్కూరి సైదులు ఈదులకంటి మల్లయ్య స్వామి శేఖర్ నాగరాజు వార్డ్ నెంబర్ మాధగోని లింగస్వామి కట్కూరి లింగస్వామి కారింగు వెంకన్న ఉదయ్ కృష్ణ కిరణ్ అనిల్ తదితరులు పాల్గొన్నారు

## పేద కుటుంబాల ఆడబిడ్డల పెళ్లిళ్లకు అండగా సర్పంచ్ విమల శ్రీనివాస్‌రెడ్డి

- **వివాహ కానుకగా రూ.10 వేల చెక్కు అందజేత....**



జహీరాబాద్ వెలుతురు మే 11 :

సామాజిక సేవే లక్ష్యంగా పేద కుటుంబాలకు అండగా నిలుస్తూ సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గం హుగ్గేల్లీ గ్రామ సర్పంచ్ పట్లోళ్ళ విమల శ్రీనివాస్‌రెడ్డి మరోసారి తన ఉదారతను చాటుకున్నారు. హుగ్గేల్లీ గ్రామానికి చెందిన మాలేకాడి నర్సమ్మ నర్సిములు దంపతుల కుమార్తె అశ్విని (సుస్మిత) వివాహ ప్రధాన కార్యక్రమానికి హాజరైన సర్పంచ్ దంపతులు వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా వధువు కుటుంబానికి వివాహ కానుకగా రూ.10,000 నగదు చెక్కును అందజేశారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ సమాజంలో మార్పు రావాలంటే సామాజిక సేవ ఎంతో అవసరమని, ముఖ్యంగా పేద కుటుంబాల ఆడబిడ్డల పెళ్లిళ్లకు సహాయం చేయడం తమ బాధ్యతగా భావిస్తున్నామని తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్ రెడ్డి, వార్డు సభ్యులు బాల్‌రాజ్, నరేష్, నాయకులు పాండురంగా రెడ్డి, రాజశేఖర్, సంజీవ్, రాములు, నర్సిములు, మొగులప్ప, మహేష్ తదితరులు పాల్గొన్నారు. సర్పంచ్ చేసిన ఆర్థిక సహాయంపై గ్రామ ప్రజలు, వధువు కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

## బెల్ట్ షాపులపై ప్రజావాణిలో మహిళా పిర్యాదు

వెలుతురు నారాయణఖేడ్ మే 11 :



సంగారెడ్డి జిల్లా : నారాయణఖేడ్ నియోజకవర్గంలో బెల్టు దుకాణం వల్ల తన భర్త మద్యానికి బానిసగా మారి తనని,పిల్లలను రోజు కొడుతూ ఇంటి నుండి వెళ్లగొట్టాడని,అక్రమ బెల్టు దుకాణాల నిర్వాహకులు,సంబంధిత ఎక్సైజ్ అధికారులపై కూడ చర్యలు తీసుకోవాలంటూ నారాయణఖేడ్ లోని ప్రజావాణిలో రూప అనే మహిళా సబ్ కలెక్టర్ ఉమా హారతికి పిర్యాదు చేశారు.నారాయణఖేడ్ మండలంలోని సంజీవన్ రావుపేట గ్రామానికి చెందిన ఎంబరి రూప అనే గృహిణి సోమవారం ఖేడ్ సబ్ కలెక్టర్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో సబ్ కలెక్టర్ ఉమహారతికి పిర్యాదు చేసిన అనంతరం మాట్లాడుతూ..గ్రామంలో 4 బెల్టు దుకాణాలు ఉన్నాయని అందులో 24 గంటలు మద్యం అమ్ముతుంటారని,దుకాణాలు,హోటళ్ళలో మద్యం విక్రయించక ముందు తన భర్త ఎంబరి పందరి కేవలం కల్లు మాత్రమే సేవించే వారని,బెల్ట్ దుకాణాలలో మద్యం అమ్మడం ప్రారంభించాక అర్ధరాత్రి సైతం మద్యం లభించడం వల్ల ఎప్పుడుపడితే అప్పుడు మద్యం సేవిస్తూ మద్యానికి బానిసగా మారాడని ఆవేదన వ్యక్తం చేసింది.24 గంటలు మద్యం సేవిస్తూ అర్థ రాత్రి ళ్ళు మద్యం తీసుకొని రమ్మని పిల్లలను మద్యం కోసం పంపిస్తున్నాడు అన్నారు.మద్యం సేవించి ప్రతీ రోజు తనను,పిల్లలను కొడుతా ఇంటినుండి వెళ్లగొట్టాడు అన్నారు.బెల్ట్ దుకాణాలపై చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ అధికారులకు ఎన్నిసార్లు పిర్యాదు చేసిన పట్టించుకోలేరు అన్నారు.బెల్ట్ దుకాణాల వల్ల తన లాంటి మహిళల బ్రతుకులు చిన్నభిన్నాం అవుతున్నాయి కాబట్టి వెంటనే బెల్ట్ దుకాణాలు తొలగించి సంబంధిత శాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలని సబ్ కలెక్టర్ కు కోరడం జరిగింది అన్నారు.

## కరీంనగర్ ప్రముఖ పాత్రికేయులు అనిల్ కుమార్ కు ఉత్తమ జాతీయ జర్నలిస్ట్ అవార్డు



కరీంనగర్ వెలుతురు మే 11:

పత్రికారంగంలో విశిష్ట సేవలు అందించిన కరీంనగర్ తెలుగు వార్త బ్యూరో అనిల్ కుమార్‌కు "ఉత్తమ జాతీయ జర్నలిస్టు అవార్డు" లభించింది. దేశవ్యాప్తంగా సామాజిక సమస్యలు, ప్రజా అంశాలు, అభివృద్ధి కార్యక్రమాలపై ఆయన చేసిన విశ్లేషణాత్మక కథనాలను గుర్తిస్తూ ఈ అవార్డును ప్రదానం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. పలువురు ప్రజాప్రతినిధులు, జర్నలిస్టు సంఘాల నాయకులు, సామాజిక కార్యకర్తలు అనిల్ కుమార్‌ను అభినందించారు. నిజాయితీతో కూడిన వార్తా రచన, ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో ఆయన కృషి ప్రశంసనీయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అనిల్ కుమార్ మాట్లాడుతూ, ఈ అవార్డు తన బాధ్యతను మరింత పెంచిందన్నారు. ప్రజలకు నిష్పక్షపాత సమాచారాన్ని అందించడం జర్నలిస్టుల ప్రధాన ధ్యేయమని తెలిపారు. తనకు సహకరించిన సహచరులు, కుటుంబ సభ్యులు, పాఠకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## జై బోలో హనుమాన్ కి ...జై...

- **హిందూ ఏక్తా యాత్ర కోసం కదలిరండి.. విజయవంతం చేయండి..**
- **బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి బొంతల కళ్యాణ్ చంద్ర**



కరీంనగర్ వెలుతురు మే 11:

హనుమాన్ జయంతి మే 12 సందర్భంగా కేంద్ర మంత్రివర్యులు బండి సంజయ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న హిందూ ఏక్తా యాత్ర కోసం హిందూ బంధువులందరూ కదిలి రావాలని, యాత్రను విజయవంతం చేయాలని బిజెపి జిల్లా అధికార ప్రతినిధి బొంతల కళ్యాణ్ చంద్ర కోరారు. సోమవారం రోజున కరీంనగర్లో ఆయన మాట్లాడుతూ కరీంనగర్లో ప్రతి ఏటా హనుమాన్ జయంతి సందర్భంగా కేంద్ర మంత్రివర్యులు బండి సంజయ్ కుమార్ ఆధ్వర్యంలో హిందూ ఏక్తా యాత్ర నిర్వహించడం ఒక ఆనవాయితీగా వస్తుందన్నారు. హిందువుల సంఘటిత శక్తిని చాటేందుకు , లక్షలాదిమందితో జరిగే ఈ యాత్రకు తెలంగాణ వ్యాప్తంగా ఎంతో గుర్తింపు వచ్చిందని తెలిపారు. కరీంనగర్లో జరిగే భారీ ఆధ్యాత్మిక కార్యక్రమంగా హిందూ ఎక్తాయాత్రకు ఖ్యాతి గుర్తింపు లభించిందన్నారు. గత 12 ఏళ్లుగా ఈ ఆధ్యాత్మిక కార్యక్రమం కరీంనగర్ నగరాన్ని కాషాయమంగా మార్చుతూ , ప్రతి ఏటా ఎంతో ఘనంగా , వైభవంగా కేంద్ర మంత్రివర్యులు బండి సంజయ్ కుమార్ నిర్వహిస్తున్నారని తెలిపారు. వైశ్య భవన్ నుండి ప్రారంభమై కరీంనగర్లోని ప్రధాన కూడళ్ల మీదుగా కొనసాగే ఈ యాత్ర అశేష హిందూ బంధువుల, వివిధ హిందూ సంఘాల భాగస్వామ్యంతో విజయవంతంగా కొనసాగుతుందన్నారు.

## మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిలర్ల వివరాల బోర్డు ఏర్పాటు చేయాలి

- **ప్రజలకు అందుబాటులో ఉండేలా వార్డు వారీగా సమాచారం ప్రదర్శించాలి....**
- **కౌన్సిలర్ అప్పం శ్రావణ్ కుమార్....**






జహీరాబాద్ వెలుతురు, మే 11:

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మున్సిపల్ కార్యాలయానికి వచ్చే ప్రజలకు ఆయా వార్డుల కౌన్సిలర్ల వివరాలు సులభంగా తెలిసే విధంగా ప్రత్యేక సమాచార బోర్డును ఏర్పాటు చేయాలని 36వ వార్డు కౌన్సిలర్ అప్పం శ్రావణ్ కుమార్ మున్సిపల్ కమిషనర్‌ను కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ కార్యాలయానికి నిత్యం వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలకు తమ వార్డు కౌన్సిలర్ ఎవరు, ఎలా సంప్రదించాలి అనే విషయాలు తెలియక ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. ఈ సమస్యను దృష్టిలో ఉంచుకుని మున్సిపల్ కార్యాలయ ఆవరణలో అన్ని వార్డుల కౌన్సిలర్ల పేర్లు, వార్డు సంఖ్యలు, సంప్రదింపు ఫోన్ నంబర్లతో కూడిన శాశ్వత సమాచార బోర్డును ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇలాంటి బోర్డు ఏర్పాటు చేస్తే ప్రజలు తమ సమస్యలను నేరుగా సంబంధిత కౌన్సిలర్ దృష్టికి తీసుకెళ్లే అవకాశం ఉంటుందని, తద్వారా సమస్యల పరిష్కారం వేగవంతం అవుతుందని పేర్కొన్నారు. ప్రజలకు అవసరమైన సమాచారం ఒకేచోట అందుబాటులో ఉండడం వల్ల మున్సిపల్ పాలనలో పారదర్శకత పెరగడంతో పాటు ప్రజా ప్రతినిధులు, ప్రజల మధ్య సమన్వయం మరింత బలోపేతం అవుతుందని అభిప్రాయపడ్డారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించాలనే ఉద్దేశంతోనే ఈ ప్రతిపాదన చేసినట్లు అప్పం శ్రావణ్ కుమార్ తెలిపారు. మున్సిపల్ అధికారులు ఈ అంశాన్ని సానుకూలంగా పరిశీలించి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

## దేశంలో సామరస్యం, మత సహనం మరింత బలోపేతం కావాలి

- **జమియత్ ఉలమా "గ్రాండ్ పబ్లిక్ గ్యాదరింగ్"లో మాజీ చైర్మన్ మొహమ్మద్ తన్వీర్ పిలుపు...**



**జహీరాబాద్ వెలుతురు మే 11** : సమాజంలో శాంతి, సోదరభావం, పరస్పర గౌరవం పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలంగాణ రాష్ట్ర ఇండస్ట్రియల్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మొహమ్మద్ తన్వీర్ పేర్కొన్నారు. జమియత్ ఉలమా జిల్లా సంగారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన "గ్రాండ్ పబ్లిక్ గ్యాదరింగ్" కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ సమగ్ర అభివృద్ధికి సామరస్యం, మత సహనం ఎంతో అవసరమని అన్నారు. వివిధ మతాలు, భాషలు, సంస్కృతులతో కూడిన భారతదేశం ఐక్యతకు ప్రతీకగా నిలుస్తోందని, ఈ ఐక్యతను కాపాడుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు. సమాజంలో ద్వేషాలు, విద్వేషాలకు తావులేకుండా ప్రేమ, మానవతా విలువలతో ముందుకు సాగాలని సూచించారు. ప్రతి మతం శాంతి, ప్రేమ, సేవా భావాన్ని బోధిస్తుందని పేర్కొన్న ఆయన, మతపెద్దలు, ప్రజాప్రతినిధులు, సామాజిక సేవకులు సమాజంలో అవగాహన పెంపొందించేందుకు కీలక పాత్ర పోషించాలని అన్నారు. ముఖ్యంగా యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి విద్య, సేవా కార్యక్రమాలు, సామాజిక అభివృద్ధిపై దృష్టి పెట్టాలని పిలుపునిచ్చారు. దేశ అభివృద్ధికి అందరూ కలిసికట్టుగా ముందుకు సాగాలని, పరస్పర సహకారం, గౌరవంతో జీవిస్తేనే శాంతియుత సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని మొహమ్మద్ తన్వీర్ పేర్కొన్నారు. జమియత్ ఉలమా వంటి సంస్థలు ప్రజల్లో ఐక్యతా భావాన్ని పెంపొందిస్తూ మంచి సందేశాన్ని అందిస్తున్నాయని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో వివిధ మతాల పెద్దలు, ప్రజాప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు, యువత, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. కార్యక్రమం ఆధ్యాత్మిక, సామాజిక సందేశాలతో సాగి ఆకట్టుకుంది.

## తెలంగాణ గంగా జమునీ సంస్కృతిని పరిరక్షించాలి





- **మత సామరస్యాన్ని దెబ్బతీసే కుట్రలను ప్రజలు తిప్పికొట్టాలి..**
- **హాఫిజ్ పీర్ ఖాలిక్ అహ్మద్ సాబిర్...**

జహీరాబాద్ వెలుతురు, మే 11:

తెలంగాణ రాష్ట్రం గంగా జమునీ సంస్కృతి, సోదరభావం, మత సామరస్యానికి దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు పొందిందని, ఈ విలువలను కాపాడుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని జమియత్ ఉలమా తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హాఫిజ్ పీర్ ఖాలిక్ అహ్మద్ సాబిర్ పేర్కొన్నారు. సమాజంలో శాంతి, సామరస్యాలను దెబ్బతీసే కుట్రలు ఎప్పటికీ విజయవంతం కావని, ప్రజలు అప్రమత్తంగా ఉండి వాటిని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలోని మిలన్ ఫంక్షన్ ప్యాలెస్‌లో జమియత్ ఉలమా హింద్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన సంగారెడ్డి జిల్లా సద్భావన సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన ప్రసంగించారు. తెలంగాణలో వివిధ మతాలు, భాషలు, వర్గాలకు చెందిన ప్రజలు దశాబ్దాలుగా పరస్పర గౌరవం, ప్రేమాభిమానాలతో కలిసి జీవిస్తున్నారని, ఇదే రాష్ట్ర అసలైన బలమని ఆయన అన్నారు. తెలంగాణ చరిత్ర సాక్షిగా ప్రజలు మత, సామాజిక భేదాలకు అతీతంగా సఖ్యతతో జీవించారని, ఈ సంస్కృతి రాష్ట్రానికి గర్వకారణమని పేర్కొన్నారు. అయితే ఇటీవలి కాలంలో కొన్ని రాజకీయ శక్తులు స్వార్థ ప్రయోజనాల కోసం ప్రజల మధ్య చిచ్చు పెట్టేందుకు ప్రయత్నిస్తున్నాయని విమర్శించారు. అధికార దాహంతో కొందరు ప్రజల మధ్య విభేదాలు సృష్టించి సామాజిక ఐక్యతను దెబ్బతీయాలని చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.. ప్రస్తుతం సోషల్ మీడియా వేదికలను ఉపయోగించి మత విద్వేషాలు రెచ్చగొట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని, తప్పుడు ప్రచారాలతో సమాజంలో అనుమానాలు, ద్వేషం పెంచే కుట్రలు ఆందోళన కలిగిస్తున్నాయని అన్నారు. ఇలాంటి ప్రచారాలను ప్రజలు నమ్మకుండా వాస్తవాలను తెలుసుకొని అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. "ఈ దేశం బాణాలతో గానీ, కత్తులతో గానీ నడవదు. ప్రేమ, ఆప్యాయత, పరస్పర గౌరవంతోనే ముందుకు సాగుతుంది. దేశ ప్రగతికి శాంతి, సౌభ్రాతృత్వమే పునాది" అని హాఫిజ్ పీర్ ఖాలిక్ అహ్మద్ సాబిర్ స్పష్టం చేశారు. మత సామరస్యానికి విఘాతం కలిగించే శక్తులను ప్రజలు ఐక్యంగా తిరస్కరించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా రాచయ్య స్వామి మాట్లాడుతూ భారతదేశం వైవిధ్యభరిత సంస్కృతుల సమ్మేళనమని, భిన్నత్వంలో ఏకత్వమే దేశ బలమని అన్నారు. మున్సిపల్ చైర్మన్ మహ్మద్ యూనుస్ మాట్లాడుతూ జహీరాబాద్ ప్రాంతం ఎప్పటినుంచో మత సామరస్యానికి నిలయంగా ఉందని, ఆ సంప్రదాయాన్ని అందరూ కొనసాగించాలని కోరారు. మాజీ టీఐడీసీ చైర్మన్ మహ్మద్ తన్వీర్ మాట్లాడుతూ ప్రేమ, సౌభ్రాతృత్వం ద్వారానే దేశం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. షేక్ ఫరీద్, సయ్యద్ జలాలుద్దీన్, అబ్దుల్ జబ్బార్, దళిత నాయకుడు జనార్ధన్ తదితరులు మాట్లాడుతూ ద్వేషం, హింస, బలప్రయోగాలు సమాజాన్ని విచ్ఛిన్నం చేస్తాయని, ప్రజలు సామరస్యాన్ని కాపాడేందుకు బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. కార్యక్రమానికి ముఫ్తీ ఖలీల్ అహ్మద్ వ్యవహార నిర్వహణ చేపట్టగా, మహ్మద్ అబ్దుల్ ఖదీర్ (ఎంఎం మెడికల్) కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో మౌలానా అబ్దుల్ మజీబ్ ఖాస్మీ (జమియత్ ఉలమా జహీరాబాద్ అధ్యక్షుడు), ముఫ్తీ అబ్దుల్ సబూర్ ఖాస్మీ (జిల్లా ప్రధాన కార్యదర్శి), హాఫిజ్ మహ్మద్ అక్బర్‌తో పాటు వివిధ సామాజిక, మత సంస్థల ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## రైతుల దారిని ఆక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి





- **ప్రజావాణిలో ఝరాసంగం తహసీల్దార్‌కు రైతుల ఫిర్యాదు...**

**జహీరాబాద్ వెలుతురు, మే 11 :**

గత 50 నుండి 60 సంవత్సరాలుగా రైతులు వ్యవసాయ అవసరాల కోసం వినియోగిస్తున్న దారిని ప్రైవేట్ వ్యక్తులు ఫెన్సింగ్ వేసి మూసివేయడంపై రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దారిని ఆక్రమించి మూసివేసిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకుని, పాత దారిని పునరుద్ధరించాలని కోరుతూ సోమవారం ఝరాసంగం మండల తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. వివరాల ప్రకారం సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండలంలోని అనంతసాగర్ గ్రామానికి చెందిన 121, 122, 123, 124, 125, 126సర్వే నెంబర్ల రైతులు తమ పొలాలకు వెళ్లేందుకు దశాబ్దాలుగా ఉపయోగిస్తున్న దారిని 119, 120 సర్వే నెంబర్లకు చెందిన నీలా గోపాల్, తండ్రి నీలా విశ్వనాథ్ ఫెన్సింగ్ వేసి అక్రమంగా మూసివేశారని రైతులు ఆరోపించారు. ఈ విషయాన్ని ప్రజావాణిలో తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లిన రైతులు, వెంటనే ఫెన్సింగ్ తొలగించి గతంలో ఉన్న విధంగా దారిని అందుబాటులోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ, "గత 5060 సంవత్సరాలుగా ట్రాక్టర్లు, ఎడ్లబండ్లు, వ్యవసాయ యంత్రాలు ఇదే దారి ద్వారా తమ పొలాలకు తీసుకెళ్తూ వ్యవసాయ పనులు నిర్వహిస్తున్నాం. ఇప్పుడు అకస్మాత్తుగా దారిని మూసివేసి ఇబ్బందులకు గురిచేయడం అన్యాయం" అని వాపోయారు. అలాగే దారిని మూసివేసిన వ్యక్తులు పోలీసు యంత్రాంగాన్ని ఉపయోగించి రైతులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. సమస్యపై అధికారులు వెంటనే స్పందించి రైతులకు న్యాయం చేయాలని కోరారు.

### స్వాములకు మజ్జిగ, పండ్ల వితరణ చేసిన బిజెపి నేత రావుల కిరణ్ రెడ్డి

కరీంనగర్ వెలుతురు మే 11:



భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు రావుల కిరణ్ రెడ్డి ఆధ్వర్యంలో కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయం వరకు పాదయాత్ర చేస్తున్న ఆంజనేయ స్వాములకు సోమవారం రోజున కరీంనగర్లో మజ్జిగ, పండ్ల వితరణ చేశారు.ఈ కార్యక్రమంలో పాలోజు లక్ష్మీకాంతం, రావుల సంపత్ తదితరులు పాల్గొన్నారు.



# భార్యను పశువులా చూడొద్దు

- గృహహింస కేసులో సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు
- మహిళలకు గౌరవంతో జీవించే హక్కు ఉందన్న ధర్మాసనం
- ముందస్తు బెయిల్ కోరిన నిందితుడికి ఊరట నిరాకరణ

పాట్నా వెలుతురు మే 11:



గృహహింస కేసు విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. భార్యను భర్త పశువులా చూడకూడదని, ప్రతి మహిళకు గౌరవంతో జీవించే హక్కు రాజ్యాంగం కల్పించిందని స్పష్టం చేసింది. కుటుంబ బంధం పేరుతో మహిళలపై దౌర్జన్యాన్ని సమర్థించలేమని వ్యాఖ్యానించింది. భార్యపై దాడి చేసిన ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తి దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌ను విచారించిన ధర్మాసనం.. అతడికి ఎలాంటి ఊరట ఇవ్వడానికి నిరాకరించింది. ఈ కేసులో ఇప్పటికే పాట్నా హైకోర్టు ముందస్తు బెయిల్ పిటిషన్‌ను తిరస్కరించగా.. అనంతరం నిందితుడు సుప్రీంకోర్టును ఆశ్రయించాడు. అయితే కేసులో నమోదైన ఆరోపణలు తీవ్రంగా ఉన్నాయని అభిప్రాయపడిన అత్యున్నత న్యాయస్థానం.. ముందస్తు బెయిల్ మంజూరు చేయలేమని స్పష్టం చేసింది. గృహహింసను చిన్న విషయంగా చూడరాదని, భార్యపై శారీరక దాడులు తీవ్రమైన నేరాల కిందకే వస్తాయని ధర్మాసనం వ్యాఖ్యానించింది. విచారణ సందర్భంగా బాధితురాలి తరపు న్యాయవాది కోర్టుకు కీలక వివరాలు వెల్లడించారు. నిందితుడు తరచూ మద్యం సేవించి ఇంటికి వచ్చేవాడని, అనంతరం భార్యతో గొడవపడుతూ శారీరక దాడులకు పాల్పడేవాడని తెలిపారు. ఒక సందర్భంలో తీవ్ర కోపంతో ఆమెను నేలపైకి తోసేయడంతో ఇటుక తగిలి తలకు గాయమైందని కోర్టుకు వివరించారు. ఆ తర్వాత కూడా ఆగకుండా కర్రతో కొట్టినట్లు ఆరోపణలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ ఘటనల కారణంగా బాధితురాలు తీవ్ర మానసిక వేదనతో పాటు శారీరకంగా కూడా ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. భార్యను నిరంతరం భయాందోళనలకు గురిచేస్తూ వేధింపులకు పాల్పడిన వ్యక్తికి ముందస్తు బెయిల్ ఇవ్వడం సరైన సందేశం కాదని బాధితురాలి తరపు న్యాయవాది వాదించారు. మరోవైపు నిందితుడి వ్యక్తిగత జీవితానికి సంబంధించిన అంశాలు కూడా విచారణలో ప్రస్తావనకు వచ్చాయి. అతడు మూడు వివాహాలు చేసుకున్నట్లు కోర్టుకు సమాచారం అందింది. ప్రస్తుతం కోర్టును ఆశ్రయించిన మహిళ అతడి మొదటి భార్యగా గుర్తించారు. కుటుంబ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించకుండా, భార్యను వేధించడం దురదృష్టకరమని ధర్మాసనం వ్యాఖ్యానించింది. వాదనలు విన్న అనంతరం న్యాయమూర్తులు నిందితుడిని నేరుగా ప్రశ్నించినట్లు సమాచారం. "మీరు మీ భార్యను ఎందుకు కొట్టాలనుకున్నారు..?" అంటూ ప్రశ్నించిన ధర్మాసనం.. భార్యపై హింస ఎట్టి పరిస్థితుల్లోనూ సమర్థనీయం కాదని స్పష్టం చేసింది. "ఇలాగే వేధిస్తే ఆమె మిమ్మల్ని వదిలి వెళ్లిపోతుంది" అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేసింది. గృహహింస కుటుంబ వ్యవస్థను దెబ్బతీసే అంశమని, దాంపత్య బంధంలో పరస్పర గౌరవం అత్యంత ముఖ్యమని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. భార్యను ఒక వ్యక్తిగా, ఆమె హక్కులను గౌరవించాల్సిన బాధ్యత భర్తపై ఉంటుందని పేర్కొంది. వివాహం చేసుకున్నందుకు భార్యపై ఆధిపత్యం చెలాయించే హక్కు ఎవరికి లేదని స్పష్టం చేసింది. మహిళల భద్రత, గౌరవం విషయంలో రాజ్యాంగం స్పష్టమైన రక్షణ కల్పించిందని కోర్టు పేర్కొంది. కుటుంబ వ్యవహారం పేరుతో గృహహింసను నిర్లక్ష్యం చేయలేమని తెలిపింది. మహిళలు ఇంట్లోనే భయంతో జీవించాల్సిన పరిస్థితులు సమాజానికి మంచిది కాదని వ్యాఖ్యానించింది. ఈ సందర్భంగా న్యాయస్థానం ముందస్తు బెయిల్ మరియు రెగ్యులర్ బెయిల్ మధ్య తేడాను కూడా ప్రస్తావించింది. కేసు తీవ్రతను దృష్టిలో పెట్టుకుని ముందస్తు బెయిల్ ఇవ్వలేమని చెప్పిన ధర్మాసనం.. అవసరమైతే రెగ్యులర్ బెయిల్ కోసం సంబంధిత కోర్టును ఆశ్రయించాలని నిందితుడికి సూచించింది. దర్యాప్తుకు సహకరించాలని కూడా ఆదేశించింది. దేశవ్యాప్తంగా మహిళలపై పెరుగుతున్న గృహహింస ఘటనల నేపథ్యంలో సుప్రీంకోర్టు చేసిన ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. వివాహ బంధంలో మహిళల గౌరవం, భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని కోర్టు మరోసారి స్పష్టం చేసినట్లైంది. మహిళలపై శారీరక, మానసిక వేధింపుల విషయంలో న్యాయవ్యవస్థ రాజీపడదన్న సంకేతాలు ఇచ్చినట్లుగా న్యాయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఇటీవల కాలంలో గృహహింస కేసుల్లో కోర్టులు మరింత సున్నితంగా స్పందిస్తున్నాయి. మహిళలపై దాడులు, వేధింపులు, బెదిరింపులను తీవ్రంగా పరిగణిస్తూ కఠిన వ్యాఖ్యలు చేస్తున్నాయి. కుటుంబ వివాదం పేరుతో మహిళల ప్రాథమిక హక్కులను హరించలేమని న్యాయస్థానాలు స్పష్టం చేస్తున్నాయి. భార్యాభర్తల మధ్య తలెత్తే విభేదాలు సంభాషణ, పరస్పర అవగాహన ద్వారా పరిష్కరించుకోవాలని, హింసకు పాల్పడటం ఎట్టి పరిస్థితుల్లోనూ సమర్థనీయం కాదని న్యాయ నిపుణులు సూచిస్తున్నారు. కుటుంబ బంధాల్లో గౌరవం, సహనం, బాధ్యతాయుత వైఖరి అవసరమని పేర్కొంటున్నారు. సుప్రీంకోర్టు తాజా వ్యాఖ్యలు మహిళల హక్కుల పరిరక్షణలో మరో కీలక సందేశంగా భావిస్తున్నారు. భార్యను గౌరవించడం భర్త బాధ్యత మాత్రమే కాకుండా సామాజిక కర్తవ్యమని, గృహహింసను సమాజం మొత్తం వ్యతిరేకించాల్సిన అవసరం ఉందని ఈ తీర్పు ద్వారా మరోసారి స్పష్టమైంది.

# ఆత్కూరు పోలీసులకు సొంత గూడు

- రూ.1.40 కోట్లతో నిర్మించిన నూతన స్టేషన్ ప్రారంభం
- ఎనిమిదేళ్ల సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ నూతన భవనం ప్రారంభం
- హోంమంత్రి అనిత, మంత్రి కొల్లు రవీంద్ర చేతుల మీదుగా ప్రారంభోత్సవం

విజయవాడ వెలుతురు మే 11:




కృష్ణా జిల్లా ఉంగుటూరు మండలం ఆత్కూరు గ్రామ ప్రజల, పోలీసు సిబ్బంది ఎనిమిదేళ్ల నిరీక్షణకు ఎట్టకేలకు తెరపడింది. సుమారు రూ.1.40 కోట్ల భారీ వ్యయంతో సర్వాంగ సుందరంగా నిర్మించిన నూతన పోలీసు స్టేషన్ భవనాన్ని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత, మంత్రి కొల్లు రవీంద్ర, ప్రభుత్వ విప్ మరియు ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఘనంగా ప్రారంభించారు. శాంతిభద్రతల పరిరక్షణలో కీలక పాత్ర పోషించే పోలీసులకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఈ సందర్భంగా హోంమంత్రి పేర్కొన్నారు. పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ శివనాగేశ్వరరావు, ఐజీ అశోక్ కుమార్, ఎస్పీ విద్యాసాగర్ నాయుడు వంటి ఉన్నతాధికారుల సమక్షంలో జరిగిన ఈ వేడుకలో స్థానిక ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. గ్రామంలో తొలుత పలు అభివృద్ధి పనులను పర్యవేక్షించిన మంత్రులు, ఆ తర్వాత శిలాఫలకాన్ని ఆవిష్కరించి పోలీసు స్టేషన్ భవనాన్ని సిబ్బందికి అంకితం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో హోంమంత్రి అనిత మాట్లాడుతూ గత ప్రభుత్వంపై ఘాటు విమర్శలు చేశారు. ఎనిమిదేళ్ల క్రితమే అప్పటి ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు ఈ భవనానికి శంకుస్థాపన చేసినప్పటికీ, గత ప్రభుత్వం ఐదేళ్ల పాటు ఈ ప్రాజెక్టును గాలికొదిలేసిందని మండిపడ్డారు. పాత భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరి వర్షం వస్తే కురిసే పరిస్థితి ఉన్నా, సిబ్బంది ప్రాణాలకు ముప్పు పొంచి ఉన్నా గత పాలకులు కనికరించలేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పెండింగ్‌లో ఉన్న భవన నిర్మాణ పనులను పూర్తి చేసి, ఈ రోజు ప్రజల ముందుకు తీసుకురావడం తమ చిత్తశుద్ధికి నిదర్శనమని చెప్పారు. ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు గన్నవరం నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం నుంచి భారీగా నిధులు తీసుకువస్తున్నారని, ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని ఆయన నిలబెట్టుకుంటున్నారని హోంమంత్రి ప్రశంసించారు. ఆత్కూరు నూతన పోలీసు స్టేషన్ కేవలం ఒక భవనం మాత్రమే కాకుండా, అన్ని రకాల ఆధునిక హంగులతో కూడిన ఒక కార్పొరేట్ కార్యాలయంలా తీర్చిదిద్దబడింది. ఇందులో ప్రవేశించగానే ప్రజలకు స్వాగతం పలికేలా రిసెప్షన్ కౌంటర్, ఎస్సై మరియు సీఐల కోసం ప్రత్యేక ఛాంబర్లు ఏర్పాటు చేశారు. ముఖ్యంగా మహిళా పోలీసు సిబ్బంది సౌకర్యార్థం ప్రత్యేక గదులు, విధుల్లో అలసిపోయిన సిబ్బంది కోసం విశ్రాంతి గదులు, రికార్డు రూమ్ మరియు కంప్యూటర్ ఆపరేటర్ల కోసం ప్రత్యేక విభాగాలను కేటాయించారు. భద్రతా పరంగా స్టేషన్ లోపల మరియు బయట అత్యాధునిక సీసీ కెమెరాల పర్యవేక్షణ ఉంటుంది. ఫిర్యాదులు ఇవ్వడానికి వచ్చే బాధితులు మరియు సందర్శకుల కోసం సౌకర్యవంతమైన వెయిటింగ్ హాల్‌ను కూడా నిర్మించారు. ఈ సౌకర్యాల వల్ల ప్రజలకు పోలీసు సేవలు మరింత చేరువవుతాయని, పారదర్శకమైన పాలన అందించడానికి దోహదపడతాయని అధికారులు ఈ సందర్భంగా వెల్లడించారు. మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ పోలీసుల మనోధైర్యాన్ని పెంచేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. మెరుగైన వసతులు ఉన్నప్పుడే సిబ్బంది మరింత ఉత్సాహంగా పని చేస్తారని, తద్వారా నేరాల నియంత్రణ సులభమవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ ఆత్కూరు స్టేషన్ పరిధిలోని గ్రామాలకు ఇది ఒక వరం లాంటిదని, ఎంతో కాలంగా నానుతున్న సమస్యకు పరిష్కారం లభించినందుకు సంతోషంగా ఉందన్నారు. ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానని ఆయన హామీ ఇచ్చారు. ఎస్పీ విద్యాసాగర్ నాయుడు మాట్లాడుతూ ఈ నూతన భవనం ద్వారా సాంకేతికతను జోడించి మరింత వేగంగా నేర పరిశోధన చేపట్టే అవకాశం కలుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న పోలీసు సిబ్బంది తమకు కొత్త భవనం కేటాయించినందుకు ప్రభుత్వంపై కృతజ్ఞతలు చాటుకున్నారు.

# న్యాయవ్యవస్థలో సరికొత్త విప్లవానికి నాంది

- వన్ కేస్, వన్ డేటా' విధానాన్ని ప్రకటించిన సీజేఐ
- 'సు-సహాయ్' అనే ఏఐ చాట్ బాట్ ప్రారంభం

హైదరాబాద్, మే 11 (వెలుతురు):



దేశవ్యాప్తంగా ఉన్న అన్ని న్యాయస్థానాల కేసుల డేటాను ఒకే గొడుగు కిందకు తెచ్చే లక్ష్యంతో సుప్రీంకోర్టు సరికొత్త డిజిటల్ వ్యవస్థను ప్రారంభించింది. ఇవాళ కోర్టు కార్యకలాపాలు ప్రారంభం కాగానే, భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్య కాంత్ ప్రతిష్టాత్మకమైన 'వన్ కేస్, వన్ డేటా' విధానంతో పాటు 'సుసహాయ్' అనే ఏఐ ఛాట్‌బాట్‌ను ఆవిష్కరించారు.

**వన్ కేస్.. వన్ డేటా సిస్టమ్ ఇదే..**

భారత్‌లో ఉన్న వివిధ కోర్టుల మధ్య సమాచార అంతరాన్ని తగ్గించడానికి ఈ వ్యవస్థను రూపొందించారు. దీంతో ద్వారా సుప్రీంకోర్టు, హైకోర్టులు, జిల్లా కోర్టులు, తాలూకా కోర్టుల డేటా అంతా లింక్ చేయనున్నారు. ఒక కేసు కింది కోర్టు నుంచి పై కోర్టుకు వెళ్లినప్పుడు, ఆ కేసు పూర్తి వివరాలు, పూర్వాపరాలను అధికారులు, న్యాయమూర్తులు సులభంగా యాక్సెస్ చేయవచ్చు. కేసుల ప్రస్తుత స్థితి వెరిఫై చేయడం ఇప్పుడు మరింత వేగవంతం, సులభం కానుంది. భారత దేశ చరిత్రలో ఇలాంటి సమగ్ర డేటా ఇంటిగ్రేషన్ జరగడం ఇదే తొలిసారి అని సీజేఐ సూర్యకాంత్ పేర్కొన్నారు.

**'సు-సహాయ్' ఏఐ ఛాట్‌బాట్ ప్రారంభం**

నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్ (NIC) సహకారంతో సుప్రీంకోర్టు రిజిస్ట్రీ అభివృద్ధి చేసిన 'సుసహాయ్' అనే ఏఐ ఆధారిత అసిస్టెన్స్ ఛాట్‌బాట్‌ను కూడా సీజేఐ ప్రారంభించారు. ఇది సుప్రీంకోర్టు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటుంది. కక్షిదారులు (Litigants), న్యాయవాదులు సుప్రీంకోర్టు సేవలను ఎలా పొందాలో, గైడ్‌లైన్స్ ఏమిటో తెలుసుకోవడానికి ఈ ఛాట్‌బాట్ సులభమైన ఇంటర్‌ఫేస్‌ను అందించనుంది. ఈ సందర్భంగా సీజేఐ మాట్లాడుతూ.. ఈ సాంకేతిక పరిజ్ఞానం వల్ల న్యాయ ప్రక్రియలో జాప్యం తగ్గుతుందని, న్యాయం అందరికీ మరింత సులభంగా అందుబాటులోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఇటీవల సిక్కింను దేశంలోనే మొట్టమొదటి 'పేపర్‌లెస్ జుడిషియరీ'గా ప్రకటించిన సీజేఐ, ఇప్పుడు దేశవ్యాప్త డేటా ఇంటిగ్రేషన్‌తో మరో ముందడుగు వేశారు.

# బెంగాల్‌లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం

- కొత్త ప్రభుత్వ తొలి సంక్షేమ నిర్ణయాలు వెల్లడి
- జూన్ 1 నుంచి మహిళలకు ఫ్రీ బస్ ట్రావెల్
- ఉద్యోగులు, విద్యార్థినులకు భారీ ఊరట

పశ్చిమ బెంగాల్ వెలుతురు మే 11:



పశ్చిమ బెంగాల్‌లో కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాల అమలుపై దృష్టి సారించింది. సువేందు అధికారి నేతృత్వంలోని ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఎన్నికల హామీలను అమలు చేసే దిశగా కీలక నిర్ణయాలు ప్రకటించింది. ముఖ్యంగా మహిళలు, విద్యార్థులు, ఉద్యోగార్థులకు ఊరటనిచ్చే పలు సంక్షేమ పథకాలను అమల్లోకి తీసుకురానున్నట్లు వెల్లడించింది. అందులో భాగంగా జూన్ 1 నుంచి రాష్ట్రవ్యాప్తంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. రాష్ట్ర రవాణా సంస్థల బస్సులతో పాటు ప్రభుత్వ అనుమతితో నడిచే కొన్ని ప్రజా రవాణా సేవల్లో కూడా ఈ పథకం అమలయ్యే అవకాశమున్నట్లు అధికారులు తెలిపారు. ప్రతిరోజూ ఉద్యోగాలు, విద్య, ఇతర అవసరాల కోసం ప్రజా రవాణాపై ఆధారపడే లక్షలాది మహిళలకు ఈ నిర్ణయం ప్రయోజనం చేకూర్చనుందని పేర్కొన్నారు. ప్రత్యేకించి పట్టణ ప్రాంతాల్లో ఉద్యోగాలకు వెళ్లే మహిళలు, కాలేజీలు, విశ్వవిద్యాలయాలకు వెళ్లే విద్యార్థినులు, చిన్న వ్యాపారాలు చేసుకునే మహిళలకు ఈ పథకం ఎంతో ఉపయోగకరంగా మారుతుందని ప్రభుత్వం అభిప్రాయపడుతోంది. పెరుగుతున్న ద్రవ్యోల్బణం, ఇంధన ధరలు, రవాణా ఖర్చుల కారణంగా కుటుంబాలపై ఆర్థిక భారం పెరుగుతోందని, ఆ భారాన్ని తగ్గించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నామని అధికారులు తెలిపారు. మహిళల ఆర్థిక స్వావలంబన, భద్రత, ఉపాధి అవకాశాల పెంపు దిశగా కూడా ఈ పథకం దోహదపడుతుందని ప్రభుత్వం భావిస్తోంది. ఉచిత బస్సు ప్రయాణం ద్వారా మహిళల ప్రయాణ వ్యయాలు తగ్గడంతో కుటుంబాల నెలవారీ ఖర్చుల్లో ఉపశమనం లభిస్తుందని పేర్కొంది. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాలకు ఉద్యోగాలు, విద్య కోసం వచ్చే మహిళలకు ఇది మరింత ఉపయోగపడుతుందని అధికారులు తెలిపారు. ఇక ఆరోగ్య రంగంలోనూ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న Ayushman Bharat ఆరోగ్య బీమా పథకాన్ని జూన్ 1 నుంచి రాష్ట్రంలో అమలు చేయనున్నట్లు ప్రకటించింది. ఈ పథకం ద్వారా పేద, మధ్యతరగతి కుటుంబాలకు నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని ప్రభుత్వం పేర్కొంది. అయుష్మాన్ భారత్ అమలులోకి వచ్చినప్పటికీ ప్రస్తుతం రాష్ట్రంలో అమలవుతున్న ఇతర సామాజిక సంక్షేమ, ఆరోగ్య పథకాలను నిలిపివేయబోమని ప్రభుత్వం స్పష్టం చేసింది. కేంద్ర పథకాలతో పాటు రాష్ట్ర ప్రభుత్వ పథకాలు కూడా కొనసాగుతాయని, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. ఆరోగ్య సేవలను మరింత విస్తరించడమే కాకుండా ప్రభుత్వ ఆస్పత్రుల్లో సదుపాయాల పెంపు, గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవల అందుబాటు, పేదలకు మెరుగైన చికిత్స అందించడంపై దృష్టి పెట్టినట్లు ప్రభుత్వం పేర్కొంది. ఆరోగ్య బీమా పథకం అమలుతో లక్షలాది కుటుంబాలకు వైద్య ఖర్చుల భారం తగ్గుతుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు. విద్యా రంగానికి సంబంధించిన మరో కీలక నిర్ణయాన్ని కూడా ప్రభుత్వం ప్రకటించింది. పాఠశాలల్లో ఉద్యోగాల భర్తీకి సంబంధించిన వయోపరిమితిని ఐదేళ్లు పొడిగించే ప్రతిపాదనకు రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలిపిందని వెల్లడించింది. గత కొన్నేళ్లుగా నియామకాలు ఆలస్యం కావడంతో వయోపరిమితి దాటిన అభ్యర్థులకు ఈ నిర్ణయం ఊరటనివ్వనుంది. టీచర్ పోస్టుల కోసం సిద్ధమవుతున్న వేలాది మంది అభ్యర్థులు ఈ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నారు. కరోనా కాలం, నియామకాల ఆలస్యం, పరిపాలనా సమస్యల కారణంగా ఉద్యోగ అవకాశాలు కోల్పోయిన అభ్యర్థులకు మరో అవకాశం లభించినట్లవుతుందని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు. త్వరలోనే నియామక ప్రక్రియను వేగవంతం చేసే అవకాశముందని సమాచారం. ఎన్నికల ప్రచార సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తామని ప్రభుత్వం మరోసారి స్పష్టం చేసింది. మహిళల సంక్షేమం, యువతకు ఉద్యోగ అవకాశాలు, ఆరోగ్య భద్రత, విద్యా రంగాభివృద్ధి వంటి అంశాలకు ప్రాధాన్యం ఇస్తామని తెలిపింది. ప్రజలకు నేరుగా ప్రయోజనం చేకూరే పథకాల అమలుపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టినట్లు పేర్కొంది. కొత్త ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి. ముఖ్యంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఆరోగ్య బీమా పథకం అమలు వంటి నిర్ణయాలు ప్రజల్లో ఆసక్తి రేకెత్తిస్తున్నాయి. ఈ పథకాల అమలు విధానం, ఆర్థిక భారం, ప్రయోజనాలపై రానున్న రోజుల్లో మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

# మొరాకోలో అదృశ్యమైన అమెరికా సైనికుడి మృతదేహం వెలికితీత

- ఆఫ్రికన్ లయన్ సైనిక విన్యాసాల సందర్భంగా ఘటన
- మరో సైనికుడి కోసం కొనసాగుతున్న భారీ శోధన చర్యలు
- అట్లాంటిక్ తీరంలో గుర్తించిన 27 ఏళ్ల అధికారి మృతదేహం



**హైదరాబాద్, వెలుతురు మే 11 :** మొరాకోలో నిర్వహించిన బహుళ దేశాల సైనిక విన్యాసాల సందర్భంగా అదృశ్యమైన అమెరికా ఆర్మీ సైనికుడి మృతదేహాన్ని అట్లాంటిక్ మహాసముద్రంలో గుర్తించినట్లు అమెరికా సైన్యం సోమవారం ప్రకటించింది. ఈ ఘటనలో కనిపించకుండా పోయిన మరో సైనికుడి కోసం శోధన ఇంకా కొనసాగుతోంది. మృతదేహంగా గుర్తించిన వ్యక్తి ఫస్ట్ లెఫ్టినెంట్ కెండ్రిక్ లమోంట్ కీ జూనియర్ (27). ఎయిర్ డిఫెన్స్ ఆర్టిలరీ అధికారిగా ఉన్న ఆయన, విధులకు విరామ సమయంలో సహచర సైనికుడితో కలిసి హైకింగ్‌కు వెళ్లినప్పుడు కొండచరియ నుంచి పడిపోయి సముద్రంలో కొట్టుకుపోయినట్లు సమాచారం. మే 2న ఆఫ్రికన్ లయన్ విన్యాసాల్లో పాల్గొన్న అనంతరం ఈ ఇద్దరూ అదృశ్యమయ్యారు. టాన్‌టాన్ సమీపంలోని క్యాప్ డ్రా ట్రైనింగ్ ఏరియాలో ఈ ఘటన జరిగినట్లు మొరాకో సైన్యం తెలిపింది. కొండలు, ఎడారి ప్రాంతాలతో కూడిన ఈ ప్రాంతంలో రాత్రి సమయంలో ప్రమాదం జరిగినట్లు భావిస్తున్నారు. మే 9 ఉదయం తీర ప్రాంతంలో, వారు పడిపోయిన ప్రాంతానికి సమీపంలో కీ జూనియర్ మృతదేహాన్ని గుర్తించారు. ఈ ఘటనతో అమెరికా, మొరాకో సహా పలు దేశాల సైన్యాలు కలిసి విస్తృత శోధనరక్షణ చర్యలు చేపట్టాయి. 600 మందికి పైగా సిబ్బంది, నౌకలు, హెలికాప్టర్లు, డ్రోన్ల సహాయంతో సముద్రంలో గాలింపు కొనసాగుతోంది. ఇప్పటివరకు 12,000 చదరపు కిలోమీటర్లకు పైగా ప్రాంతాన్ని శోధించినట్లు అధికారులు తెలిపారు. ఆఫ్రికన్ లయన్ 26 విన్యాసాలు మొరాకో, ట్యునీషియా, ఘానా, సెనెగల్ దేశాల్లో జరుగుతున్నాయి. 30కి పైగా దేశాలకు చెందిన 7,000 మంది సైనికులు ఇందులో పాల్గొంటున్నారు. 2004 నుంచి ఇది ఆఫ్రికాలో అతిపెద్ద సంయుక్త సైనిక విన్యాసంగా కొనసాగుతోంది.

# ఓయూ లో జాబ్ మేళా

- ఈ నెల మే 16 తేదీన సేల్స్ అండ్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ పోస్టులకు జాబ్-మేళా
- 15 సేల్స్ అండ్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ పోస్టుల భర్తీ



**హైదరాబాద్, మే 11 (వెలుతురు):** ఉస్మానియా యూనివర్సిటీ లోని ఎంప్లాయిమెంట్ బ్యూరో ఆధ్వర్యంలో "అక్షర ఎంటర్ప్రెజెస్ బెంగళూరు" ఆధ్వర్యంలో ఈ నెల 16న ఉదయం 11 గంటలకు జాబ్ మేళా నిర్వహించనున్నది. ఉస్మానియా యూనివర్సిటీ, ఆర్ట్స్ కాలేజీ ఎదురుగా ఉన్న ఎంప్లాయిమెంట్ బ్యూరో కార్యాలయంలో ఈ జాబ్ మేళా నిర్వహించనున్నారు. అక్షర ఎంటర్ప్రెజెస్ హైదరాబాద్ లోని సేల్స్ అండ్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ లకు చెందిన 15 పోస్టులను ఈ జాబ్ మేళా ద్వారా భర్తీ చేయనున్నారు, MBA/BBA/M.Com/B.Com, మరియు ఏదైనా డిగ్రీ చేసిన యువతి యువకులకు 18 నుండి 35 సంవత్సరాల వయసు వారికి మాత్రమే ఈ జాబ్ మేళాలో అవకాశం కల్పిస్తున్నట్లు యూనివర్సిటీ ఎంప్లాయిమెంట్ ఇన్ఫర్మేషన్ బ్యూరో డిప్యూటీ చీఫ్(UEI &GB/MCC)ఒక ప్రకటనలో తెలియజేసింది. రూ. (4 Lakhs per Annum) నాలుగు లక్షల వార్షిక వేతనం ఉండే ఈ ఉద్యోగాలకు మరిన్ని వివరాలకు .HR. శ్రేయాస్ ( 9343601037) ను సంప్రదించాలని ఆ ప్రకటనలో కోరారు. విద్యార్థతల సర్టిఫికెట్ల జిరాక్స్ తో ఉస్మానియా యూనివర్సిటీ ఎంప్లాయిమెంట్ బ్యూరో,(UEI&GB /MCC )వద్ద నేరుగా మే 16,2026న హాజరు కావాలని ప్రకటనలో పేర్కొన్నారు.

# విమానాశ్రయ ఫోటోలు, రికార్డు ల నిర్వహణ పై కఠిన నిబంధనలు

- 3 ఏళ్లు రికార్డులు తప్పనిసరి
- డీజీసీఏ కొత్త ఆదేశాలు



**న్యూఢిల్లీ, మే 11 (వెలుతురు):** దేశంలోని అన్ని విమానాశ్రయాల్లో సెక్యూరిటీ హోల్డ్ ఏరియా (SHA), టార్మాక్ ప్రాంతాల్లో తీసిన ఫోటోల రికార్డులను మూడు సంవత్సరాల పాటు భద్రపరచాలని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (DGCA) ఆదేశించింది. ఈ మేరకు ఎయిర్‌పోర్ట్ ఆపరేటర్లకు సర్క్యులర్ జారీ చేసింది. డీజీసీఏ సూచనల ప్రకారం, ఈ ఫోటోలకు సంబంధించిన రికార్డులు అవసరమైనప్పుడు తనిఖీ కోసం సమర్పించాలి. విమాన నియమావళి 1937లోని రూల్ 13 ప్రకారం, కొన్ని షరతులతో ఎయిర్‌పోర్ట్ ఆపరేటర్లు ఈ ప్రాంతాల్లో ఫోటోలు తీసుకోవడానికి అనుమతి ఉంది. ఫోటోలు తీసే వ్యక్తులు తప్పనిసరిగా గుర్తింపు పత్రాలు, అలాగే బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీ (BCAS) సూచనల ప్రకారం ఇచ్చే అనుమతి పాస్ కలిగి ఉండాలి. అలాగే ప్రయాణికుల మాదిరిగానే పూర్తి భద్రతా తనిఖీలకు లోనవ్వాలి. అయితే సాధారణ ప్రయాణికులు ఈ ప్రాంతాల్లో ఫోటోలు తీయడానికి అనుమతి లేదు. తాజా ఆదేశాల ప్రకారం, ఈ ఫోటోలను మూడు సంవత్సరాల పాటు భద్రపరచి, అవసరమైతే డీజీసీఏకు చూపించాల్సి ఉంటుంది. ప్రస్తుతం దేశంలో 163 విమానాశ్రయాలు కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయని పౌర విమానయాన మంత్రిత్వ శాఖ సమాచారం తెలిపింది.

# కాలువలు కబ్జా... కాంక్రీట్ అడవులుగా మారుతున్న మున్సిపాలిటీలు..!

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత "విశ్వనగరం హైదరాబాద్", "గ్లోబల్ సిటీ", "స్మార్ట్ అర్బన్ తెలంగాణ", "ప్లాన్డ్ డెవలప్‌మెంట్" వంటి నినాదాలు అధికార వర్గాల నోటి నుంచి తరచూ వినిపిస్తున్నాయి. నగరాల అభివృద్ధి, ఆధునిక మౌలిక వసతులు, అంతర్జాతీయ ప్రమాణాల పట్టణ నిర్మాణం, స్మార్ట్ రోడ్లు, ఐటీ కారిడార్లు, స్కైవేలు, ఫ్లై ఓవర్లు అంటూ ప్రభుత్వాలు గొప్పలు చెప్పుకుంటున్నాయి. కానీ నేలమీద వాస్తవ పరిస్థితి మాత్రం పూర్తిగా భిన్నంగా ఉంది. హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని వందకు పైగా మున్సిపాలిటీలలో పట్టణాభివృద్ధి వ్యవస్థ పూర్తిగా అవినీతి, అక్రమాలు, రాజకీయ ఒత్తిళ్లు, అధికారుల చేతుల మాయకు బలైపోయింది.టౌన్ ప్లానింగ్ వ్యవస్థ ప్రజల కోసం కాకుండా, అక్రమ నిర్మాణాల కోసం పనిచేస్తోందన్న అభిప్రాయం సాధారణ ప్రజల్లో బలపడుతోంది. చట్టాలు ఉన్నా అమలు లేదు. నిబంధనలు ఉన్నా పాటించాల్సిన అవసరం లేదన్న భావన అధికార యంత్రాంగంలో ఏర్పడింది. ప్రజల భద్రత, పర్యావరణ పరిరక్షణ, వర్షపు నీటి ప్రవాహ మార్గాలు, కాలువలు, చెరువులు, రోడ్ల విస్తరణ, పార్కులు, డ్రైనేజీ వంటి మౌలిక అంశాలను పక్కనబెట్టి కేవలం ఆదాయం, లంచాలు, రాజకీయ అనుకూలతలే పరమావధిగా మారిపోయాయి.మున్సిపాలిటీలలో ఎక్కడ చూసినా అనుమతులకు విరుద్ధంగా కట్టడాలు, నాలాలు ఆక్రమించి నిర్మించిన వెంచర్లు, డ్రైనేజీ లేకుండా లేఅవుట్లు, పార్కింగ్ లేకుండా కమర్షియల్ భవనాలు, భూగర్భ జలాల పునరుత్పత్తిని నాశనం చేసే కాంక్రీట్ నిర్మాణాలు కనిపిస్తున్నాయి. ఇవన్నీ ఒక్కరోజులో జరిగినవి కావు. వీటి వెనుక టౌన్ ప్లానింగ్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, రెవెన్యూ అధికారులు, ఆర్ అండ్ బి శాఖ, హెచ్ఎండీఏ అధికారులు, రాజకీయ నాయకులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు కలిసి ఏర్పరచుకున్న బలమైన అవినీతి వ్యవస్థ పనిచేస్తోందన్న ఆరోపణలు తీవ్రంగా వినిపిస్తున్నాయి.పట్టణ ప్రణాళిక అంటే భవిష్యత్ తరాల అవసరాలను దృష్టిలో పెట్టుకుని నగరాల రూపకల్పన చేయడం. కానీ తెలంగాణలో చాలా మున్సిపాలిటీల్లో జరుగుతున్నది మాత్రం "అనుమతుల వ్యాపారం". ఏ భూమి అయినా వెంచర్‌గా మారుతోంది. ఏ కాలువ అయినా మూసివేయబడుతోంది. ఏ చెరువు అయినా ప్లాట్లుగా విభజించబడుతోంది. అధికారుల కళ్లముందే ఈ అక్రమాలు జరుగుతున్నా చర్యలు తీసుకునే పరిస్థితి కనిపించడం లేదు.

ప్రత్యేకంగా కొత్త వెంచర్ల విషయంలో పరిస్థితి మరింత ప్రమాదకరంగా ఉంది. గ్రామపంచాయతీల నుంచి మున్సిపాలిటీలుగా మారిన ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం భారీగా పెరిగింది. వ్యవసాయ భూములు భారీగా లేఅవుట్లుగా మారుతున్నాయి. కానీ వాటికి సరైన డ్రైనేజీ ఉందా? వర్షపు నీటి ప్రవాహ మార్గాలు ఎక్కడికి వెళ్తాయి? సమీపంలో చెరువులు ఉన్నాయా? భవిష్యత్‌లో వరద ముప్పు ఉంటుందా? రోడ్ల వెడల్పు సరిపోతుందా? అనే అంశాలు పూర్తిగా పక్కన పడుతున్నాయి.అత్యంత ఆందోళనకరమైన విషయం ఏమిటంటే, ఆర్ అండ్ బి శాఖకు చెందిన నీటి కాలువలను, వాగులను, సహజ ప్రవాహ మార్గాలను మూసివేసి వెంచర్లు రూపొందించడం. చాలా చోట్ల నాలాలను మట్టితో నింపి ప్లాట్లు విక్రయిస్తున్నారు. నీటి ప్రవాహం సహజ మార్గాన్ని కోల్పోతే, వర్షాకాలంలో నీరు తిరిగి నివాస ప్రాంతాలనే ముంచెత్తుతుంది. హైదరాబాద్ నగరంలో గత కొన్ని సంవత్సరాలుగా ప్రతి భారీ వర్షం తర్వాత ఎదురవుతున్న వరదల వెనుక ఇదే ప్రధాన కారణం.2020లో హైదరాబాద్‌ను ముంచెత్తిన భారీ వర్షాల సమయంలో నాలాలు, చెరువులు, నీటి ప్రవాహ మార్గాల ఆక్రమణల వల్ల వేలాది కుటుంబాలు తీవ్ర నష్టపోయాయి. అయినప్పటికీ ప్రభుత్వ వ్యవస్థ పెద్దగా పాఠం నేర్చుకున్నట్లు కనిపించలేదు. వరదలు తగ్గిన తర్వాత మళ్లీ అదే అక్రమ వెంచర్లు, అదే రాజకీయ ఒత్తిళ్లు, అదే అవినీతి వ్యవస్థ కొనసాగింది.

వాస్తవానికి తెలంగాణ మున్సిపాలిటీల్లో అమలులో ఉన్న చట్టాలు చాలా స్పష్టంగా ఉన్నాయి. తెలంగాణ మున్సిపాలిటీస్ చట్టం 2019 ప్రకారం పట్టణ ప్రణాళిక, నిర్మాణ అనుమతులు, డ్రైనేజీ, ప్రజా భద్రత, రోడ్ల పరిరక్షణ, పార్కుల అభివృద్ధి, నీటి ప్రవాహ మార్గాల సంరక్షణ వంటి అంశాలపై స్థానిక సంస్థలకు స్పష్టమైన బాధ్యతలు అప్పగించబడ్డాయి. అనుమతి లేకుండా నిర్మాణాలు చేయడం నేరం. అనుమతులకు విరుద్ధంగా నిర్మాణాలు చేస్తే వాటిని కూల్చివేసే అధికారం మున్సిపాలిటీలకు ఉంది. కానీ ఈ చట్టాలు సాధారణ ప్రజలపై మాత్రమే అమలవుతున్నాయన్న విమర్శలు ఉన్నాయి. పెద్ద రియల్ ఎస్టేట్ వ్యాపారులు, రాజకీయ అనుబంధం ఉన్నవారి విషయంలో అధికారులు మౌనంగా ఉంటున్నారు.నీటి కాలువల విషయంలో కూడా అనేక చట్టాలు ఉన్నాయి. వాగులు, చెరువులు, నాలాలు, ఫీడర్ ఛానళ్లను ఆక్రమించడం చట్టవిరుద్ధం. వాటి సహజ ప్రవాహాన్ని అడ్డుకోవడం పర్యావరణ నేరంగా పరిగణించవచ్చు. వాటర్, ల్యాండ్ అండ్ ట్రీస్ చట్టం (WALTA), పర్యావరణ పరిరక్షణ చట్టాలు, విపత్తు నిర్వహణ నిబంధనలు కూడా ఈ విషయంలో స్పష్టమైన మార్గదర్శకాలు ఇస్తాయి. అయినప్పటికీ అమలు పూర్తిగా విఫలమైంది. ప్రత్యేకంగా ఇంకుడు గుంతల అంశం కూడా తీవ్ర నిర్లక్ష్యానికి గురవుతోంది. భూగర్భ జలాల పరిరక్షణ కోసం ప్రతి ఇంటికి ఇంకుడు గుంతలు తప్పనిసరి. మున్సిపల్ అనుమతి ఇచ్చే సమయంలో ఇవి నిర్మించాలన్న నిబంధనలు ఉన్నా, చాలా చోట్ల కేవలం పేపర్ల మీదే పరిమితమవుతున్నాయి. ఇంటి యజమానులకు సరైన అవగాహన కల్పించడం లేదు. అధికారులు తనిఖీలు చేయడం లేదు. ఫలితంగా వర్షపు నీరు భూమిలోకి ఇంకకుండా రోడ్లపైకి, కాలనీల్లోకి చేరి వరదల రూపంలో సమస్యలు సృష్టిస్తోంది.హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో అనేక చెరువులు గత రెండు దశాబ్దాల్లో మాయం అయ్యాయి. చెరువుల ఫుల్ ట్యాంక్ లెవల్ (FTL) ప్రాంతాల్లో కూడా నిర్మాణాలు జరిగాయి. బఫర్ జోన్లు పూర్తిగా ఆక్రమించబడ్డాయి. అధికారులు చర్యలు తీసుకోవాల్సిన సమయంలో లంచాలు తీసుకుని కళ్లుమూసుకున్నారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.మున్సిపల్ టౌన్ ప్లానింగ్ విభాగం ప్రజల భద్రత కోసం కాకుండా "సెటిల్‌మెంట్ వ్యవస్థ"గా మారిందన్న అభిప్రాయం సామాన్య ప్రజల్లో పెరుగుతోంది. అనుమతులు పొందాలంటే లంచాలు తప్పవని, అక్రమ నిర్మాణం చేసినా సరైన వాటా ఇస్తే ఎవరూ అడగరని ఒక ప్రమాదకర పరిస్థితి ఏర్పడింది. ఇది కేవలం పరిపాలనా వైఫల్యం మాత్రమే కాదు, ఇది పట్టణ భవిష్యత్తును నాశనం చేసే వ్యవస్థాత్మక అవినీతి.పట్టణ అభివృద్ధి అనేది కేవలం కాంక్రీట్ భవనాలు కట్టడం కాదు. జీవించడానికి అనువైన నగరాలను నిర్మించడం. కానీ ప్రస్తుతం మున్సిపాలిటీల్లో జరుగుతున్న అభివృద్ధి భవిష్యత్ తరాలకు ప్రమాదంగా మారుతోంది. రోడ్లు ఇరుకుగా మారుతున్నాయి. పార్కులు కనిపించడం లేదు. వర్షం వస్తే కాలనీలు మునిగిపోతున్నాయి. తాగునీటి సమస్య పెరుగుతోంది. భూగర్భ జలాలు పడిపోతున్నాయి. చెట్లు నరికి కాంక్రీట్ అడవులు పెరుగుతున్నాయి.ఇది కొనసాగితే భవిష్యత్‌లో తెలంగాణ పట్టణాలు తీవ్రమైన పర్యావరణ సంక్షోభాన్ని ఎదుర్కోవాల్సి వస్తుంది. వాతావరణ మార్పుల ప్రభావం ఇప్పటికే పెరుగుతోంది. భారీ వర్షాలు, ఆకస్మిక వరదలు, వేడి తరంగాలు పెరుగుతున్నాయి. ఇలాంటి సమయంలో సహజ నీటి మార్గాలను మూసివేయడం అంటే భవిష్యత్ విపత్తులకు ఆహ్వానం పలకడమే.

ఈ సమస్యలో రాజకీయ నాయకుల బాధ్యత కూడా చాలా పెద్దది. అనేక చోట్ల అక్రమ వెంచర్ల వెనుక స్థానిక రాజకీయ నాయకుల ప్రోత్సాహం ఉందన్న ఆరోపణలు ఉన్నాయి. ఎన్నికల నిధులు, భూవ్యాపార ప్రయోజనాలు, అధికార దుర్వినియోగం వల్ల అధికారులు కూడా చర్యలు తీసుకోలేని పరిస్థితి ఏర్పడుతోంది. ఒక అధికారి నిజాయితీగా పనిచేయాలని ప్రయత్నించినా రాజకీయ ఒత్తిళ్లు ఎదురవుతున్నాయని ప్రభుత్వ వ్యవస్థలోనే చర్చ జరుగుతోంది. ప్రస్తుతం అవసరమైనది కేవలం చిన్నచిన్న చర్యలు కాదు; సంపూర్ణ పట్టణ సంస్కరణలు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణం రాష్ట్రవ్యాప్తంగా మున్సిపాలిటీలలో జరిగిన అక్రమ నిర్మాణాలు, నాలాల ఆక్రమణలు, చెరువుల ఆక్రమణలు, అనుమతులకు విరుద్ధంగా జరిగిన వెంచర్లపై సమగ్ర సర్వే నిర్వహించాలి. ప్రతి మున్సిపాలిటీలో GIS ఆధారిత మ్యాపింగ్ చేయాలి. నీటి ప్రవాహ మార్గాలను గుర్తించి డిజిటల్ రికార్డుల్లో నమోదు చేయాలి.టౌన్ ప్లానింగ్ అధికారుల ఆస్తులపై కూడా విచారణ అవసరం ఉందన్న డిమాండ్ పెరుగుతోంది. అక్రమాలకు సహకరించిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోకపోతే పరిస్థితి మారదు. కేవలం చిన్న ఉద్యోగులను బలి చేసి పెద్దస్థాయి అవినీతిని వదిలేయడం వల్ల ప్రజల విశ్వాసం దెబ్బతింటోంది.

ఇక ప్రజల్లో కూడా అవగాహన పెరగాలి. చట్టవిరుద్ధ వెంచర్లలో ప్లాట్లు కొనుగోలు చేయడం చివరికి తమకే ప్రమాదమని గుర్తించాలి. తక్కువ ధరకు ప్లాట్ వస్తోందని చూసి నీటి కాలువల్లో, చెరువు బఫర్ జోన్లలో కొనుగోలు చేస్తే భవిష్యత్‌లో నష్టపోయేది ప్రజలే. అందుకే అనుమతులు, లేఅవుట్ నిబంధనలు, డ్రైనేజీ, రోడ్లు, నీటి ప్రవాహ మార్గాలు వంటి అంశాలను పరిశీలించి మాత్రమే కొనుగోళ్లు చేయాలి. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రస్తుతం తెలంగాణలో పరిపాలనలో పారదర్శకత, అవినీతి నిరోధక చర్యలు, ప్రజా సమస్యల పరిష్కారం గురించి మాట్లాడుతోంది. అయితే పట్టణాభివృద్ధి రంగంలో నిజమైన మార్పు తీసుకురావాలంటే మున్సిపాలిటీలలో ఉన్న అవినీతి వ్యవస్థపై కఠిన యుద్ధం ప్రకటించాల్సిన అవసరం ఉంది. అక్రమ నిర్మాణాలను కూల్చివేయడమే కాదు, వాటికి అనుమతులు ఇచ్చిన అధికారులను కూడా జవాబుదారీ చేయాలి.హైదరాబాద్ సహా అన్ని మున్సిపాలిటీల్లో నాలాల పునరుద్ధరణ, చెరువుల పరిరక్షణ, తప్పనిసరి ఇంకుడు గుంతలు, పర్యావరణ అనుకూల పట్టణ నిర్మాణం, పారదర్శక ఆన్‌లైన్ అనుమతి వ్యవస్థ, ప్రజా ఫిర్యాదు వ్యవస్థలను బలోపేతం చేయాలి. రాజకీయ ఒత్తిళ్లకు లొంగకుండా పనిచేసే స్వతంత్ర పట్టణ పర్యవేక్షణ సంస్థ అవసరం ఉంది. పట్టణాలు ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడానికి ఉండాలి గానీ, కొంతమంది అధికారుల సంపాదన కేంద్రాలుగా మారకూడదు. చట్టాలను అమలు చేయాల్సిన వారే చట్టాల్ని ధ్వంసం చేస్తే ప్రజాస్వామ్య పరిపాలనపై ప్రజల నమ్మకం కూలిపోతుంది. అభివృద్ధి పేరుతో ప్రకృతిని నాశనం చేస్తే చివరికి మూల్యం చెల్లించేది సామాన్య ప్రజలే. తెలంగాణ నిజంగా "గ్లోబల్ సిటీలు" కలిగిన రాష్ట్రంగా ఎదగాలంటే ముందుగా పట్టణ పాలనను అవినీతి నుంచి విముక్తి చేయాలి. నీటి కాలువలను రక్షించాలి. చెరువులను కాపాడాలి. చట్టాలను కఠినంగా అమలు చేయాలి. టౌన్ ప్లానింగ్ వ్యవస్థను ప్రజా ప్రయోజనాల దిశగా మళ్లించాలి. లేకపోతే ఈరోజు కనిపిస్తున్న అక్రమ కట్టడాలు రేపటి విపత్తులుగా మారడం ఖాయం.




మన్నారం నాగరాజు
సామాజిక రాజకీయ విశ్లేషకులు.

# మాటే మంత్రము... మనసే బంధము...!

మనిషి జన్మించినప్పటి నుండి మరణించే వరకు ఆ మధ్యలో జీవిస్తున్న ప్రతి క్షణంలో అతనికి తోడుగా నిలిచేది మాట మరియు మనసు. ఈ రెండూ లేకుండా మానవ జీవితం అసంపూర్ణమే. మాట అనేది కేవలం నోట్లో నుండి వచ్చే శబ్దం కాదు అది ఒక శక్తి, ఒక మంత్రం, ఒక జీవనస్రవంతి. మనసు అనేది కేవలం ఆలోచనల గూడు కాదు అది ఒక బంధం, ఒక వారధి, ఒక ప్రేమసముద్రం. "మాటే మంత్రము... మనసే బంధము..." అనే సత్యం మన తెలుగు సంస్కృతిలో యుగయుగాల నుండి జీర్ణించుకుపోయి ఉంది. ఈ వ్యాసంలో మాట యొక్క శక్తిని, మనసు యొక్క లోతును, మరియు ఈ రెండింటి కలయిక సమాజాన్ని ఎలా ప్రభావితం చేస్తుందో సుదీర్ఘంగా చర్చిద్దాం.ఒక మాట మనిషిని బతికించగలదు. అదే మాట మనిషిని కూల్చివేయగలదు. వేదకాలం నుండి మన పెద్దలు చెప్పిన మాట ఒక్కటే వాక్కు బ్రహ్మ స్వరూపం. అంటే మాట అనేది పరమాత్మకు సమానమైన శక్తి. మనం ఉచ్చరించే ప్రతి శబ్దమూ ఒక శక్తిని సృష్టిస్తుంది మంచి మాట మంచి శక్తిని, చెడు మాట చెడు శక్తిని కలిగిస్తుంది. అందుకే మన తెలుగు సాహిత్యంలో నాలుకకు నాలుగు గోడలు అని హెచ్చరించారు పెద్దలు. అంటే మాట్లాడే ముందు నిగ్రహం, ఆలోచన తప్పనిసరి. చరిత్రను తరచి చూస్తే ఒక్క మాటతో యుద్ధాలు ఆగిన సందర్భాలు ఉన్నాయి. ఒక్క మాటతో ప్రేమలు పుట్టిన క్షణాలు ఉన్నాయి. గాంధీజీ అహింస మాటలు దేశాన్ని మేల్కొలిపాయి. శాంతియుత మార్గంలో స్వతంత్రం సంపాదించవచ్చనే ఆయన మాట ఒక మంత్రంలా భారతీయుల హృదయాలను కదిలించింది. అలాగే స్వామి వివేకానంద చికాగో ప్రసంగంలో పలికిన అమెరికా దేశపు సోదరీ సోదరులారా అనే ఒక్క పిలుపు భారతావనికి గర్వకారణమైంది. ఆ మాటలో ఉన్న ఆర్ద్రత, ఆత్మీయత ప్రపంచాన్నే ఆకర్షించింది. మహాకవి శ్రీశ్రీ కలం నుండి జాలువారిన మాటలు శ్రమజీవి హృదయాలలో విప్లవం నింపాయి. మాటలు కేవలం వినడానికే కాదు అవి అనుభవించడానికి, జీవించడానికి ఉపయోగపడతాయి.

తెలుగు భాషలో మాట తప్పడం అనే మాటలో ఒక తీవ్రమైన నైతిక సందేశం ఉంది. మాట ఇచ్చి నిలబడే వ్యక్తి గొప్పవాడు అని మన సమాజం నమ్ముతుంది. సత్యహరిశ్చంద్రుడి నుండి నేటి సామాన్యుడి వరకు వాగ్దానం అనేది ఒక పవిత్రమైన క్రియ. ఆ నమ్మకమే మాటకు మంత్రశక్తిని ఇస్తుంది. ఒక తల్లి పిల్లలకు చెప్పే నీవు గొప్పవాడివి, నీవు నిర్భయంగా ముందుకు సాగు అనే మాటలు ఆ బిడ్డ జీవితంలో వెలుగు దారులు వేస్తాయి. ఒక గురువు చేత వినిపించే ప్రోత్సాహక మాటలు శిష్యుని జీవితాన్నే మలుపు తిప్పగలవు. ఒక విఫలమైన మనిషికి పర్వాలేదు, నేనున్నాను అని చెప్పే చిన్న మాట వంద ఏనుగుల బలాన్ని ఇస్తుంది. ఇదే మాటకు గల నిజమైన మంత్రశక్తి.మాట పెదవుల వరకు వస్తుంది. కానీ మనసు పెదవులకు అందని లోతుల్లో ఉంటుంది. ప్రేమను మాటలలో చెప్పవచ్చు, కానీ అనుభవించడం మనసు పని. ద్వేషాన్ని మాటలు వెళ్ళగక్కవచ్చు, కానీ దాన్ని పెంచేది కూడా మనసే. మనసు అనేది ఒక అద్భుతమైన సృష్టి ఇది



ఏకకాలంలో స్వర్గం కావచ్చు, నరకం కావచ్చు. మంచి ఆలోచనలతో నింపితే అది పుష్పవనం; చెడు ఆలోచనలతో నింపితే అది ముళ్ళపొదరిల్లు.తెలుగు వాంగ్మయంలో మనసుకు ఎంత ప్రాధాన్యత ఇచ్చారో చూస్తే ఆశ్చర్యం కలుగుతుంది. మనసే మందిరం అని అంటారు. మనసు స్వచ్ఛంగా ఉంటే జీవితమే పవిత్ర క్షేత్రమవుతుంది. అన్నమాచార్యుల కీర్తనలు, త్యాగరాజ స్వామి సంకీర్తనలు వీటన్నింటిలోనూ మనసును భగవంతుని వైపు మళ్ళించమని సందేశముంది. ఎందుకంటే మనసే అన్ని అనుబంధాలకు మూలం అది ఆత్మీయతకైనా, ఆధ్యాత్మికతకైనా.బంధాలు పైకి కనిపించేవి కావు. తల్లీ బిడ్డల బంధం, భార్యాభర్తల అనురాగం, స్నేహితుల ఆప్యాయత ఇవేవీ కంటికి కనిపించవు. కానీ మనసుకు అవి స్పష్టంగా అనుభవమవుతాయి. ఒక తల్లి హృదయం తన బిడ్డ ఏ మూలలో ఉన్నా పసిగట్టగలదు. ఆ శక్తి మనసుకే ఉంది. ఒక నిజమైన స్నేహితుడు మాటలు లేకుండానే మిత్రుని బాధను అర్థం చేసుకుంటాడు. ఆ మౌనంలోని అర్థాన్ని గ్రహించడమే మనసు యొక్క బంధనశక్తి. మనసులో ప్రేమ ఉంటే ప్రపంచమంతా చుట్టాలుగా కనిపిస్తారు. వసుధైక కుటుంబకం అనే భావన మనసు యొక్క విస్తృతిని తెలియజేస్తుంది.

మాటకూ మనసుకూ అవినాభావ సంబంధం ఉంది. మనసులో మంచి ఉంటే మాట తనంతట తానుగా మధురంగా వస్తుంది. మనసు కల్మషపడ్డప్పుడు మాట కూడా కత్తిలా మారుతుంది. అందుకే మాట మనసుకు అద్దం అంటారు. మాటల్లో ఒక వ్యక్తి స్వభావం ప్రతిబింబిస్తుంది. లోపల ఒకటి ఉంచుకుని బయటకు మరొకటి మాట్లాడటం వల్ల బంధాలు బలహీనపడతాయి. మనసులో ఉన్న భావాన్ని నిజాయితీగా మాటల్లో వ్యక్తపరిచినప్పుడే అది అవతలి వ్యక్తి హృదయాన్ని తాకుతుంది.ఆధునిక మనస్తత్వశాస్త్రం కూడా ఈ సత్యాన్ని ధృవీకరించింది. ఒక రోగికి నీవు తప్పకుండా కోలుకుంటావు అని వైద్యుడు మనసారా చెప్పినప్పుడు, ఆ రోగిలో సానుకూల దృక్పథం పెరుగుతుంది. శరీరంలో రసాయనిక మార్పులు జరిగి వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుంది. దీన్నే "ప్లేసిబో ఎఫెక్ట్" అంటారు. అంటే మాటలో ఉన్న మంత్రశక్తిని, అది మనసుపై చూపే ప్రభావాన్ని శాస్త్రం కూడా అంగీకరించింది. "పాజిటివ్ అఫర్మేషన్స్" అనే భావన కూడా ఇదే చెబుతుంది మనసు నమ్మిన మాటలు వాస్తవంగా మారుతాయి. మనం మనతో మనం చెప్పుకునే మాటలు (Selftalk) కూడా మన వ్యక్తిత్వాన్ని నిర్మిస్తాయి.పిల్లలకు నీవు చేయలేవు అని చెప్పడం వేరు, నీవు చేయగలవు, ప్రయత్నించు అని చెప్పడం వేరు. మొదటి మాట మనసును చంపుతుంది, రెండో మాట మనసును జీవింపజేస్తుంది. ఇది సాధారణ తేడా కాదు ఇది ఒక జీవితాన్ని మారుపుచ్చే శక్తి. ఒక చిన్న ప్రోత్సాహం ఒక గొప్ప శాస్త్రవేత్తను లేదా కళాకారుడిని ఈ లోకానికి అందించవచ్చు. అందుకే ప్రతి ఇల్లూ, ప్రతి పాఠశాల, ప్రతి సమాజం మంచి మాటలతో, మంచి మనసుతో నడవాలి. ఇక్కడ మాట ఒక విత్తనం అయితే, మనసు అనేది ఫలవత్తమైన భూమి వంటిది.

నేటి డిజిటల్ యుగంలో మాటలు వేగంగా ప్రయాణిస్తున్నాయి. సోషల్ మీడియాలో ఒక మాట నిమిషాల్లో లక్షల మంది దగ్గర చేరుతుంది. కానీ ఈ వేగంలో మాటకున్న బాధ్యత, బరువు మరుగున పడుతోంది. అజ్ఞాతంగా ఉండి ఎవరినైనా దూషించడం, అసత్యమైన మాటలు ప్రచారం చేయడం, విద్వేషపూరిత మాటలు సమాజాన్ని విడదీయడం మనం చూస్తున్నాం. ఇది మాటకున్న మంత్రశక్తిని దుర్వినియోగం చేస్తున్న తీరు. విషపూరితమైన మాట మనసులను విడదీస్తుంది, సమాజంలో అశాంతిని నింపుతుంది. ఈ నేపథ్యంలో మాటను మరింత బాధ్యతగా వాడాల్సిన అవసరం ఉంది.మనసు విషయానికి వస్తే నేటి తరం తీవ్రమైన ఒత్తిడికి లోనవుతోంది. వందల మంది స్నేహితులు సోషల్ మీడియాలో ఉన్నా, మనసు మాత్రం ఒంటరిగా అనిపిస్తుంది. ఎందుకంటే మనసు లైక్ లు, కామెంట్ లు కోరదు అది నిజమైన స్పర్శను, నిజమైన మాటను, నిజమైన అనుబంధాన్ని కోరుతుంది. ఒక మనిషి కళ్ళలోకి చూసి మాట్లాడటంలో ఉండే ఆత్మీయత ఒక ఎమోజీలో ఉండదు. అందుకే మన పాత విలువలు ముఖాముఖి మాట్లాడటం, కలిసి కూర్చుని కష్టసుఖాలు పంచుకోవడం, నిజంగా పట్టించుకోవడం ఇవి నేడు మరింత విలువైనవి అవుతున్నాయి. యాంత్రికమైన జీవితంలో మనసును మనసుతో కలిపే బంధాలు కరువవుతున్నాయి.సమాజంలో పెరుగుతున్న నేరాలు, ఆత్మహత్యలు, మానసిక ఆందోళనలకు ప్రధాన కారణం మనసులో ఉన్న బాధను పంచుకోవడానికి సరైన మాట దొరకకపోవడమే. ఎవరైనా తనను అర్థం చేసుకుంటారనే నమ్మకం (బంధం) ఉన్నప్పుడు మనిషి ఏ కష్టాన్నైనా తట్టుకోగలడు. అందుకే మనం మాటను ఒక ఆయుధంగా కాకుండా, ఒక ఔషధంగా వాడటం నేర్చుకోవాలి.మాటే మంత్రమైనప్పుడు ప్రతి మాటా ఒక దీవెనలా ఉండాలి. మనసే బంధమైనప్పుడు ఆ బంధం స్వార్థం లేని ప్రేమతో నిండి ఉండాలి. మన తెలుగు సంస్కృతి ఈ రెంటినీ చాలా గొప్పగా కాపాడింది. నోరు మంచిదైతే ఊరు మంచిదవుతుంది అనే సామెతలో ఎంతో నిగూఢార్థం ఉంది. మన మాట తీరు మన చుట్టూ ఉన్న ప్రపంచాన్ని ప్రభావితం చేస్తుంది. మనసులో ప్రేమ, పెదవులపై మృదువైన మాట ఈ రెండూ ఉన్న మనిషి ఏ రంగంలో ఉన్నా విజయం పొందుతాడు. ఎందుకంటే అతను కేవలం పనులు చేయడం లేదు, మనసులను గెలుచుకుంటున్నాడు.చివరగా ఒక్క మాట ఈ రోజు మీరు కలిసే వ్యక్తుల్లో కనీసం ఒక్కరికైనా ఒక మంచి మాట చెప్పండి. ఒక చిన్న ప్రశంస, ఒక ఓదార్పు, లేదా ఒక చిరునవ్వుతో కూడిన పలకరింపు ఇవి అవతలి వ్యక్తి రోజును మార్చవచ్చు. వారి మనసులో మీ పట్ల ఒక బలమైన బంధాన్ని ఏర్పరచవచ్చు. ఆ చిన్న పని చేస్తే మీరు ఒక మంత్రాన్ని ఉచ్చరించినట్లే, ఒక పవిత్రమైన బంధాన్ని నిర్మించినట్లే. ఈ ప్రపంచాన్ని మరింత అందంగా, నివాసయోగ్యంగా మార్చే శక్తి మన మాటలోనే ఉంది, మన మనసులోనే ఉంది.మాటే మంత్రము దానిని పవిత్రంగా వాడు. మనసే బంధము దానిని ప్రేమతో కాపాడు.ఇది కేవలం ఒక వ్యాసం కాదు, ప్రతి హృదయం స్మరించాల్సిన జీవన సూత్రం. మన మాట మన వ్యక్తిత్వానికి నిదర్శనం, మన మనసు మన సంస్కారానికి ప్రతిబింబం. ఈ రెండింటిని సమన్వయం చేసుకుంటూ సాగితేనే మానవ జన్మకు సార్థకత లభిస్తుంది. తెలుగు నేల మీద పుట్టిన ప్రతి ఒక్కరూ ఈ మాటమనసు సంప్రదాయాన్ని గౌరవిస్తూ, ముందడుగు వేయాలని ఆశిద్దాం.



డా .సూర్యదేవర రామకృష్ణ ,
9490754169

## నెల రోజుల పాటు టీఆర్ఎస్ జెండా పండుగ

హైదరాబాద్, మే 11 (వెలుతురు):

"తెలంగాణ రక్షణ సేన" పార్టీ భావజాలాన్ని గ్రామస్థాయి వరకు తీసుకెళ్లేందుకు మే 20 నుంచి నెల రోజుల పాటు జెండా పండుగ నిర్వహించాలని పార్టీ శ్రేణులకు ఆ పార్టీ అధినేత్రి కల్వకుంట్ల కవిత పిలుపునిచ్చారు. ఈ నెల 20 నుంచి జూన్ 20వ తేదీ వరకు నెల రోజులపాటు రాష్ట్ర రాజధాని, జిల్లా కేంద్రాలతో పాటు నియోజకవర్గ, మండల కేంద్రాలు, గ్రామ స్థాయి వరకు పెద్ద ఎత్తున జెండా పండుగ నిర్వహించాలని .. అన్ని వార్డుల్లోనూ టీఆర్ఎస్ జెండాలు ఎగురవేయాలని సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టీఆర్ఎస్ ఆవిర్భావ సభలో ప్రకటించిన పార్టీ విధానాలను, పాంచజన్య సిద్ధాంతాలను ప్రజలకు వివరించాలని కోరారు. రాష్ట్రం ఆవిర్భవించి 12 ఏళ్లు గడిచిన తర్వాత కూడా మన తెలంగాణ గడ్డ అనేక విపత్కర పరిస్థితులను ఎదుర్కొంటున్నదని మండిపడ్డారు. తెలంగాణ ఉద్యమ నినాదాలైన నీళ్లు నిధులు నియామకాలను సాకారం చేసుకోవడంలోనూ వంచనకు గురయ్యామన్నారు. వలస పాలన నాటి దుష్పరిణామాలను మనం ఇప్పుడు మళ్లీ ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ తెచ్చుకుంటే మన బతుకులు మారుతాయని అనుకున్న ప్రతివర్గం అనిశ్చితిలో కొట్టుమిట్టాడుతోందని అన్నారు. స్వరాష్ట్ర సాధనకు అవిశ్రాంతంగా ఉద్యమించిన మనం తెలంగాణ పునర్నిర్మాణం, సబ్బండ వర్గాల వికాసం కోసం ఉద్యమించాల్సిన సమయం వచ్చిందని తెలిపారు. అందుకే తెలంగాణ రక్షణ సేన జెండా ను ప్రతి వాడకు, పార్టీ సిద్ధాంతాలను ప్రతి గడపకు తీసుకెళ్లాల్సి ఉందన్నారు. పార్టీ ఆవిర్భావానికి మూడు నెలల ముందు నుంచే పెద్ద ఎత్తున మనతో చేరిన నాయకత్వంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న తెలంగాణ జాగృతి నాయకత్వం జెండా పండుగను విజయవంతం చేయాలని ఈ సందర్భంగా కవిత పిలుపునిచ్చారు.

## రూ.2 కోట్ల విలువైన 400 కిలోల గంజాయి

- **సీజ్.. అంతర్రాష్ట్ర ముఠా అరెస్ట్**

**హైదరాబాద్ వెలుతురు మే 11:**
రాష్ట్రాల సరిహద్దులు దాటి గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్న భారీ గంజాయి అక్రమ రవాణాను సైబరాబాద్ పోలీసులు గుట్టురట్టు చేశారు. పక్కా సమాచారంతో కూకట్‌పల్లి ఎస్‌వోటీ బృందం, పటాన్‌చెరు పోలీసులతో కలిసి దాడులు చేశారు. రూ.2 కోట్ల విలువైన 400 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కేసులో ఏడుగురు నిందితులను అరెస్ట్ చేయగా, మరో ఇద్దరు పరారీలో ఉన్నారు. సోమవారం శేరిలింగంపల్లి డీసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డీసీపీ శ్రీనివాస్ వివరాలు వెల్లడించారు.
మహారాష్ట్రకు చెందిన మనీషా పద్వాల్ గంజాయి వ్యాపారంలో భారీ లాభాలు గడించాలనే ఉద్దేశంతో ఒడిశాకు చెందిన సరఫరాదారు ట్రిబ్యూన్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. వీరిద్దరికీ ప్రతాప్ హరిదాస్ పవార్(24) మధ్యవర్తిగా వ్యవహరిస్తున్నాడు. ఈ నెల 8న మహారాష్ట్ర నుంచి నిందితులు డీసీఎం వాహనంలో ఒడిశాలోని మల్కన్‌గిరికి గంజాయి కోసం బయలుదేరారు. కాగా సరఫరాదారు ట్రిబ్యూన్.. ప్రతాప్‌కు ఫోన్ చేసి గంజాయి రాజమండ్రి చేరుకుందని.. అక్కడి నుంచి తీసుకెళ్లాలని చెప్పడంతో నిందితులు అక్కడికి చేరుకొని అనుమానం రాకుండా డీసీఎంలో లోడ్ చేశారు. దానిపై ఖాళీ కూరగాయల ప్లాస్టిక్ ట్రేలను పేర్చారు. కారును ఎస్కార్ట్‌గా వాడుతూ నగరానికి చేరుకొని, ఔటర్ రింగ్ రోడ్ మీదుగా మహారాష్ట్రకు తరలిస్తుండగా.. సోమవారం ఉదయం ముత్తంగి వద్ద కూకట్‌పల్లి ఎస్‌వోటీ, పటాన్‌చెరు పోలీసులు మాటు వేసి పట్టుకున్నారు.

**అరెస్టయిన నిందితులు**
మహారాష్ట్రకు చెందిన ప్రతాప్ హరిదాస్ పవార్, డీసీఎం యజమాని ఆనంద్ మాయప్ప హోవల్(34), కారు యజమాని బాలాజీ గణేశ్ హోన్మణి(35), డీసీఎం డ్రైవర్లు రోహిత్ హోవల్ (27), చందన్‌శివే ఔదుంబర్(46), రంజిత్ రాజేందర్ గడగే(27)తో పాటు బాలుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. కాగా పరారీలో ఉన్న ప్రధాన నిందితులు మనీషా, ట్రిబ్యూన్ కోసం పోలీసులు గాలిస్తున్నారు. గంజాయితో పాటు డీసీఎం, కారు, ఆరు సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన నిందితులు గంజాయి రవాణాకు సంబంధించిన లావాదేవీలను హవాలా రూపంలో నిర్వహిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. సరకు పట్టుకోవడంలో కీలకంగా వ్యవహరించిన పోలీసులను డీసీపీ అభినందించారు. సమావేశంలో ఎస్‌వోటీ డీసీపీ పి. శోభన్‌కుమార్, అడిషనల్ డీసీపీ విశ్వప్రసాద్, ఏసీపీ శ్రీనివాస్, పటాన్‌చెరు ఇన్‌స్పెక్టర్ జి.వినాయక్‌రెడ్డి, డీఐ బి.రాజు తదితరులు పాల్గొన్నారు.



## భార్యను పశువులా చూడొద్దు: గృహహింస కేసులో సుప్రీం తీవ్ర వ్యాఖ్యలు

హైదరాబాద్ వెలుతురు మే 11:

గృహహింస కేసు విచారణలో భాగంగా సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. భార్యను భర్త పశువులా చూడకూడదని, ఆమెకు గౌరవంతో జీవించే హక్కు ఉందని స్పష్టం చేసింది. గృహహింస ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తి ముందస్తు బెయిల్ కోసం వేసిన పిటిషన్‌ను అత్యున్నత న్యాయస్థానం విచారించింది. అనంతరం అతడి అభ్యర్థనను తోసిపుచ్చింది. గతంలో పట్నా హైకోర్టు కూడా ఆ బెయిల్ పిటిషన్‌ను తిరస్కరించింది.
నిందితుడు మద్యం మత్తులో దాడి చేశాడని బాధితురాలి తరపు న్యాయవాది కోర్టులో వాదనలు వినిపించారు. నేలపైకి తోయడంతో ఇటుక తగిలి ఆమె తలకు గాయమైంది. ఆ తర్వాత కర్రతో కూడా దాడి చేసినట్లు ఆరోపణలున్నాయి. మరోవైపు నిందితుడు మూడు వివాహాలు చేసుకోగా.. న్యాయస్థానాన్ని ఆశ్రయించిన బాధితురాలు మొదటి భార్య. వాదనలు విన్న న్యాయస్థానం.. "మీరు మీ భార్యను ఎందుకు కొట్టాలనుకున్నారు..? ఇలాగే వేధిస్తే.. ఆమె మిమ్మల్ని వదిలి వెళ్లిపోతుంది. రెగ్యులర్ బెయిల్ కోసం దరఖాస్తు చేసుకోండి" అంటూ ముందస్తు బెయిల్ పిటిషన్‌ను తిరస్కరించింది.



# కేరళ సీఎం ఎంపికలో వీడని ఉత్కంఠ

- హైదరాబాద్, బ్యూరో డెస్క్ మే 11 (వెలుతురు):





కేరళలో ముఖ్యమంత్రి ఎంపికపై కాంగ్రెస్ ఇంకా తుది నిర్ణయం తీసుకోకపోవడంతో రాజకీయంగా ఉత్కంఠభరిత పరిస్థితి నెలకొంది. మల్లికార్జున్ ఖర్గే నేతృత్వంలోని పార్టీ హైకమాండ్ వరుస సమావేశాలు నిర్వహిస్తున్నప్పటికీ సోమవారం కూడా నిర్ణయం వెలువడలేదు. తాజా ఎన్నికల తర్వాత సీఎం ఎంపికలో అనిశ్చితి నెలకొన్న ఏకైక రాష్ట్రంగా కేరళ నిలవడం గమనార్హం. తుది నిర్ణయానికి ముందుగా మాజీ కేపీసీసీ అధ్యక్షులతో చర్చలు జరపాలని పార్టీ నిర్ణయించింది. ఈ నేపథ్యంలో ఎం.ఎం. హసన్, వి.ఎం. సుధీరణ్, ముల్లపల్లి రామచంద్రన్, కె. మురళీధరన్, అలాగే కన్నూర్ ఎంపీ కే. సుధాకరన్‌లను ఢిల్లీకి పిలిపించారు. అదేవిధంగా మాజీ రక్షణ మంత్రి, సీనియర్ నేత ఏ . కే . ఆంటోనీ తో కూడా సంప్రదింపులు జరిపి ఒకటి రెండు రోజుల్లో నిర్ణయం తీసుకునే యోచనలో హైకమాండ్ ఉంది. ఇదిలా ఉండగా, రాహుల్ గాంధీ సమక్షంలో ఇప్పటికే ముగ్గురు ప్రధాన అభ్యర్థులతో చర్చలు పూర్తయ్యాయి. వీరిలో సీనియర్ నేత రమేష్ చెన్నితల , ఏఐసీసీ జనరల్ సెక్రటరీ కేసీ. వేణుగోపాల్ , ప్రతిపక్ష నేత వి. డి. సతీషన్ ఉన్నారు. సమావేశానికి కేపీసీసీ అధ్యక్షుడు సన్నీ జోసఫ్, రాష్ట్ర ఇన్‌చార్జ్ దీపా దాస్ మున్షీ కూడా హాజరయ్యారు. అయినప్పటికీ స్పష్టత రాకపోవడం పార్టీ లోపల అనిశ్చితిని కొనసాగిస్తోంది. ఈ ఆలస్యంపై కాంగ్రెస్ ప్రధాన మిత్రపక్షం ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్(IUML) తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఆ పార్టీ నేత అబ్దుల్ హమీద్ మాట్లాడుతూ నిర్ణయం ఇప్పటికే ఆలస్యమైందని, మరింత వాయిదా పడితే రాజకీయ ప్రభావాలు తప్పవని హెచ్చరించారు. పార్టీ కార్యకర్తలు, ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోందని, మహిళలు కూడా 'ఎందుకు యూడీఎఫ్‌కు ఓటు వేయమన్నారు?' అని ప్రశ్నిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. వివాహాలు, అంత్యక్రియలు వంటి ప్రతి చోటా ఇదే చర్చ జరుగుతోందని అన్నారు.పార్టీ వర్గాల ప్రకారం, గత వారం సతీశన్, వేణుగోపాల్ అనుచరుల మధ్య నిరసనలు, పోస్టర్ వార్‌లు జరిగిన నేపథ్యంలో రాష్ట్రంలో రాజకీయ వాతావరణం చల్లబడిన తర్వాతే నిర్ణయం ప్రకటించాలని హైకమాండ్ భావిస్తోంది. కేరళ రాజకీయంగా ఉత్తర భారత రాష్ట్రాల కంటే భిన్నమని, ఇలాంటి ఆలస్యం అక్కడి ప్రజలు సహించరని IUML స్పష్టం చేసింది. ఇక కాంగ్రెస్ వర్గాల్లో మాత్రం అసెంబ్లీ గడువు మే 23 వరకు ఉండటంతో తొందర అవసరం లేదనే భావన వ్యక్తమవుతోంది. ఒక సీనియర్ నేత 'ఇంకా సమయం ఉంది, ఎందుకు ఆందోళన?' అని వ్యాఖ్యానించారు. రమేష్ చెన్నితల మాట్లాడుతూ హైకమాండ్ తీసుకునే నిర్ణయాన్ని అందరూ అంగీకరిస్తారని, ఇది ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగమని తెలిపారు. కాంగ్రెస్‌లో సీఎం ఎంపిక ఆలస్యం కావడం ఇదే మొదటిసారి కాదు. 2023 కర్ణాటక ఎన్నికల సమయంలో సిద్దారమయ్య , డి . కె . శివకుమార్ మధ్య తీవ్ర పోటీ నెలకొని, చివరకు రాజీ ఫార్ములాతో సిద్ధరామయ్యకు సీఎం పదవి, శివకుమార్‌కు డిప్యూటీ సీఎం పదవి ఇచ్చారు. అలాగే 2018లో మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో కూడా ఇలాంటి లాబీయింగ్, ఆలస్యం చోటుచేసుకుంది. మధ్యప్రదేశ్‌లో కమల్ నాథ్ ఎంపిక కాగా, రాజస్థాన్‌లో అశోక్ గేహ్లోట్ సీఎం అయ్యి సచిన్ పైలట్ డిప్యూటీగా నియమితులయ్యారు. ఇక బీజేపీ విమర్శలపై చెన్నితల స్పందిస్తూ, ఢిల్లీ ఎన్నికల తర్వాత బీజేపీ కూడా సీఎం ఎంపికలో ఆలస్యం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఇదిలా ఉండగా, సీనియర్ నేత కె. మురళీధరన్ పరిస్థితిని 'రైలు ప్రయాణం'తో పోలుస్తూ—గమ్యస్థానానికి చేరిన తర్వాతే దిగగలమని, మధ్యలో తొందరపడటం ప్రయోజనం లేదని వ్యాఖ్యానించారు. అయితే ఈ ఆలస్యం ప్రజల్లో అసౌకర్యం కలిగించిందని ఆయన అంగీకరించారు. కేరళ అసెంబ్లీలో మొత్తం 140 స్థానాల్లో కాంగ్రెస్‌కు 63 ఎమ్మెల్యేలు ఉండగా, IUMLకు 22, కేరళ కాంగ్రెస్‌కు 8, ఆర్ఎస్‌పీకి 3 స్థానాలు లభించాయి. మొత్తం యూడీఎఫ్ 102 స్థానాలతో రెండు మూడవ వంతు మెజారిటీ సాధించింది. ఈ నేపథ్యంలో సీఎం ఎంపికలో IUML అభిప్రాయం కీలకంగా మారింది.

# అమెరికా దేశానికి బయపడుతున్న భారత ప్రభుత్వం

- **రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రసన్నకుమార్ శర్మ**

హైదరాబాద్ వెలుతురు మే 11:

ఆదివారం సాయంత్రం హైద్రాబాద్ లో పర్యటించిన భారత ప్రధాని మోడి గారు మాట్లాడుతూ దేశ ప్రజలకు ఒక ఉచిత సలహాలు ఇవ్వడం ద్వారా దేశ ప్రజల మనోభావాలను దెబ్బ తీసేలా ఉందని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రసన్నకుమార్ శర్మ విమర్శించారు.పేద మరియు మధ్యతరగతి ప్రజలకు భరోసా కల్పించేది లేదని వారు ఖర్చులు తగ్గించుకోవాలని,కడుపు నిండా భోజనం తినొద్దు ,మంచి నునె తక్కువ తినాలని ,బంగారు ఆభరణాలు కొనుగోలు చేయవద్దని మంచి బట్టలు కొనవద్దని,మధ్యతరగతి ప్రజలు తమ ఇంట్లో జరిగే శుభకార్యాలు సాదాసీదాగా జరపాలని, రైల్వే మరియు బస్సుల్లో మాత్రమే ప్రయాణం చేయాలని,తాను మాత్రం ప్రజల సమస్యలను పట్టించుకోకుండా ప్రజల ధనాన్ని వృధా చేసి దేశ, విదేశాల్లో షికార్లు చేస్తున్నాడు.
ఎన్నికలు ముగిసిన తర్వాత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రజలకు ఇలా చెప్పారు.

- ఇంటి నుంచే పని చేయండి
- మెట్రోలో ప్రయాణించండి
- పెట్రోల్, డీజిల్ ఆదా చేయండి
- బంగారం కొనొద్దు
- విదేశాలకు వెళ్లొద్దు
- విదేశీ బ్రాండ్ల వస్తువులు కొనొద్దు
- వంట నూనె తక్కువగా వాడండి
- పొలాల్లో ఎరువులు తక్కువగా వేయండి

ఇది ఎలాంటి మంచిసలహా కాదు, భావోద్వేగ పిలుపు కూడా కాదు. ఇది అసలు చూస్తే మోదీ గారు మరియు వారి ప్రభుత్వ వైఫల్యానికి ప్రత్యక్ష నిదర్శనం.దేశానికి అవసరమైన ఇంధన భద్రతను ఏర్పాటు చలేకపోయారు, రూపాయి విలువను కాపాడలేకపోయారు, ఇంధన కొరతతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు — ఎన్నికలు ముగిసిన తర్వాత ఈ నిజాన్ని ఒప్పుకోవాల్సిన పరిస్థితి వచ్చింది.
ఈ పరిస్థితి గురించి రాహుల్ గాంధీ గారు మార్చి నెలలోనే మోదీ గారిని హెచ్చరించారు. ఇంధన కొరత గురించి ముందుగానే సూచించారు. కానీ ఆయన మాటలను పట్టించుకోకపోవడం వల్లే నేడు ఈ పరిస్థితి ఏర్పడింది.
అయితే కపటత్వానికీ ఒక హద్దు ఉంటుంది. దేశ ప్రజలకు పెట్రోల్, డీజిల్ ఆదా చేయమని చెప్పే మోదీ గారు తానే భారీ కాన్వాయ్‌లతో అవసరం లేని రోడ్ షోలు చేస్తున్నారు. ప్రజలకు విదేశీ ప్రయాణాలు చేయొద్దని చెబుతూ, తానే



వేడిని తప్పించుకోవడానికి ఈ నెల 15వ తేదీన యూరప్‌కు వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు.
12 సంవత్సరాలుగా అధికారంలో ఉన్న తర్వాత, నేడు దేశ ప్రజలకు ఏమి కొనాలి, ఏమి కొనకూడదు, ఎలా ప్రయాణించాలి, ఎక్కడికి వెళ్లాలి, ఎక్కడికి వెళ్లకూడదు అని చెప్పాల్సిన పరిస్థితి రావడం విచారకరం.ఇలాంటి "అచ్చే దిన్" మాకు అవసరం లేదు మోదీ గారు. మీరు అయితే చివరికి జోలె పట్టుకుని వెళ్లిపోవచ్చు — కానీ దేశాన్ని దెబ్బతీయడంలో మాత్రం ఎలాంటి లోటు చేయలేదు.
ఇది మీరు రాజీపడిన నాయకత్వానికి ఫలితం — ఇప్పుడు ఈ దేశాన్ని నడిపించడం మీ వల్ల కావడం లేదు.



# ఇజ్రాయెల్ ఐరన్ డోమ్ ధ్వంసం



ఇజ్రాయెల్ వెలుతురు మే 11:

ఇజ్రాయెల్‌కు చెందిన అత్యాధునిక గగనతల రక్షణ వ్యవస్థ 'ఐరన్ డోమ్'పై హెజ్‌బొల్లా దాడి చేయడం అంతర్జాతీయంగా చర్చనీయాంశమైంది. ఈ దాడికి సంబంధించిన వీడియోను హెజ్‌బొల్లా తాజాగా విడుదల చేసింది. ఇజ్రాయెల్ ఉత్తర సరిహద్దు ప్రాంతంలో మోహరించిన ఐరన్ డోమ్ బ్యాటరీని లక్ష్యంగా చేసుకుని ఫస్ట్ పర్సన్ వ్యూ (ఎఫ్‌పీవీ) డ్రోన్‌తో దాడి నిర్వహించినట్లు తెలిపింది. సాధారణంగా ఐరన్ డోమ్ వ్యవస్థ శత్రు రాకెట్లు, క్షిపణులను గాల్లోనే గుర్తించి కూల్చివేయడంలో ప్రపంచంలోనే అత్యంత సమర్థవంతమైన రక్షణ వ్యవస్థగా గుర్తింపు పొందింది. అయితే ఈసారి హెజ్‌బొల్లా వినియోగించిన చిన్న ఎఫ్‌పీవీ డ్రోన్లు ఇజ్రాయెల్ రాడార్ వ్యవస్థలకు చిక్కకుండా చాకచక్యంగా ముందుకు సాగినట్లు తెలుస్తోంది. ఈ డ్రోన్లు పరిమాణంలో చాలా చిన్నగా ఉండటంతో వాటిని గుర్తించడం ఐడీఎఫ్ (ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్)కు కష్టంగా మారింది. అంతేకాకుండా ఈ డ్రోన్లను ప్రత్యేక కేబుల్స్ ద్వారా నియంత్రించడంతో.. ఇజ్రాయెల్ ఉపయోగించే ఎలక్ట్రానిక్ జామింగ్ టెక్నాలజీ కూడా వాటిపై ప్రభావం చూపలేకపోయిందని సమాచారం. సాధారణంగా రేడియో సిగ్నల్స్ ఆధారంగా పనిచేసే డ్రోన్లను జామ్ చేయడం సాధ్యపడుతుంది. కానీ వైర్‌గైడెడ్ సిస్టమ్‌తో పనిచేసే ఈ ఎఫ్‌పీవీ డ్రోన్లు ఆ రక్షణ వ్యవస్థలను దాటేశాయి. విడుదలైన వీడియోలో ఒక డ్రోన్ నేరుగా ఐరన్ డోమ్ బ్యాటరీని ఢీకొట్టినట్లు కనిపిస్తోంది. దాంతో భారీ పేలుడు సంభవించి రక్షణ వ్యవస్థ దెబ్బతిన్నట్లు హెజ్‌బొల్లా పేర్కొంది. అయితే ఈ ఘటనపై ఇజ్రాయెల్ అధికారికంగా పూర్తి వివరాలు వెల్లడించలేదు. ఇటీవల కాలంలో మధ్యప్రాచ్యంలో యుద్ధ పరిస్థితులు మరింత ఉద్రిక్తంగా మారుతున్నాయి. ముఖ్యంగా లెబనాన్‌కు చెందిన హెజ్‌బొల్లా, ఇజ్రాయెల్ మధ్య తరచూ డ్రోన్ దాడులు, రాకెట్ దాడులు జరుగుతున్నాయి. ఆధునిక యుద్ధాల్లో చిన్న డ్రోన్లు కూడా ఎంతటి భారీ రక్షణ వ్యవస్థలకు సవాల్ విసరగలవో ఈ ఘటన మరోసారి చూపించిందని రక్షణ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## జన గణన ఫారంలో బీసీల గుర్తింపు చేర్చాలి

హైదరాబాద్ వెలుతురు మే 11:

కేంద్ర ప్రభుత్వం చేపట్టనున్న జనగణనలో గృహాల ఐడెంటిఫికేషన్ సర్వేలో బీసీలను కూడా చేర్చాలని తెలంగాణ ప్రభుత్వం కేంద్రానికి విజ్ఞప్తి చేసింది. జనగణన ఫారంలో ఉన్న కాలమ్ 13లో ఎస్సీ, ఎస్టీల మాదిరిగానే బీసీల గృహాల గుర్తింపు అంశాన్ని పొందుపరచాలని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు. ఈ విషయంపై హైదరాబాద్ పర్యటనకు వచ్చిన ప్రధాన మంత్రి నరేంద్ర మోడీని కలిసి విజ్ఞప్తి చేసినట్లు ఆయన తెలిపారు. ఈ ప్రతిపాదనపై ప్రధాని సానుకూలంగా స్పందించినట్లు మంత్రి వెల్లడించారు. "చూస్తామన్నారు" అని ఆయన వ్యాఖ్యానించినట్లు పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా జరగనున్న జనగణనకు కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే ఆమోదం తెలిపిందని, హౌజ్‌హోల్డర్ సర్వేలో బీసీలకు ప్రత్యేక గుర్తింపు అంశాన్ని చేర్చడం అవసరమని రాష్ట్ర ప్రభుత్వం అభిప్రాయపడుతోందని మంత్రి తెలిపారు. ఈ విషయంలో తెలంగాణ బీజేపీ నేతలు కూడా చొరవ తీసుకుని కేంద్రంపై ఒత్తిడి చేయాలని ఆయన కోరారు.



## తెలంగాణ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్‌గా గద్వాల విజయలక్ష్మి


- **మహిళా కమిషన్‌కు ఛైర్‌పర్సన్, ఆరుగురు సభ్యుల నియామకం**
- **ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం**



**హైదరాబాద్ వెలుతురు మే 11:** తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్‌గా గద్వాల విజయలక్ష్మిని రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు కమిషన్‌కు ఛైర్‌పర్సన్‌తో పాటు ఆరుగురు సభ్యులను నియమిస్తూ ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. కమిషన్ సభ్యులుగా శ్రీకాంతాచారి తల్లి కాసోజు శంకరమ్మ, చాకలి ఐలమ్మ మనవరాలు చిట్యాల శ్వేతతో పాటు శశికళ యాదవరెడ్డి, సదాలక్ష్మి, రాధాబాయి, ఉజ్మా షకీరా నియమితులయ్యారు. రాష్ట్ర మహిళల హక్కుల పరిరక్షణ, సమస్యల పరిష్కారం, మహిళా సంక్షేమానికి సంబంధించిన అంశాలపై కమిషన్ పని చేయనుంది. ఈ మహిళా కమిషన్ పదవీకాలం ఐదేళ్లపాటు కొనసాగనుందని ప్రభుత్వం పేర్కొంది.

## నైరుతి బంగాళాఖాతంలో అల్పపీడనం

- **48 గంటల్లో మరింత బలోపేతం**
- **రానున్న 3 రోజుల్లో ఏపీ లోని పలు ప్రాంతాల్లో మోస్తరు నుండి భారీ వర్షా లు కురిసే అవకాశం**



**హైదరాబాద్, మే 11 (వెలుతురు ):** నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కొనసాగుతోంది. దీనికి అనుబంధంగా సముద్ర మట్టానికి సుమారు 5.8 కిలోమీటర్ల ఎత్తు వరకు ఉపరితల ఆవర్తనం వ్యాపించి ఉందని వాతావరణ కేంద్రం వెల్లడించింది. దీని ప్రభావంతో సముద్రంలో అలజడి నెలకొనడంతో పాటు, తీర ప్రాంతాల్లో గాలుల తీవ్రత పెరిగే అవకాశం ఉందని హెచ్చరించింది. రానున్న 48 గంటల్లో ఈ అల్పపీడనం మరింత బలపడి, పశ్చిమ దిశగా కదిలే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. దీని ఫలితంగా రాగల రెండు, మూడు రోజుల్లో కోస్తా ఆంధ్ర, రాయలసీమలోని పలు ప్రాంతాల్లో మోస్తరు నుండి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. రైతులు, మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ హెచ్చరించింది.

## నేడు నర్సింగ్ ఆఫీసర్ ఉద్యోగాలకు ఎంపికైన నర్సులకు అపాయింట్‌మెంట్ ఆర్డర్స్

- **ఉస్మానియా మెడికల్ కాలేజీ గ్రౌండ్స్‌లో అందించనున్న మంత్రి దామోదర**



**హైదరాబాద్, మే 11 (వెలుతురు):** నర్సింగ్ ఆఫీసర్ ఉద్యోగాలకు ఎంపికైన నర్సులకు మంగళవారం ఇంటర్నేషనల్ నర్సెస్ డే సందర్భంగా ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అపాయింట్‌మెంట్ ఆర్డర్స్ అందజేయనున్నారు. కోటిలోని ఉస్మానియా మెడికల్ కాలేజీ గ్రౌండ్స్‌లో సాయంత్రం 5 గంటలకు ఈ కార్యక్రమం జరగనుంది. అపాయింట్‌మెంట్ ఆర్డర్స్ అందుకోబోతున్న నర్సులకు ఇబ్బంది కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టినా జడ్ చొంగ్తు, ఉన్నతాధికారులను మంత్రి ఆదేశించారు. ఆరోగ్యశాఖలో 1919, లేబర్ డిపార్ట్‌మెంట్‌లో 257 నర్సింగ్ ఆఫీసర్ పోస్టులను మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు భర్తీ చేసింది. ఇందులో ఆరోగ్యశాఖలో ఉద్యోగాలు పొందిన 1919 మందికి మంగళవారం అపాయింట్‌మెంట్లు అందజేయ

## ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియ వేగవంతం చేయాలి

- **నెలాఖరు నాటికి 90 శాతం మ్యాపింగ్ పూర్తి చేయాలని కలెక్టర్లకు ఆదేశాలు**
- **గేటెడ్ కమ్యూనిటీలు, స్లమ్ ప్రాంతాల్లో ప్రత్యేకంగా మ్యాపింగ్ చేపట్టాలని సూచన**



**హైదరాబాద్, మే 11 (వెలుతురు) :** భారత ఎన్నికల సంఘం చేపట్టనున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (SIR) కార్యక్రమంపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి సోమవారం జిల్లా ఎన్నికల అధికారులు, ఎన్నికల నమోదు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేసి ఈ నెలాఖరు నాటికి 90 శాతం పురోగతి సాధించాలని కలెక్టర్లు, DEOలకు ఆదేశించారు. రెసిడెన్షియల్ అసోసియేషన్లు, గేటెడ్ కమ్యూనిటీలు, స్వయం సహాయక సంఘాలు, రేషన్ డీలర్లు తదితరులను ఈ ప్రక్రియలో భాగస్వామ్యం చేయాలని సూచించారు. మరణించిన, వలస వెళ్లిన, చిరునామా మార్చుకున్న ఓటర్ల వివరాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, VIP, VVIP ఓటర్ల మ్యాపింగ్ కూడా చేపట్టాలని తెలిపారు. అలాగే ప్రతి బుధవారం రాజకీయ పార్టీలతో సమావేశాలు నిర్వహించి పురోగతిని సమీక్షించాలని ఆదేశించారు. అనధికార వ్యక్తులతో OTPలు లేదా ఓటర్ల సమాచారం పంచుకోవద్దని BLOలకు హెచ్చరిక జారీ చేసిన సీఈఓ, తప్పుగా జరిగిన మ్యాపింగ్‌లను వెంటనే సరిచేయాలని సూచించారు.

## మోడీ వ్యాఖ్యలు కేంద్ర ఆర్థిక విదేశాంగ విధానాలు, పాలన వైఫల్యానికి అద్దం

- **సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు**



**హైదరాబాద్, మే 11 (వెలుతురు):** వంట నూనె, పెట్రోలు, డీజిల్ వాడకం తగ్గించాలి, బంగారం కొనొద్దు అంటూ ప్రధాన మంత్రి మోదీ హైదరాబాద్ చేసిన వ్యాఖ్యలు కేంద్ర ప్రభుత్వ ఆర్థిక, విదేశాంగ విధానాలు వారి పాలన వైఫల్యానికి అద్దం పడుతుందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ధ్వజమెత్తారు. వాటిని కప్పిపుచ్చుకొని, దేశ ప్రజల దృష్టి మళ్ళించేందుకే మతం పేరుతో రెచ్చగొట్టే విధంగా హైదరాబాద్ సభలో ఒక ప్రధానిగా ప్రసంగించడం విచారకరమని విమర్శించారు. ఇప్పటికే ధరల భారంతో సతమతమవుతున్న సామాన్యుల నడ్డివిరిచే రీతిలో త్వరలో ధరల పెంపును ఆయన పరోక్షంగా సంకేతాలిచ్చారని సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధానికి చిత్తశుద్ధే ఉంటే దేశ ప్రజలకు పొదుపు చర్యలను సూచించే ముందు, దేశంలో శతకోటీశ్వరులపై 2 నుంచి 6 శాతం సంపద పన్ను విధిస్తే లక్షల కోట్ల నిధులు సమకూరుతాయని పేర్కొన్నారు. తెలంగాణలో వచ్చేది బిజెపి ప్రభుత్వమేనని చేసిన ప్రకటన కలగానే మిగిలపోవడం ఖాయమన్నారు. మతరాజకీయాలను ప్రగతిశీల తెలంగాణ నేల ఎన్నటికీ అనుమతించదని అభిప్రాయపడ్డారు. విభజన చట్టంలోని కాజీపేట కోచ్ బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, నియోజకవర్గాల పెంపు, ఒక ప్రాజెక్టుకు జాతీయ హోదా వంటి హామీలను 12 ఏళ్ళైనా నెరవేర్చని కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపిని తెలంగాణ ప్రజలు ముమ్మాటికీ విశ్వసించబోరన్నారు. మావోయిస్టులను అంతమొందించటమే పరిష్కారమన్నట్లుగా ప్రధాని మాట్లాడడాన్ని ఖండిస్తున్నామని తెలిపారు.

## కాగజ్‌నగర్లో రాజకీయ సెగ

- **సామాన్యుడికి ఒక న్యాయం.. బీఆర్ఎస్ నేతలకు ఒక న్యాయమా..?**
- **బీఆర్ఎస్ నేతలు దళితుణ్ణి అవమానించేలా మాట్లాడరని ఆరోపణలు.**
- **తక్షణమే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలనీ కాంగ్రెస్ కార్యకర్తలు డిమాండ్**



**కాగజనగర్, మే 11 (వెలుతురు):** రాష్ట్రవ్యాప్తంగా ఎండలు సెగలు రేపుతుంటే కాగజ్‌నగర్ పట్టణంలో మాత్రం రోడ్డు విస్తరణ పనులు రాజకీయంగా సెగను రేపాయి. సామాన్యుడికి ఒక న్యాయం.. బీఆర్ఎస్ నేతలకు ఒక న్యాయమా..? అని కాంగ్రెస్ నేతలు ప్రశ్నించారు. కాంగ్రెస్ శ్రేణులు గర్జించడంతో రైల్వే ఓవర్ బ్రిడ్జి పరిసర ప్రాంతం ఒక్కసారిగా అట్టుడికింది. అభివృద్ధి పనులను అడ్డుకుంటున్న బీఆర్ఎస్ నాయకుల తీరు పై నిరసనలు మిన్నంటాయి. పట్టణ సుందరీకరణలో భాగంగా సోమవారం రైల్వే ఓవర్ బ్రిడ్జి పక్కన అధికారులు రోడ్డు విస్తరణ పనులు చేపట్టారు. తమకు అనుకూలంగా ఉన్న చోట ఒకలా, ఇతరుల వద్ద మరోలా వ్యవహరిస్తున్నారని ఇరు వర్గాల మధ్య వాగ్వాదం మొదలైంది. ఇది కాస్తా ముదిరి బీఆర్ఎస్, కాంగ్రెస్ కౌన్సిలర్ల మధ్య పరస్పర దూషణలు, తోపులాటకు దారితీసింది. రోడ్డు విస్తరణలో అందరికీ సమాన న్యాయం ఉండాలని, అధికార అండతో పనులను అడ్డుకోవడం అన్యాయమని కాంగ్రెస్ నాయకులు ధ్వజమెత్తారు. వాగ్వాదం సమయంలో బీఆర్ఎస్ నాయకులు హద్దులు దాటి ప్రవర్తించారని, దళిత సామాజిక వర్గానికి చెందిన వారిని అవమానించేలా మాట్లాడారని ఆరోపిస్తూ.. వారిపై తక్షణమే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. పోలీసుల వైఖరిని నిరసిస్తూ కాంగ్రెస్ నాయకులు, కౌన్సిలర్లు ప్రధాన రహదారిపై బైఠాయించారు. దీంతో వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయి, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో రంగంలో దిగిన పోలీసులు చేరుకున్నారు. ఇరువర్గాలకు నచ్చజెప్పి ఆందోళన విరమింపజేసినప్పటికీ, లోలోపల ఉద్రిక్తత ఇంకా కొనసాగుతూనే ఉంది. రోడ్డు వెడల్పు అయితే పట్టణానికే మంచిది. ఇలాంటి పనుల్లో రాజకీయ రంగు పులుముకుని గొడవలు చేయడం వల్ల అభివృద్ధి కుంటుపడుతుంది అని, అభివృద్ధికి అడ్డుపడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, రాజకీయ ఒత్తిళ్లకు లొంగకుండా అధికారులు పనులు పూర్తి చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

## కొహెడ ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణానికి చర్యలు వేగవంతం

- **కొహెడ ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణానికి చర్యలు వేగవంతం**
- **డిసెంబర్ 9 నుంచి సేవలు అందుబాటులోకి వచ్చేలా చర్యలు**
- **3 దశలలో ప్రాజెక్టును పూర్తి చేసేలా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం**
- **సమగ్ర మార్కెట్‌ను అత్యాధునిక సదుపాయాలతో అభివృద్ధి**
- **వివరాలు వెల్లడించిన మంత్రి తుమ్మల**



**హైదరాబాద్, మే 11 (వెలుతురు ):** రాష్ట్రంలో వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ వ్యవస్థను ఆధునీకరించే దిశగా కీలకంగా భావిస్తున్న కొహెడ సమగ్ర మార్కెట్ నిర్మాణ పనులు తుది దశలోకి చేరుకున్నాయని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత మరియు జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు కొహెడ సమగ్ర మార్కెట్‌కు సంబంధించిన సవరించిన లేఅవుట్‌పై మార్కెటింగ్ అధికారులతో సోమవారం సచివాలయంలో సమగ్ర సమీక్ష నిర్వహించిన మంత్రి తుమ్మల... రైతులు, వ్యాపారులు మరియు ఇతర భాగస్వాముల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రాజెక్టు రూపకల్పనను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దినట్లు వెల్లడించారు. ప్రాజెక్టును 3 దశలలో పూర్తి చేసేలా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసినట్లు మంత్రి తెలిపారు. తొలి దశ నిర్మాణ పనులను నిర్ణీత గడువులో పూర్తి చేసి, ఈ ఏడాది డిసెంబర్ 9న మార్కెట్‌ను రైతులకు అందుబాటులోకి తీసుకొచ్చేలా లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. ప్రస్తుతం బాటసింగారం మార్కెట్‌లో కొనసాగుతున్న లావాదేవీలను కొహెడ సమగ్ర మార్కెట్‌కు సాఫీగా తరలించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని మంత్రి తెలిపారు. రైతులు, వ్యాపారులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా సమన్వయంతో తరలింపు ప్రక్రియను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. డిసెంబర్ 9 నుంచే కొహెడ మార్కెట్‌లో లావాదేవీలు ప్రారంభమయ్యేలా చర్యలు చేపడుతున్నామని చెప్పారు.

కొహెడ సమగ్ర మార్కెట్‌ను అత్యాధునిక సదుపాయాలతో అభివృద్ధి చేస్తున్నామని మంత్రి తెలిపారు. ఓపెన్ ప్లాట్‌ఫారాలు, ట్రక్ డాకింగ్ షెడ్లు, డ్రైయింగ్ యార్డులు, విశాల రహదారులు, రవాణా సౌకర్యాలు, పారదర్శక లావాదేవీల కోసం సాంకేతిక వసతులు, రైతులకు అవసరమైన అన్ని సేవలను అందుబాటులో ఉంచేలా ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని పేర్కొన్నారు. ఈ సమగ్ర మార్కెట్ ద్వారా రైతులకు తమ ఉత్పత్తులకు మెరుగైన ధరలు లభించడంతో పాటు, మధ్యవర్తుల ప్రభావం తగ్గి, పారదర్శక మార్కెటింగ్ వ్యవస్థ ఏర్పడుతుందని మంత్రి అభిప్రాయపడ్డారు. రాష్ట్ర వ్యవసాయ రంగ అభివృద్ధిలో కొహెడ సమగ్ర మార్కెట్ మైలురాయిగా నిలుస్తుందని తెలిపారు. మొత్తం ప్రాజెక్టును నిర్ణీత సమయంలో పూర్తి చేయడానికి సంబంధిత అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని మంత్రి తెలిపారు. ప్రాజెక్టుకు సంబంధించిన తుది ప్రతిపాదనను గౌరవ ముఖ్యమంత్రికి ఆమోదం కోసం సమర్పిస్తున్నామని వెల్లడించారు

## విద్యుత్ సంస్థల నియామకాలలో రిజర్వేషన్ల అమలుపై బీసీ కమిషన్ విచారణ

- **2014 నుంచి జరిగిన నియామకాల విధానాలపై ఆరాతీసిన కమిషన్**
- **బీసీలకు జరుగుతున్న అన్యాయాలపై ఉద్యోగుల సంఘం ఫిర్యాదు**



**హైదరాబాద్, మే 11 (వెలుతురు):** తెలంగాణ రాష్ట్ర విద్యుత్ సంస్థల నియామకాలలో రిజర్వేషన్ల అమలుపై తెలంగాణ వెనుకబడిన తరగతుల కమిషన్ విచారణ కొనసాగిస్తోంది. ఇప్పటికే ఎస్పీడీసీఎల్, ఎన్పీడీసీఎల్, ట్రాన్స్‌కో కార్యాలయాలను సందర్శించిన కమిషన్ సోమవారం జెన్‌కో కార్యాలయాన్ని సందర్శించి విచారణ చేపట్టింది. 2014 నుంచి ఇప్పటివరకు జరిగిన నియామకాలలో అనుసరిస్తున్న విధానాలు, బీసీలకు జరుగుతున్న అన్యాయాలను తెలంగాణ విద్యుత్ బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె. కుమారస్వామి కమిషన్ దృష్టికి తీసుకువచ్చారు. ఓసీ కటాఫ్ మార్కుల కంటే ఎక్కువ మార్కులు సాధించి రిజర్వేషన్ కేటగిరీలో నియమితులైన అభ్యర్థుల వివరాలపై కమిషన్ ఆరాతీసింది. దీనికి సంబంధించిన పూర్తి వివరాలను సమర్పించాలని జెన్‌కో సీఎండీ ఎస్. హరిష్, ఐఏఎస్‌ను కమిషన్ కోరింది. బీసీ ఉద్యోగులకు సంబంధించిన పలు ఇతర అంశాలపై కూడా సమావేశంలో చర్చ జరిగింది. ఈ సందర్భంగా బీసీ కమిషన్ ఛైర్మన్ జి. నిరంజన్ మాట్లాడుతూ సంస్థ యాజమాన్యం, ఉద్యోగులు సామరస్యపూర్వకంగా సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. సమావేశంలో చర్చించిన అంశాలపై సమగ్ర నివేదికను సమర్పించాలని సీఎండీని కోరారు. సమావేశంలో బీసీ కమిషన్ సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, శ్రీమతి రంగు బాలలక్ష్మి, సభ్య కార్యదర్శి బి. బాల మాయ దేవి, ఐఏఎస్, కమిషన్ అధికారులు, జెన్‌కో ఉన్నతాధికారులు, తెలంగాణ విద్యుత్ బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి వెంకన్నగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ రైజింగ్-2047తో భారీ పెట్టుబడుల దిశగా రాష్ట్రం




**హైదరాబాద్, మే 11 (వెలుతురు):** తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌లో భాగంగా రాష్ట్రంలో భారీ పెట్టుబడులను ఆకర్షించేందుకు పరిశ్రమలశాఖ అధికారులు సమర్థవంతంగా పనిచేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు సూచించారు. గౌరవ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు సోమవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో పరిశ్రమలశాఖ అధికారులతో, ప్రాజెక్ట్ కన్సల్టెంట్లతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు వివిధ రాష్ట్రాల పారిశ్రామికవేత్తలు ఆసక్తి చూపుతున్నారని సీఎస్ తెలిపారు. ఈ అవకాశాలను ఉపయోగించుకునేలా పరిశ్రమలశాఖ అధికారులు తగిన కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసి పారిశ్రామికవేత్తలతో సమన్వయం కొనసాగించాలని సూచించారు. ఎంఓయూలతో పాటు పెట్టుబడిదారులకు అవసరమైన మౌలిక వసతులు వేగంగా కల్పించాలని ఆయన ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి పథకాలతో పాటు కేంద్ర ప్రభుత్వం వివిధ రంగాలకు అందిస్తున్న ప్రోత్సాహకాలపై కూడా పెట్టుబడిదారులకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. భారీ పెట్టుబడుల ద్వారా స్థానిక యువతకు పెద్దఎత్తున ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని సీఎస్ అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, ఫార్మా రంగం, చేనేత ఉత్పత్తులు, టెక్స్‌టైల్ పార్కులు, ఐటీ పరిశ్రమలు, డేటా సెంటర్లు, డ్రైపోర్టుల రంగాల్లో పెట్టుబడులకు పారిశ్రామికవేత్తలు ఆసక్తి చూపుతున్నారని తెలిపారు. తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌కు ఆకర్షితులవుతున్న పెట్టుబడిదారులను మరింత ప్రోత్సహించేలా అధికార యంత్రాంగం పనిచేయాలని సీఎస్ సూచించారు. అమెజాన్, మైక్రోసాఫ్ట్, ఇన్ఫోసిస్ వంటి ప్రముఖ ఐటీ సంస్థలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొస్తున్నాయని అధికారులు సమావేశంలో వెల్లడించారు. ఫుడ్ ప్రాసెసింగ్, డెయిరీ రంగాల్లో కూడా పెట్టుబడుల అవకాశాలు పెరుగుతున్నాయని అధికారులు పేర్కొన్నారు. రాష్ట్రంలో వివిధ రంగాల్లో పెట్టుబడులు పెరగడంతో పాటు యువతకు విస్తృత స్థాయిలో ఉపాధి అవకాశాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ఈ సమావేశంలో పరిశ్రమలశాఖ డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తి తదితర అధికారులు పాల్గొన్నారు.

## హ్యామ్ ప్రాజెక్ట్ పురోగతిపై ఆర్ అండ్ బి మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సుదీర్ఘ సమీక్ష



హైదరాబాద్ (సచివాలయం) వెలుతురు మే 11: హ్యామ్ (HAM) ప్రాజెక్టుల పురోగతిపై రాష్ట్ర రోడ్లు, భవనాలు మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి శ్రీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి గారు డా. బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో సోమవారం అధికారులతో మూడు గంటల పాటు సుదీర్ఘంగా సమీక్ష సమావేశం నిర్వహించారు. ష్ట్రంలో చేపడుతున్న హ్యామ్ రోడ్ల ప్రాజెక్టుల పురోగతి, పనుల నాణ్యత, నిర్మాణ వేగం, ప్రజలకు కలిగే ప్రయోజనాలపై అధికారులతో మంత్రి సమగ్రంగా చర్చించారు. సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి గారు మాట్లాడుతూ.. మంచి రోడ్లతో రాష్ట్రంలోని ప్రతి గ్రామం,ప్రతి మండలం, ప్రతి పట్టణం అభివృద్ధి చెందుతుందన్నారు. రహదారుల అభివృద్ధి వల్ల పరిశ్రమలు ఏర్పడి మౌలిక వసతులు పెరుగుతాయని తెలిపారు. యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, తద్వారా రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి దోహదపడుతుందని పేర్కొన్నారు. అనంతరం టెండర్ ప్రక్రియ వివరాలపై అధికారులను మంత్రి ఆరా తీశారు. కేంద్ర రహదారుల రవాణా మంత్రిత్వ శాఖ (MoRTH) ప్రవేశపెట్టిన హ్యామ్ విధానాన్ని నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (NHAI) 2016 నుండి దేశవ్యాప్తంగా విజయవంతంగా అమలు చేస్తోందన్నారు. ఇప్పటివరకు 374కు పైగా ప్రాజెక్టులను రూ.4 నుండి 5 లక్షల కోట్ల పెట్టుబడులతో చేపట్టినట్లు వెల్లడించారు. జాతీయ స్థాయిలో విజయవంతమైన ఈ విధానాన్ని మహారాష్ట్ర, గుజరాత్, తమిళనాడు, కర్ణాటక, మధ్యప్రదేశ్, బీహార్ వంటి రాష్ట్రాలు ఇప్పటికే అమలు చేస్తున్నాయని, అదే నమూనాలో తెలంగాణ ప్రభుత్వం కూడా రాష్ట్ర రహదారి మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఎక్సెస్ టెండర్లు అంటూ వస్తున్న ఆరోపణలపై మంత్రి అధికారులను అడిగారు. హ్యామ్ అమలు చేసిన మహారాష్ట్ర, గుజరాత్, తమిళనాడు, కర్ణాటక, మధ్యప్రదేశ్, బీహార్ వంటి రాష్ట్రాలతో పోల్చి చూస్తే తెలంగాణలోనే ఎక్సెస్ తక్కువగా ఉందని అధికారులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. అవి అసత్య ప్రచారాలు అని గణాంకాలతో సహా మంత్రికి వివరించారు. HAM ఫేజ్ 1 కింద రోడ్లు మరియు భవనాల శాఖ ద్వారా రూ.13,006.27 కోట్ల వ్యయంతో 441 రహదారుల అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఇవి మొత్తం 6,092.37 కిలోమీటర్ల పొడవుతో 34 ప్యాకేజీలుగా అమలు అవుతున్నాయని పేర్కొన్నారు. అలాగే పంచాయతీ రాజ్ శాఖ ద్వారా రూ.6,250 కోట్లతో 2,162 రహదారుల నిర్మాణ పనులు 7,450 కిలోమీటర్ల పొడవుతో 17 ప్యాకేజీల రూపంలో కొనసాగుతున్నాయని వెల్లడించారు. ఈ ప్రాజెక్టుల అమలుకు ముందు టెక్నో ఎకనామిక్ ఫీజిబిలిటీ స్టడీస్ నిర్వహించి, NHAI నమూనాలోనే RFP మరియు DCA డాక్యుమెంట్లు రూపొందించి పారదర్శకంగా టెండర్లు ఆహ్వానించినట్లు అధికారులు వివరించారు. సాధారణ రహదారి పనులతో పోలిస్తే HAM ప్రాజెక్టుల్లో అదనపు ప్లాంట్ & మెషినరీ వినియోగం, ఆధునిక డిజైన్లు, సర్వేలు, 15 సంవత్సరాల నిర్వహణ బాధ్యత, పెట్రోలింగ్ వాహనాలు, అంబులెన్స్ సేవలు, ఇండిపెండెంట్ ఇంజనీర్ ఛార్జీలు, GST మరియు వడ్డీ భారం వంటి అంశాల కారణంగా అదనపు వ్యయం ఉంటుందని అధికారులు తెలిపారు. GST మరియు వడ్డీ ప్రభావం వల్ల మాత్రమే సుమారు 9.30 శాతం అదనపు భారం పడుతోందని పేర్కొన్నారు. ఇతర రాష్ట్రాల్లో చేపట్టిన HAM ప్రాజెక్టుల్లో కూడా భారీ పాజిటివ్ ఎక్సెస్ బిడ్ ట్రెండ్ నమోదైందని వెల్లడించారు. గుజరాత్‌లో 66 శాతం వరకు, మహారాష్ట్రలో 47 శాతం వరకు ఎక్సెస్ పాజిటివ్ బిడ్లు నమోదయ్యాయని తెలిపారు. NHAI ప్రాజెక్టుల్లో కూడా 50 శాతం వరకు అధిక బిడ్లు వచ్చిన ఉదాహరణలు ఉన్నాయని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా మారుతున్న ఆర్థిక పరిస్థితుల ప్రభావంతో ఇంధనం, బిటుమెన్, స్టీల్, సిమెంట్ తదితర నిర్మాణ సామగ్రి ధరలు భారీగా పెరిగాయని, ముఖ్యంగా బిటుమెన్ ధరలు దాదాపు 100 శాతం వరకు పెరిగినట్లు అధికారులు తెలిపారు. దీంతో ప్రాజెక్టు వ్యయంపై 20 నుండి 25 శాతం వరకు ప్రభావం పడుతుందన్నారు. టెండర్ ప్రక్రియ ప్రారంభమైన సమయంలో బిటుమెన్ ధర మెట్రిక్ టన్నుకు రూ.44 వేలుగా ఉండగా, ప్రస్తుతం రూ.89 వేల వరకు చేరిందని, అంటే దాదాపు 100 శాతం పెరుగుదల నమోదైందని అధికారులు వివరించారు.

Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICATIONS H.No. 7231/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com